అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400



ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



రగులుతున్న అమెరికా
సిరియాలో మళ్లీ అంతర్యుద్ధం
సరైన సమయంలో భారత్ పర్యటన
సెప్టెంబర్‌లో క్వాడ్, ఎస్‌సిఒ –
మోదీ గడసాము
లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 229 | శనివారం | 19-07-2025 | మహబూబ్‌నగర్ — Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar — పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## రెండు రాష్ట్రాలు సమానమైతే
# రాయలసీమ ఎత్తిపోతలను రద్దు చేయాలి



- పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలకు అడ్డుపడొద్దు
- ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- మా వినతిని వినకపోతే పోరాడి సాధించుకుంటాం
- ఆ ఉద్యమానికి నేనే నేతృత్వం వహిస్తా
- ఉమ్మడి రాష్ట్రంలో కంటే కెసిఆర్ హయాంలోనే పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులకు ఎక్కువ ద్రోహం
- రెండేళ్లలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రాజెక్టులను పూర్తిచేస్తాం
- ప్రజాపాలన ప్రగతిబాట సభలో ముఖ్యమంత్రి
- నాగర్‌కర్నూల్ జిల్లా జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన



### 2034 వరకు పాలమూరు బిడ్డే సిఎం

''కెసీఆర్ నీ గుండెలపై రాసి పెట్టుకో..2034 వరకు ఈ పాలమూరు బిడ్డ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా ఉంటాడు.. పాలమూరు గడ్డ నుంచే ప్రభుత్వాన్ని నడిపిస్తాడు. అక్కడ సూర్యుడు ఇక్కడ మొలిచినా పాలమూరును అభివృద్ధి చేసితీరుతాం''అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణలోని 3,52,635 స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల కోసం రూ. 344 కోట్లతో చెక్కులను ఈ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పంపిణీ చేశారు.

**హైదరాబాద్ :** మీరు రెండు రాష్ట్రాలను సమానంగా, తెలుగువాళ్ళను అభివృద్ధి చేయాలన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన నిజమే అయితే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజక్టును తక్షణమే రద్దు చేయాలని, పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజక్టులకు అడ్డం పడొద్దని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తిని, వినకపోతే పోరాడి సాధించుకునే శక్తి ఉందని, దాని తానే నేతృత్వం వహిస్తానని చెప్పారు. పాలమూరు పెండింగ్ ప్రాజెక్టులు ఉమ్మడి రాష్ట్రంలో కంటే కెసిఆర్ హయాంలో ఎక్కువ ద్రోహం చేశారని విమర్శించారు. రెండేళ్ళలో తమ ప్రభుత్వం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రాజెక్టులను పూర్తి చేస్తుందని, అందుకు సంబంధించిన భూ సేకరణకు డిసెంబర్ 9లోగా నిధులను విడుదల చేస్తుందని ప్రకటించారు. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం జటప్రోలులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, ఎంపి డాక్టర్ మల్లు రవి, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సిలు,

తరువాయి 2లో

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్
# ఆరుగురు మావోయిస్టులు హతం
### కొనసాగుతున్న కాల్పులు



ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మరోసారి ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. శుక్రవారం నారాయణ్‌పూర్ జిల్లాలో భద్రతా బలగాలు మావోయిస్టులకు నడుమ చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు ఆ రాష్ట్రపోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి. భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య మధ్యాహ్నం నుండి పలుమార్లు కాల్పులు జరిగాయని, చీకటి పడే సమయం వరకు ఎన్‌కౌంటర్ చోటుచేసుకున్నప్రాంతం నుండి ఆరు మృతదేహాలు స్వాదీనం చేసుకున్నారు. ఏకే 47, ఎస్‌ఎల్‌ఆర్ రైఫిల్స్, ఇతర ఆయుధాలు, పేలుడు పదార్థాలు, నిత్యవసర సరుకులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కాగా ఆపరేష్ ఇంకా కొనసాగుతోంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# మహానగరం జలమయం





ప్రజాపక్షం/హైదరాబాద్

- గ్రేటర్ హైదరాబాద్‌ను ముంచెత్తిన వాన
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పలుప్రాంతాల్లో జంక్షన్లు జామ్
- రోడ్లపై విరిగిపడిన చెట్లు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం
- బోయిన్‌పల్లిలో అత్యధికంగా 9.3 సెం.మీ. వర్షం
- రాష్ట్రంలో మరో నాలుగురోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక

గ్రేటర్ హైదరాబాద్‌లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి చాలా ప్రాంతాల్లో వరద నీరు ముంచేత్తింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రహదారులు చెరువులను తలపించాయి. నగరంలోని అనేక ప్రాంతాల్లో జంక్షన్‌లు జామ్ అయ్యాయి. జనం ట్రాఫిక్ జామ్‌తో నరకయాతన అనుభవించారు. జిహెచ్‌ఎంసి, హైడ్రా, డిఆర్‌ఎఫ్ బృందాలు ఎప్పటికప్పుడు వర్షపు నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాయి. రోడ్లపై విరిగిపడిన చెట్లను క్రమక్రమంగా తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. గాలి దుమారంతో తరువాయి 2లో

### అప్రమత్తంగా ఉండాలి : సిఎం ఆదేశం

హైదరాబాద్‌లో భారీ వర్షం నేపథ్యంలో సంబంధిత అధికారులు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఆదేశించారు. జిహెచ్‌ఎంసి, హెచ్ ఎండిఎ, వాటర్ వర్క్స్, విద్యుత్, పోలీస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్, హైడ్రా బృందాలు, ఇతర విభాగాల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వర్షంతో ఇబ్బందులు పడుతున్న ప్రాంతాల్లో ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సిఎం ఆదేశించారు.

## జడ్జిమెంట్ ఇచ్చేందుకు కాదు..



- బనకచర్ల సమస్య పరిష్కారం కోసమే తెలుగు రాష్ట్రాల సిఎంలను పిలిచాం
- బిఆర్ఎస్‌ది ద్వంద్వ వైఖరి
- త్వరలోనే వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ సమస్యకు పరిష్కారం
- కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులను ఢిల్లీకి పిలిచింది జడ్జిమెంట్ ఇవ్వడానికి కాదని, బనకచర్ల ప్రాజెక్టు సమస్య పరిష్కారం కోసం పిలిచామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటే చేసుకుంది అంటున్నారని, చేసుకోకపోతే ఎందుకు జోక్యం చేసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారని అన్నారు. ఇద్దరు ముఖ్యమంత్రులను కూర్చోపెట్టాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఒక పాలసీ, అధికారంలో లేనప్పుడు మరొక్క పాలసీ అవలంబిస్తోందని మండిపడ్డారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అనేక పాత్రలు పోషించారంటూ ఎద్దేవా చేశారు. కేంద్రానికి తరువాయి 2లో



## కనీస ఉమ్మడి కార్యక్రమంతో
# ప్రతిపక్ష ఐక్యత

- సిపిఐ ముసాయిదా రాజకీయ తీర్మానం విడుదల
- ఆర్‌ఎస్‌ఎస్–బిజెపికి వ్యతిరేకంగా సైద్ధాంతిక స్పష్టత
- దాని ఆధారంగానే సూత్రబద్ధ సహకారం, లౌకిక ప్రజాస్వామ్య శక్తుల సమీకరణ
- రాజ్యాంగం, ప్రజాస్వామ్య సంస్థల రక్షణే ప్రధాన రాజకీయ కర్తవ్యం
- సెప్టెంబర్‌లో 21–25 తేదీలలో చండీగఢ్‌లో సిపిఐ 25వ మహాసభ ముసాయిదా తీర్మానంపై చర్చ

**న్యూఢిల్లీ :** కనీస ఉమ్మడి కార్యక్రమం ద్వారా ప్రతిపక్ష ఐక్యతను బలోపేతం చేయడానికి ప్రయత్నాలు చేయాలని సిపిఐ ముసాయిదా రాజకీయ తీర్మానం పేర్కొంది. మతపరమైన విభజనను బిజెపి తీవ్రతరం చేసిందని, సంస్థాగత స్వయంప్రతిపత్తిని కబళించిందని, కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరించిందని అది పేర్కొంది. రాజ్యాంగం, ప్రజాస్వామ్య సంస్థల రక్షణను పార్టీ ప్రధాన రాజకీయ కర్తవ్యంగా చూస్తుందని స్పష్టం చేసింది. ఢిల్లీలోని అజయ్‌భవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో సెప్టెంబర్‌లో చండీగఢ్‌లో జరగనున్న సిపిఐ 25వ జాతీయ మహాసభలో ప్రవేశపెట్టనున్న రాజకీయ తీర్మానం ముసాయిదాను సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విడుదల చేశారు. మీడియా సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లబ్ సేన్‌గుప్తా, డాక్టర్ బి.సి.కాంగో, సయ్యద్ అజీజ్‌పాషా, అన్నీ రాజా, గిరీశ్‌శర్మ పాల్గొన్నారు. రాజకీయ తీర్మానంలో ముఖ్యాంశాలు ఇలా ఉన్నాయి. '' ఆర్‌ఎస్‌ఎస్— బిజెపి రాజ్, వారి వినాశకరమైన విధానాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక స్పష్టత, సూత్రబద్ధమైన సహకారం ఆధారంగా ప్రజాస్వామ్య, లౌకిక శక్తులను సమర్థవంతంగా సమీకరించడానికి కట్టుబడి ఉన్నట్లు'' సిపిఐ పేర్కొంది. 'బిజెపి పరిపాలనలో ఆర్థిక వ్యవస్థ మరింత అసమానంగా,

తరువాయి 12లో

## వినియోగంలోకి
# జలవిద్యుత్ ప్రాజెక్టులు

- పవర్ ప్రాజెక్ట్ యూనిట్లు ఆలస్యం కాకుండా చూసుకోవాలి : డిప్యూటీ సిఎం భట్టి
- నాగార్జున సాగర్ జెన్‌కో పవర్ హౌస్ పరిశీలన
- లోక్‌సభ ఎన్నికల్లో గుండుసున్నా వచ్చినా బిఆర్‌ఎస్ నేతల తీరు మారలేదని విమర్శ



ప్రజాపక్షం/నందికొండ

రాష్ట్రంలోని అన్ని హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ ప్రాజెక్టులలోని అన్ని యూనిట్లు వినియోగంలోకి తీసుకు రావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి , ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు.శుక్రవారం అయన నాగార్జునసాగర్ జెన్‌కో పవర్ హౌస్ లో రాష్ట్రంలోని హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. ముందుగా అధికారులు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఆయా పవర్ ప్రాజెక్టుల వారీగా ప్రస్తుత పరిస్థితిని వివరించారు. నిర్దేశించిన సమయం ప్రకారం వాటిని పూర్తి చేయాలన్నారు .పవర్ ప్రాజెక్టు యూనిట్లు ఆలస్యం కాకుండా చూసుకోవాలని, ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం ఉండవద్దని,అన్ని ప్రాజెక్టుల పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని,ఇందుకొక క్యాలెండర్ ను రూపొందించాలని,ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో దాని ప్రకారం ప్రతి వారం సమీక్షించాలని, ముందు నుండే సమీక్షలు నిర్వహించాలని చెప్పారు. ప్రతి సంవత్సరం పవర్ కు డిమాండ్ పెరుగుతున్నదని, సంవత్సర కాలంలోనే 2000 మెగావాట్ల పవర్ డిమాండ్ పెరిగిందని, పెరుగుతున్న పవర్ డిమాండ్‌ను దృష్టిలో తరువాయి 2లో

## లోకేష్‌ను కలువలేదు..
# కలిస్తే తప్పేంటి?




- సిఎం రేవంత్‌రెడ్డి తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- ఆయన మంత్రుల ఫోన్లే ట్యాప్ చేయిస్తున్నారు
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్


ప్రజాపక్షం/ ఖమ్మం

ఆంధ్రప్రదేశ్ మంతి నారా లోకేశ్‌ను కలిసిస్తే తప్పేమిటని, యువ నాయకుడైన లోకేష్‌కు, తనకు సత్సంబంధాలున్నాయని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ అన్నారు. అర్ధరాత్రి తాను లోకేష్‌ను కలిసినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుడుగా ప్రచారం చేస్తున్నారని, తాను ఏం చేసినా బాజాప్తగా చేస్తానన్నారు. సిఎం సీటుకు ఎవరు ఎసరు పెడతారనే భయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన క్యాబినెట్‌లోని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి ల ఫోన్లను ట్యాప్ చేయిస్తున్నాడని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటిఆర్ తరువాయి 12లో

# ఈ ఏడాదైనా పూర్తయ్యేనా?

- కాజీపేటలో సాగుతున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు
- నేడు పనులను పరిశీలించనున్న కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్





ప్రజాపక్షం/హనుమకొండ

కాజీపేటలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రైల్వే కోచ్ ఫ్యాక్టరీ పనులు రెండేండ్లుగా సాగుతూనే ఉన్నాయి. ఈ పనులను ఈ ఏడాది ఆగస్ట్ నాటికి పూర్తి చేయాలని కేంద్రం టార్గెట్ పెట్టుకోగా ఇప్పటివరకు 73 శాతం పనులు పూర్తికాగా... మిగతా పనులను సైతం త్వరలోనే పూర్తి చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాగా తొలుత కాజీపేట కేంద్రంగా పీరియాడికల్ ఓవర్ హాలింగ్ వర్క్ షాప్ (పీఓహెచ్) ఏర్పాటు చేయనున్నట్లు 2010లో కేంద్రం ప్రకటించగా ఆ తరువాత 2016లో పీఓ హెచ్‌ను వ్యాగన్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌గా అప్ గ్రేడ్ చేశారు. ఈ పనులకు 2023 జులై 8న ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. దీంతో తరువాయి 12లో

## 'పంచాయతీరాజ్ చట్టం-2018 ఆర్డినెన్స్ ముసాయిదా'పై
# గవర్నర్ న్యాయ సలహా!
### ఇతర రాష్ట్రాలలో అమలు తీరుపై ఆరా?

ప్రజాపక్షం/హైదరాబాద్



'తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ చట్టం 2018' సవరణ ఆర్డినెన్స్ ముసాయిదా ఆమోదం విషయంలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ న్యాయసలహా కోరినట్టు సమాచారం. స్థానిక సంస్థలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే విషయమై 'పంచాయతీరాజ్ చట్టం 2018 'ను సవరిస్తూ మంత్రివర్గం తీర్మానం చేస్తూ ఆర్డినెన్స్ ముసాయిదాను గవర్నర్‌కు పంపించారు. ఆర్డినెన్స్ ప్రకారం రాష్ట్రంలో రిజర్వేషన్ల సంఖ్య 67 శాతానికి పెరుగుతుంది. (బిసిలకు 42, ఎస్‌సిలకు 18,ఎస్‌టిలకు 10శాతం) . అయితే సుప్రీం కోర్ట్ నిర్దేశించిన 50 శాతం పరిమితి దాటుతున్న నేపథ్యంలో ఆర్డినెన్స్ ఆమోదం విషయంలో న్యాయ సలహా తీసుకుంటున్నట్టు తెలిసింది. అయితే గత సుప్రీం తీర్పు ప్రకారం గవర్నర్లు తరువాయి 2లో



## ప్రమాదవశాత్తు గోడకూలి ఇద్దరు కూలీలు మృతి

ప్రజాపక్షం / చెన్నూరు

ప్రమాదవశాత్తు గోడ కూలి ఇద్దరు మృతిచెందిన ఘటన మంచిర్యాల జిల్లా, కోటపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రెడ్డి మధునయ్య, శేగం తిరుపతి అనే ఇద్దరు కూలీలు శుక్రవారం పాత ఇళ్లు కూల్చే పనికి వెళ్లారు. పనకంటి శ్రీనివాస్‌కు చెందిన ఇంటిని కూల్చివేస్తుండగా ప్రమాదవశాత్తు గోడ కూలి ఇద్దరు కూలీలపై పడింది. వెంటనే వారిని 108 అంబులెన్సులో తరువాయి 2లో




# ప్రపంచం
WORLD NEWS

## చర్చిపై దాడి తప్పే

### అంగీకరించిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు

**వాషింగ్టన్:** గాజాలో క్యాథలిక్ చర్చిపై దాడి చేయడం తమ తప్పిదమేనని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు అంగీకరించారు. ఇద్దరి ప్రాణాలు హరించి, మరికొందరిని తీవ్రంగా గాయపచిన ఘటనపై అమెరికా డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నెతన్యాహుకు ఆయన ఫోన్ చేసి, ఇదే విషయాన్ని ప్రస్తావించారు. వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లెవిట్ ఈ సంభాషణ వివరాలను విడుదల చేశారు. గాజాలోని ఏకైక చర్చిపై దాడి జరగడాన్ని అమెరికా తీవ్రంగా ఖండించగా, ఇజ్రాయెల్ ప్రధాని పొర పాటు జరిగినట్లు ట్రంప్‌కు తెలిపారు. అనంతరం ఇజ్రాయెల్ అధికా రికంగా ఒక ప్రకటన చేసింది. గాజాలో చర్చిపై దాడి పట్ల విచారం వ్యక్తం చేసింది. ఆ దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సాను భూతి ప్రకటించింది. దాడిపై విచారణ ప్రారంభించినట్లు ఇజ్రాయెల్ ప్రధాని కార్యాలయం పేర్కొంది. ఇలా వుంటే, జనావాసాలు, ప్రార్థనా మందిరాలు, విద్యాలయాలపై ఇజ్రాయెల్ దాడులు ఇదే మొదటి సారి కాదు. ఈసారి ఏ కంగా క్యాథలిక్ చర్చిపైదాడి జరపడంతో అమెరికా తీవ్రంగా స్పందించింది.

# రగులుతున్న అమెరికా




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలకు వ్యతిరేకంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. 'పబ్లిక్ సిటిజెన్' ఆధ్వర్యంలో చేపట్టిన ప్రదర్శనలు, ర్యాలీలకు ఆ సంస్థ సహఅధ్యక్షురాలు లీసా గిల్బర్ట్ నాయకత్వం వహించారు. అమెరికాలో మానవ హక్కుల ఉద్యమకర్త మార్టిన్ లూథర్ కింగ్‌కు ముఖ్య అనుచరుడిగా, ఆయన పంథాలోనే నడిచిన జాన్ లూయిస్ అందించిన స్ఫూర్తితోనే ఆందోళనలు ఉధృతం చేస్తామని లీసా ప్రకటించారు. అక్రమ వలసల పేరుతో వేధింపులు, ఆరోగ్య బీమాలో మార్పులు, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులకు ఉద్వాసన వంటి చర్యలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. దేశ వ్యాప్త నిరసనలు ప్రారంభం కావడం అమెరికాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులకు అద్దం పడుతున్నది.



## ఉక్రేన్‌కు ప్యాట్రియట్ క్షిపణి

### అందించేందుకు సిద్ధమని నాటో ప్రకటన

బ్రసెల్స్: రష్యాపై ఉక్రేన్ దాడులు చేయడానికి ఆయుధాలు సరఫరా చేస్తున్న నాటో కూటమి ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. రష్యా దాడుల నుంచి ఉక్రేన్‌ను రక్షించేందుకు వీలుగా శక్తివంతమైన రక్షణ కల్పించే ప్యాట్రియట్ క్షిపణి వ్యవస్థను అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది. ఉక్రేన్‌కు మరిన్ని ప్యాట్రియట్ మిస్సైల్ సిస్టమ్స్ పంపిణీ చేయడానికి అమెరికా, జర్మనీ, నెదర్లాండ్స్ దేశాలు సిద్ధంగా ఉన్నాయని, రష్యా అధిక శక్తితో దాడులు చేస్తున్న నేపథ్యంలో ఇది తక్షణ అవసరంగా మారిందనినాటోకు యూరోప్ కమాండర్‌గా వ్యవహరిస్తున్న జెన్ క్రిస్టోఫర్ గ్రీన్‌కెవిచ్ ప్రకటించారు. ఈ వ్యవస్థ శత్రు క్షిపణులు, డ్రోన్లు, విమానాలను గుర్తిస్తుంది. నియంత్రిస్తుంది. దాడి జరిపి నాశనం చేస్తుంది. ప్రత్యేకించి, 70–160 కిలోమీటర్ల పరిధిలో బాలిస్టిక్ మిసైల్‌ను నిలువరించడానికి ఈ వ్యవస్థ ఉపయోగపడుతుంది. రష్యా ప్రయోగిస్తున్న ఇస్కాండర్, కలిబర్ వంటి ఖచ్చిత లక్ష్య క్షిపణులను అడ్డగించగలదు. ఇలావుంటే, జర్మనీ, నెదర్లాండ్స్ దేశాలు ఇప్పటికే ఉక్రేన్‌కు రెండు ప్యాట్రియట్ సిస్టమ్స్ ఇచ్చాయి. ఇప్పుడు నాటో కూటమి నేరుగా సహకరించనుంది. రష్యా–ఉక్రేన్ యుద్ధాన్ని నిలువరించడానికి ప్రయత్నించకుండా, మరింత రెచ్చగొడుతూ, అమెరికా, ఐరోపా దేశాలు ఆయుధ వ్యాపారం చేస్తున్న విషయం తెలిసిందే. నాటో కూటమి తాజాగా తీసుకున్న నిర్ణయం కూడా ఇలాంటిదే.

## సరైన సమయంలో భారత్ పర్యటన

### నేపాల్ ప్రధాని ఓలి



**ఖట్మండు:** సరైన సమయంలో భారత్‌లో పర్యటిస్తానని, ఈ విషయంపై ఇరు దేశాల అధికారులు కసరత్తు చేస్తున్నారని నేపాల్ ప్రధాని కెపి శర్మ ఓలి అన్నారు. నేపాలీ యూట్యూబ్ చానెల్ 'దిశానిర్దేశ్' టివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ భారత్ పర్యటనకు వెళ్లే అవకాశాలు లేకపోలేదని అన్నారు. ఇరు వైపుల నుంచి సంబంధిత అంశాలపై స్పష్టత వచ్చిన తరాఇ్వత పర్యటన ఉంటుందని పేర్కొన్నారు. అయితే, ఎప్పుడు వెళతారనేది ఆయన స్పష్టం చేయలేదు. గత ఏడాది జులైలో కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ నేపాల్ (యూనిఫైడ్ మార్క్సిస్ట్–లెనినిస్ట్) పార్టీ (సిపిఎన్–యుఎంఎల్) అధికారంలోకి వచ్చిన తర్వాత, పార్టీ చైర్మన్‌గా ఉన్న ఓలి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు. పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత నేపాల్ ప్రధాని భారత్ పర్యటనకు రావడం ఆనవాయితీగా వస్తుండగా, ఓలి అందుకు భిన్నంగా చైనా పర్యటనకు వెళ్లడం అప్పట్లో చర్చనీయాంశమైంది. భారత్‌కు ఓలి అంటే పడదనే వాదన చాలాకాలంగా బలంగా వినిపిస్తున్నది. అయితే, ఈ ప్రచారాన్ని ఓలి ఖండించారు. నేపాల్‌కు చైనా, భారత్ రెండూ అత్యంత కీలకమైన మిత్రదేశాలని పేర్కొన్నారు. నేపాల్ పర్యటనకు రావాల్సిందిగా భారత ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించానని, బహుశా ఈ ఏడాది నవంబర్ మాసంలో ఆయన పర్యటన ఉండవచ్చని పేర్కొన్నారు. భారత్‌లో పర్యటించాల్సిందిగా ఇప్పటి వరకూ ఎలాంటి ఆహ్వానం ఓలికి అందలేదన్న వార్త కూడా ప్రచారమవుతున్నది. అయితే, దీనిపై ఆయన స్పందించలేదు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్, చైనా దేశాలతో నేపాల్‌కు సత్సంబంధాలు ఉన్నాయన్నారు. భారత్ పర్యటనకు సరైన సమయం అవసరమని వ్యాఖ్యానించారు.

## సిరియాలో మళ్లీ అంతర్యుద్ధం

**డమాస్కస్:** సిరియాలో మళ్లీ అంతర్యుద్ధం మొదలైంది. ద్రూస్, బెడౌయిన్ వర్గాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కనీసం వారం రోజులు కూడా అమలుకాలేదు. పలు ప్రాంతాల్లో ఇరు వర్గాల మధ్య తిరిగి ఘర్షణలు చెలరేగడంతో, సిరియా ప్రభుత్వం సైన్యాన్ని అప్రమత్తం చేసింది. సిరియా దక్షిణ ప్రాంతం, ప్రత్యేకించి స్వెయిదా ప్రావీన్స్‌లో ఘర్షణలు తీవ్ర స్థాయికి చేరగా, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ద్రూస్ అనేది ఇస్లాం నుంచి పుట్టిన ప్రత్యేక మతం. ఎక్కువగా సిరియా, లెబనాన్, ఇజ్రాయెల్, జోర్డాన్ లో నివసిస్తారు. గోప్యంగా మతాచారాలు పాటిస్తారు. తమ మతాన్ని బయట వ్యక్తీకరించడానికి ఇష్టపడరు. సిరియా జనాభాలో సుమారు 3 శాతం మంది ద్రూస్‌లు. స్వెయిదా ప్రాంతంలో వీరి సంఖ్య ఎక్కువ. ఇక అరబ్ సంస్కృతికి చెందిన నోమాడిక్ (చరిత్రకంగా గడ్డి మేకలతో సంచరించే) జాతులైన బెడౌయిన్‌తో వీరి ఘర్షణ దశాబ్దాలుగా కొనసాగుతున్నది. ద్రూస్‌ల వద్ద ఎక్కువగా సాగు భూములు ఉన్నాయి. తరచూ బెడౌయిన్‌ల మేకలు, ఒంటెలతో భూముల్లోకి ప్రవేశించడం ఘర్షణలకు దారితీసింది. నీటి వనరులపై స్వాధీనం కోసం కూడా యుద్ధాలు జరుగుతున్నాయి. ద్రూస్‌లు తమను తాము రక్షించుకునే మిలీషియాలను ఏర్పాటు చేసుకున్నారు. బెడౌయిన్‌లకు కొన్ని చోట్ల ప్రభుత్వ మద్దతు ఉంది. మరి కొన్ని ప్రాంతాల్లో వారు తిరుగుబాటుదారులకు మద్దతు ఇస్తున్నారు. ద్రూస్‌లలో 'బలిజా' అనే రీతిలో ప్రతీకారం తీసుకునే సంప్రదాయం ఉంది. బెడౌయిన్‌లు కూడా గౌరవం, పరువు విషయంలో ఆగ్రహం వ్యక్తం చేయడంలో వెనుకాడరు. ఇరు వర్గాలు పంతాలకు పోవడంతో, సిరియాలో అంతర్యుద్ధం తీవ్ర స్థాయికి చేరింది. ప్రభుత్వ చర్యలు అనుకున్న స్థాయిలో ఫలితాలను ఇవ్వడం లేదు. సుమారు వారం రోజుల క్రితం ఇరు వర్గాల మధ్య కాల్పుల ఒప్పంద విరమణ ఒప్పందం జరిగింది. కానీ, అది ఎక్కువ కాలం సాగలేదు.



## జడ్జిమెంట్ ఇచ్చేందుకు కాదు..

(మొదటి పేజీ తరువాయి)

జోక్యం చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం లేఖ రాసిందని, ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశాన్ని బిఆర్‌ఎస్ తప్పు పట్టడం ఏంటి అంటూ ప్రశ్నించారు. ఒక రాష్ట్రానికి అనుకూలంగా, మరొక రాష్ట్రానికి వ్యతిరేకంగా తీర్పు ఇవ్వరన్నారు. కృష్ణా, గోదావరి జలాలపైన ఇద్దరు ముఖ్యమంత్రులు వేర్వేరు ఎజెండాలతో వచ్చారన్నారు. గోదావరి జలాల వినియోగంపైన రేవంత్ రెడ్డి ఏదైనా కార్యాచరణ రూపొందించారా? అని ప్రశ్నించారు. కేంద్రాన్ని, మోదీని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. రెండు రాష్ట్రాలకు న్యాయం చేయాలనేదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమన్నారు. యూరియా కొరత లేకుండా చూసే బాధ్యత కేంద్రానిదన్నారు. బ్రిటీష్ కాలంలో ఉన్న రిజర్వేషన్లను ముస్లిం రిజర్వేషన్లు ఎట్లా అవుతాయని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం బిసి ముస్లింల పేరు మీద పది శాతం రిజర్వేషన్ ఇచ్చిందన్నారు. పది శాతం పోతే బిసిలకు దక్కేది 32 శాతం మాత్రమే అని అన్నారు. దీనివల్ల బిసిలకు మేలు జరుగుతుందా, అన్యాయం జరుగుతుందా ఆలోచించాలన్నారు. మతపరమైన రిజర్వేషన్లు పక్కన పెట్టి బిసిలకే ఇవ్వాలన్నదే బిజెపి విధానమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

**త్వరలోనే వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ సమస్యకు పరిష్కారం :** త్వరలోనే వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారం కాబోతుందని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎంపి బుర నర్సయ్య గౌడ్, మాజీ ఎమ్మెల్యే ప్రేమ్‌సింగ్ రాథోడ్, నాయకులు ఎన్.వి.సుభాష్, ప్రకాష్ రెడ్డిలతో కిషన్ రెడ్డి మాట్లాడుతూ ఆ నాటి ప్రధాని పి.వి. నరసింహారావు హయాం నుంచి వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ కావాలని అనేక పోరాటాలు జరిగాయన్నారు. రైలు మ్యాను ఫ్యాక్చరింగ్ యూనిట్ (ఆర్యంయు)కి ప్రధాని మోదీ భూమి పూజ చేశారని, రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ 60 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ పనుల పురోగతిని పరిశీలిస్తారని చెప్పారు. రైలు ఇంజన్, కోచ్, వ్యాగన్స్ ఉత్పత్తి అయ్యేలా ప్లాన్ చేస్తున్నామన్నారు. ముందుగా రైలు ఇంజన్ తయారీ చేయాలని నిర్ణయించామని చెప్పారు.

**రూ.2 వందల కోట్లతో ప్రారంభమై.. మరో రెండు వందల కోట్లకు పేరిగే అవ–కాశం :** రైలు మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ వచ్చే ఏడాది ఉత్పత్తి ప్రారంభించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నామని కిషన్ రెడ్డి అన్నారు. రెండు వందల కోట్లతో ప్రారంభమైందని, మరో రెండు వందల కోట్ల వరకు బడ్జెట్ పెరిగే అవకాశం ఉందని కిషన్ రెడ్డి వెల్లడించారు. వరంగల్‌లో ఆధునికమైన కోచ్‌లు తయారు చేసే అవకాశం ఉందన్నారు. సుమారు మూడు వేల మందికి ఉపాధి అవకాశం లభిస్తుందన్నారు. ఇక్కడ నివసించే రాజస్థాన్ ప్రజలు రైలు కావాలని కోరుతున్నారని, శనివారం రాజస్థాన్‌కు రైల్ ప్రారంభిస్తున్నామన్నారు. ఎంఎంటిఎస్ రెండో పేజ్ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, కానీ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందానికి కట్టుబడి లేదని విమర్శించారు. యాదగిరిగుట్టకు ఎంఎంటిఎస్‌ను విస్తరిస్తున్నామన్నారు. కొమురవెల్లి రైల్వే స్టేషన్ జనవరిలో భక్తులకు అంకితం చేస్తామన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కూడా వచ్చే సంవత్సరం ప్రజలకు అంకితం చేస్తామని ప్రకటించారు. కాచిగూడ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు కూడా ప్రారంభిస్తామని వివరించారు.

**వరంగల్‌కు మెగా టెక్స్ లైట్ పార్క్ తీసుకువచ్చాం :** వరంగల్‌కు మెగా టెక్స్ టైల్ పార్క్ తీసుకురావడం జరిగిందని కిషన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. పాలకులు మాత్రం హైదరాబాద్ చుట్టే ఆలోచన చేస్తున్నారని వ్యాఖ్యనించారు. వరంగల్ విమానాశ్రయానికి భూమి సేకరించి ఇవ్వాలని గత సిఎం కెసిఆర్‌కు అనేక లేఖలు రాసినట్లు చెప్పారు. కెసిఆర్ రాళ్లు వేయడం, విమర్శించడం తప్ప, భూమి సేకరించి ఇవ్వలేదని అన్నారు.

## ఇద్దరు కూలీలు మృతి

(మొదటి పేజీ తరువాయి)

చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే మార్గమధ్యలోనే ఆ ఇద్దరు కూలీలు మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఆ రెండు కుటుంబాల్లో పెద్ద దిక్కును కోల్పోవడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. విషయం తెలిసిన ఎస్ఐ రాజేందర్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

## మహానగరం జలమయం

(మొదటి పేజీ తరువాయి)

చాలా ప్రాంతాల్లో చెట్లు విరిగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి జనం తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కార్యాలయాలు, పాఠశాలలు వదిలే సమయం కావడంతో ఒకసారిగా వచ్చిన వరదనీటి ఉధృతికి విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. సికింద్రాబాద్ సెయింట్ ఫ్రాన్సిస్ స్కూల్ సమీపంలో వరద నీరు మోకాళ్ళ లోతుకుపైగా చేరుకుంది. దీంతో విద్యార్థులను పాఠశాల యాజమాన్యం బయటికి రానివ్వలేదు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఆటోడ్రైవర్లు విద్యార్థులను దగ్గరుండి తీసుకెళ్లారు. మోకాళ్ళ లోతు వరద నీరుచేరడంతో విద్యార్థులు ఇబ్బందులు వర్ణాతీతంగా మారాయి. బోయిన్‌పల్లిలోని సాయిబాబా కాలనీ, సీతారాంపురం, హర్షవర్ధన్ కాలనీ, రామ్ రెడ్డి కాలనీ, శ్రీనివాస్ నగర్ కాలనీ, సహా పలు కాలనీల్లో చెరువులను తలపించేలా భారీగా వరద నీరు చేరింది. భారీగా వస్తున్న వరద నీళ్లకు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భారీగా వరద నీరు వచ్చి చేరడంతో పాదచారులు భయాందోళనకు గురికాగా, ఇళ్లలోకి వెళ్లేందుకు కంటోన్మెంట్ సానిటరీ సిబ్బంది వారికీ సాయం చేశారు. లోతట్టు ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ ఏ.వి.రంగనాథ్ పర్యటించారు. సహాయ చర్యలను పర్యవేక్షించారు.

**నిండు కుండలా హుస్సేన్ సాగర్:** ఎగువ ప్రాంతాల నుంచి హుస్సేన్ సాగర్ కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. బంజారా హిల్స్, పికెట్, కూకట్ పల్లి నాళాల నుంచి హుస్సేన్ సాగర్ లోకి వస్తున్న వరద కారణంగా సాగర్ నిండుకుండలా మారింది. హుస్సేన్ సాగర్‌లో నీటిమట్టం ఫుల్ ట్యాంక్ లెవెల్ కు చేరుకుంది. హుస్సేన్ సాగర్ ప్రస్తుత నీటి మట్టం 513.38 మీటర్లకు చేరుకుంది. దీంతో నిండుకుండలా మారింది. హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ 513.41 మీటర్లు. శుక్రవారం కురిసిన వర్షానికి కేవలం 0.3 మీటర్లే ఉంది. పూర్తి స్థాయిలో నిండిపోతుందని అధికారులు తెలిపారు. భారీగా వరద నీరు చేరటంతో నిండుకుండలా ప్రమాదకరంగా సాగర్ మారిపోయింది. ఎలాంటి ప్రమాదం జరగకుండా ఉండేందుకు నీళ్లను తూముల ద్వారా మిగులు జలాలలను దిగువకు విడుదల చేశారు.

**బోయిన్ పల్లిలో అత్యధిక వర్షపాతం :** హైదరాబాద్‌లో దాదాపు మూడు గంటలు కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. బోయిన్ పల్లిలో అత్యధికగా 9.3 సెం.మీ. వర్షం నమోదైంది. బండ్లగూడలో 9.18 సెంమీ వర్షం కురిసింది. 11 ప్రాంతాల్లో 7 నుంచి 8 సెంటీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ కేంద్రం వెల్లడించింది. మారేడ్‌పల్లిలో 7.6 సెంటీమీటర్లు, మల్కాజ్ గిరిలో 7.35 సెంటీమీటర్లు, ఉప్పల్ లో 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముషీరాబాద్, బండ్లగూడ, బాలానగర్, అంబర్ పేట్, సైదాబాద్ ప్రాంతాల్లో 5 సెంటీమీటర్లు వర్షపాతం నమోదైంది. హయత్ నగర్, హిమాయత్ నగర్, బండ్లగూడ ప్రాంతాల్లో 4.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**మరో నాలుగు రోజులు భారీ వర్షాలు :** రాష్ట్ర వ్యాప్తంగా గత రెండు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసవరమైతేనే బయటకు వెళ్లాలన్నారు. పలు జిల్లాలకు ఎల్లో, ఆరేజ్, రెడ్ హెచ్చరికలు జారీ చేశారు. దక్షిణ తెలంగాణలోని పలు జిల్లాల్లో కుండపోత వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని జిల్లాల్లో 30 నుంచి 40 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందన్నారు. శుక్రవారం ఆదిలాబాద్, జగిత్యాల, జనగాం, గద్వాల, కామారెడ్డి, కరీంనగర్, ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, నాగర్‌కర్నూల్, నల్లగొండ, నారాయణపేట, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సిరిసిల్ల, సిద్దిపేట, సూర్యాపేట, వనపర్తి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు. శనివారం సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో, ఆదివారం రంగారెడ్డి, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల్లో, సోమవారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగాం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో, మంగళవారం భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు.

## రద్దు చేయాలి (మొదటి పేజీ తరువాయి)




కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు, కాంగ్రెస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. అనంతరం జరిగి 'ప్రజా పాలన–ప్రగతిబాట సభ'లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. "ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం ప్రాజెక్టు వెనుక నుంచి 4 టిఎంసిలను తీసుకెళ్ళాల్సి ఉంటే ఇవ్వాళ తొమ్మిదిన్నర టిఎంసిల నీరు తీసుకెళ్లేందుకు మీరు ప్రాజెక్టులు కట్టుకుంటున్నరు. అందుకే చంద్రబాబు నాయుడుకి విజ్ఞప్తి చేస్తున్న.. రోజుకు 3 టిఎంసిలను తరలించుకుపోయే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును రద్దు చేసి , మీ ఉదారత్వం ప్రదర్శించండి. మీరు రెండు రాష్ట్రాలను సమానంగా, తెలుగువాళ్ళను అభివృద్ధి చేయాలన్నది ఆలోచన నిజమైతే రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను తక్షణమే రద్దు చేయండి. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల, డిండి, కల్వకుర్తి, కోయల్ సాగర్ బీమాలను పూర్తి చేయడానికి మీరు ఉదారంగా మాకు సహకరించండి" అని విజ్ఞప్తి చేశారు. "మీరు సిఎంగా ఉన్నప్పుడే పాలమూరు జల్లాలో కల్వకుర్తి, బీమా , నెట్టెంపాడు, కోయల్‌సాగర్ ప్రాజెక్టులు వచ్చినవి. మీరు ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పనులు ప్రారంభమయ్యాయి. మీరు పదేళ్ళు ప్రతిపక్ష నాయకుడిగా, ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మొదలైన ప్రాజెక్టులను మీరు అడ్డుకోవడం ఎంత వరకు న్యాయం?"ప్రాజెక్టులను చంద్రశేఖర్‌రావు కట్టకపోతే చంద్రబాబు అడ్డుకోవడం న్యాయమా?" అని ఎపి సిఎం చంద్రబాబును రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఒకనాడు పాలమూరు జిల్లాను దత్తతు తీసుకున్నట్లు చెప్పారని, మీరు బాధ్యతగా ఉండాలని, మమ్మల్ని బతకనివ్వండి, మా ప్రాజెక్టులను పూర్తి చేసుకోనివ్వండి అని వ్యాఖ్యానించారు.

**కెసిఆర్ పదేళ్ళలో ఎందుకు పూర్తి చేయలేదు :** పదేళ్లు సిఎం గాఉండి పాలమూరు ప్రాజక్టులను కెసిఆర్ పడావు పెట్టారని, పాలమూరు రంగారెడ్డి ని పదేళ్లలో ఎందుకు పూర్తి చేయలేదని, కల్వకుర్తి, నెట్టెంపాడు, బీమా ప్రాజెక్టులు ఎందుకుపూర్తి చేయలేదని సిఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. లక్ష కోట్ల రూపాయలతో కాళేశ్వరం ప్రాజెక్టు 2019లో కట్టుడు, 2023లో కూలుడు అయిందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిగా కెసిఆర్ పదేళ్ళలో రూ.20లక్షల కోట్లు చేతుల్లోకి వచ్చాయని, అందులో పాలమూరు ప్రాజెక్టులకు రూ.25వేల కోట్లు ఇచ్చినా 20లక్షల ఎకరాలు సాగులోకి వచ్చేవని చెప్పారు. ఎందుకంత కడుపులో విషం పెట్టుకుని మాపై విషం చిమ్ముతున్నావన్నారు. పాలమూరు జిల్లా అంటే కెసీఆర్ కు చిన్నచూపు అని, పాలమూరులో ఊరు లేకపోయినా పార్లమెంట్ లో నోరు ఎత్తకపోయినా కెసిఆర్ ను పార్లమెంట్ కు పంపింది పాలమూరు జిల్లా అని అన్నారు. 98 జీవో ప్రకారం పదేళ్లు సిఎంగా ఉన్న కెసిఆర్ శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులను ఎందుకు ఆదుకోలేదు? అని ప్రశ్నించారు. వాల్మీకి సోదరులను ఎస్‌టి బోయలుగా మారుస్తానని చెప్పి మోసం చేశారన్నారు. పదేళ్లలో ఈ సమస్యలను పరిష్కరించి ఉంటే పాలమూరు వాసులు మళ్లీ సమస్యపై కొట్లాడే పరిస్థితి ఉండేదా? అని అన్నారు. ప్రజాపాలన చూసి కెసీఆర్ కు దుఃఖం వస్తుందట,పాలమూరు గడ్డ నుంచి రేవంత్ రెడ్డి సీఎం అయిండని నీకు దుఃఖం వస్తుందా ? అని నిలదీశారు. బలహీన వర్గాల పిల్లలు చదువుకునేందుకు 25 ఎకరాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తున్నందుకు నీకు దుఃఖం వస్తుందా? పాలమూరు బిడ్డ 20 ఏండ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని కంకణం కట్టుకుని పనిచేస్తున్నందుకా నీకు దుఃఖం అని రేవంత్‌రెడ్డి అన్నారు. నలభై ఏళ్లుగా మాదిగ బిడ్డలు వర్గీకరణ కోసం పోరాడుతుంటే, మాదిగ ఉపకులాల వర్గీకరణ చేసినందుకా నీకు దుఃఖం వస్తుందా అని ప్రశ్నించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధిని చూసి అభినందించాల్సింది పోయి శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి ఆ దొంగకు సద్దులు మోస్తున్నారని మండిపడ్డారు.

## గవర్నర్ న్యాయ సలహా..!

(మొదటి పేజీ తరువాయి)


బిల్లులను ఒక నెలలోపు ఆమోదించాలని, లేదా తిరిగి పంపించాలని ఆదేశించిన నేపథ్యంలో గవర్నర్ త్వరలోనే దీనిపైన ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అయితే గవర్నర్‌కు పంపించే ఆర్డినెన్స్ ముసాయిదాతో పాటు ఆర్డినెన్స్‌కు దారి తీసిన కారణాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా తెలియజేసినట్టు అధికారవర్గాలు పేర్కొన్నాయి. స్థానిక సంస్థలకు సెప్టెంబర్ 30లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున, వెంటనే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సి ఉంటుందని, మరోవైపు రిజర్వేషన్ల బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లోనే ఆర్డినెన్స్ ముసాయిదాకు తీర్మానం చేసినట్టు ప్రభుత్వం వివరించింది. అయితే రిజర్వేషన్ల పరిమితి 50 శాతానికి దాటుతున్న నేపథ్యంలో గవర్నర్ న్యాయ సలహాను కోరడంతో పాటు ఇతర రాష్ట్రాలలో రిజర్వేషన్ల అమలు తీరుపైన కూడా ఆరా తీసినట్టు తెలుస్తోంది.

## విద్యుత్ ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

ఉంచుకొని పవర్‌ను ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు..విద్యుత్ ఉత్పత్తి సరఫరాలో ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, రాష్ట్ర స్థూల ఉత్పత్తి విద్యుత్ పైన ఆధారపడిందని తెలిపారు. రాష్ట్ర జెన్కో సిఎండి డాక్టర్ హరీష్ ఆయా ప్రాజెక్టులపై వివరాలను తెలియజేశారు.

**పార్లమెంటు ఎన్నికల్లో గుండు సున్నా వచ్చినా బిఆర్ఎస్ నేతల తీరు, భాష మారదా?...** ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తిని హౌలే, సన్నాసిఅని దుర్భాషలాడుతూ బిఆర్ఎస్ నేతలు దిగజారుడు భాష..సంస్కృతిని అలవర్చుకోవడం శోచనీయమని, బిఆర్ఎస్ నేతలు ఇకనైనా ప్రజాస్వామ్య పద్ధతిలో వ్యవహరించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం నాగార్జునసాగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాప్రతినిధులుగా, రాజకీయ నాయకులుగా మనం మాట్లాడే భాషనే ప్రజలు నేర్చుకుంటారని, బిఆర్ఎస్ నేతలు రాష్ట్ర ప్రజలకు ఏం నేర్పాలి అనుకుంటున్నారో వారికైనా అర్థం అవుతుందా అని డిప్యూటీ సిఎం ప్రశ్నించారు. అధికారం పోయింది అనే అక్కసుతో సమాజం సిగ్గుతో తలదించుకునేలా బిఆర్ఎస్ నేతలు దిగజారి మాట్లాడుతున్నారని భట్టివిక్రమార్క అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో వీళ్ళకు ప్రజలు బుద్ధి చెప్పారని, పార్లమెంటు ఎన్నికల్లో కారు సారు 16 అంటే ప్రజలు వారికి గుండు సున్నా ఇచ్చారని, అయినా బిఆర్ఎస్ నేతల తీరు, భాష మారడం లేదన్నారు. శ్రీశైలం ఎగువ భాగాన ఎత్తిపోతల పథకం ఎవరి పాలనలో ఏర్పాటు అయ్యిందని ప్రశ్నించారు. కెసిఆర్ ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లి బేసిన్లు లేవు. బేషజాలు లేవు అని ప్రకటించారని గుర్తుచేస్తూ వారి కాలంలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ప్రస్తుతం నీటి సమస్య వచ్చేది కాదని అన్నారు. 10 సంవత్సరాల పాలనా కాలంలో బిఆర్ఎస్ నేతలు ఒక్క నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి ప్రాజెక్టులను కట్టారా అని మండిపడ్డారు. విద్యుత్ డిమాండ్ భారీగా పెరుగుతున్న నేపథ్యంలో గ్రీన్ పవర్ వైపు వెళ్తున్నామని 29,30 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. అంతకుముందు జరిగిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, దేవరకొండ ఎమ్మెల్యే లు జైవీర్ రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, బాలు నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్ అదనపు కలెక్టర్లు జే.శ్రీనివాస్,నారాయణ అమిత్, హైడల్ డైరెక్టర్ పి.బాలరాజు, సిఇ నారాయణ, ఎస్ఇలు వెంకటరమణ, ఓఅండ్ ఎండి ఎస్ఇ రఘు రాం, సివిల్ ఎస్ఇ డి.రామకృష్ణారెడ్డి, సిఇ మంగేష్ కుమార్, ఈ ఉపేందర్ హాజరయ్యారు.



# జనరల్
STATE & REGIONAL NEWS



## నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి : పశ్య పద్మ

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి: రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ ఆధ్వర్యంలో మోపాల్ మండలం ఠాణాకూర్ద్ గ్రామంలోని చెక్‌డ్యామ్‌లో భూములు కోల్పోతున్న నిరుపేద రైతులతో కలిసి చెక్‌డ్యామ్ నిర్మిస్తున్న ప్రాంతాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా భూములు కోల్పోతున్న రైతులు మహిళలు తమ గోడును వెలిబుచ్చుకుంటూ మా భూముల పక్కన కంజర వాగుపై మా భూముల కింది భాగాన చెక్‌డ్యాం నిర్మిస్తున్నారని తెలిపారు. ఎలాంటి సమాచారం, నోటీసులు ఇవ్వకుండా రోడ్డు వేస్తున్నారని, కనుక మాకు జీవనోపాధి కల్పిస్తున్న ఈ భూములను మాకు ఇప్పించడానికి తమ సంఘం మాకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కంజర భూమయ్య, రాధకుమార్, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



## పల్లెల్లో జోరుగా 'పచ్చదనం'

ఇప్పటి వరకు కోటి 70 లక్షల మొక్కలు నాటిన పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'వన మహోత్సవ' కార్యక్రమం నిర్దేశించుకున్న లక్ష్యంలో 39 శాతం పూర్తి చేసుకున్నది. పల్లెల్లో 'వన మహోత్సవం' జోరుగా సాగుతోంది. ప్రతి రోజు లక్షల సంఖ్యలో మొక్కలు నాటుతున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది. ప్రస్తుత సంవత్సరంలో ఏడు కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోవాలని నిర్ధేశించుకోగా, శుక్రవారం నాటికి 1.7కోట్ల మొక్కలను(39శాతం) నాటినట్టు పంచాయతీ రాజ్ శాఖ వెల్లడించింది. గత సంవత్సరం ఏకంగా 6 కోట్ల 90లక్షల మొక్కలు నాటగా, ఈసారి 7 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందులో ఈసారి 22వేల ఎకరాల్లో పండ్ల తోటలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 4521 ఎకరాల్లో పండ్ల మొక్కలను నాటారు. ఇది మొత్తం లక్ష్యంలో 21శాతంగా ఉంది. మొక్కలు నాటే కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. కాగా మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వే కార్యక్రమం చివరి దశకు చేరుకుందని, ఇప్పటి వరకు 85 శాతం మేర గుంతలు తవ్వి మొక్కలు నాటేందుకు సిద్ధం చేసినట్లు అధికారులు మంత్రికి వివరించారు. అయితే నల్లగొండ జిల్లాల్లో వన మహోత్సవం కాస్త మందకొడిగా సాగుతోంది. ఇప్పటివరకు ఆ జిల్లాలో 42వేల మొక్కలను మాత్రమే ఇప్పటివరకు నాటారు. దీంతో ఆ జిల్లాల్లో వన మహోత్సవం కార్యక్రమాన్ని మరింత వేగం పెంచాలని అధికారులను మంత్రి సీతక్క ఆదేశించారు. ములుగు, ఇల్లందు, కామారెడ్డి, పెద్దపల్లి, భూపాలపల్లి పలు నియోజకవర్గాల్లో పర్యటించిన మంత్రి సీతక్క స్వయంగా మొక్కలు నాటి ప్రజల్లో పచ్చదనం పట్ల చైతన్యం కలిగించారు. పచ్చదనం విస్తరణతో పాటు నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ తద్వారా గ్రామాల్లో మౌలిక మార్పులకు వన మహోత్సవం దోహదపడుతుందనే విషయాన్ని విస్తృతంగా ప్రజలలో అవగాహన కల్పిస్తున్నారు. వన మహోత్సవం విషయంలో మంత్రి సీతక్క, పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి ఎన్. శ్రీధర్, డైరెక్టర్ జి. సృజన ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తున్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తిచేసే అవకాశాలు ఉన్నాయని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

## పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం

అటవీ పార్కులో అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం వెలుగుమట్ల అర్బన్ అటవీ పార్కులో హరితనిధి, మున్సిపల్ నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులు వాకింగ్ ట్రాక్‌లు, సైక్లింగ్ ట్రాక్, పిల్లల ఆట స్థలాలు, థీమ్ టిక్ గార్డెన్‌లు, విశ్రాంతి మండపాలు, చైన్‌లింక్ ఫెన్సింగ్ పనులకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా వాటర్ ట్యాంకర్ ట్రాక్టర్, బ్యాటరీ ద్వారా నడిచే చెత్త తొలగింపు వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ పచ్చదనం పరిశుభ్రత పెంపొందించేలా ఖమ్మం నగరంలో విస్తృతంగా మొక్కలు నాటాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణ, జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందన్నారు. ఖమ్మంను మోడల్ నగరంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఒక మొక్క తల్లి పేరు మీద సప్త వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, మేయర్ పునుకొల్లు నీరజ, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, డిఎఫ్‌వో సిద్దార్థ్ విక్రం సింగ్, ఏఎంసి చైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఎఫ్‌డివోలు, కార్పొరేటర్లు, అధికారులు, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డలను ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం

- కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం
- బతుకమ్మలతో మంత్రికి ఘన స్వాగతం
- లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ



ప్రజాపక్షం/భద్రాచలం : ఆడబిడ్డలను ఆర్థికంగా బలోపేతం చేస్తూ కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం, ధ్యేయమని రెవెన్యూ,గృహనిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన ఇందిరమ్మ రేలా మహిళాశక్తి సంబురాలు కార్యక్రమానికి విచ్చేసిన మంత్రికి మహిళలు బతకమ్మలతో ఘన స్వాగతం పలికారు. స్థానిక శాసన సభ్యులు డా.తెల్లం వెంకట్రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ విపాటిల్, ఐటిడిఏ పిఒ రాహుల్, ఏఎస్‌పి విక్రాంత్‌కుమార్ సింగ్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి తెలంగాణ గీతాలాపనతో కార్యక్రమానికి ప్రారంభించారు. ముందుగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని మహిళా స్వయం శక్తి సంఘాల ద్వారా చేపడుతున్న పనులు, మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కల్పిస్తున్న ప్రగతి నివేదికను వివరించారు.

అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల సాధికారిత కోసం ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. వడ్డీలేని రుణాలు, మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన బీమాభద్రత పథకాలు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్, రేషన్ కార్డులు, సబ్సిడి బియ్యం వంటి పథకాలు నిజమైన సంక్షేమ పాలనకు నిదర్శనం అన్నారు. మహిళా సభ్యులు బీమాపథకాన్ని పునరద్ధరించి సహజ మరణానికి రూ.2లక్షలు, ప్రమాద మరణానికి రూ.10లక్షలు బీమా కల్పించామన్నారు. పేదలకు ఇళ్లను నిర్మించేందుకు జిల్లాలో అశ్వారావుపేట నియోజకవర్గానికి తొలిదశలో 4500 ఇళ్లు మంజూరు చేశామని, భద్రాచలం నియోజకవర్గంలో అదనంగా 1500 ఇళ్లు మంజూరుకి ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు. ఇందిరమ్మ ఇళ్లపథకంలో భాగంగా ఈ నియోజకర్గంలో రూ.24 కోట్ల 57,65,487 రూపాయలు కేటాయించినట్లు చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ నియోజకవర్గవ్యాప్తంగా 390మహిళా సంఘాలకు సుమారు 40వేల మందికి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. కలెక్టర్ జితేష్ విపాటిల్, ఐటిడిఎ పిఒ రాహుల్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. అనంతరం భద్రాచలం నియోజకవర్గంలోని 268 స్వయం సహాయక సంఘాలకు రూ.17.64కోట్లు, బ్యాంకు లికేంజీ ద్వారా 268 స్వయం సహాయక సంఘాలకు రూ.17.64 కోట్లు,లోన్ బీమా ద్వారా 17 మంది సభ్యులకు రూ.22 లక్షల 49 వేల230 లను లబ్ధిదారులకు చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. అనంతరం మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాన్స్‌ను పరిశీలించిన ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా రామాలయ మాఢవీధుల నిర్మాణం కోసం జరుగుతున్న తొలగింపు పనులను స్వయంగా పరిశీలించి విఓను పూర్తి వివరాలు అడిగి తెలుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ నాగలక్ష్మి, డిఎస్ఓ రుక్మిణి, భద్రాచలం తహశిల్దార్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సమాఖ్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్‌ఎస్‌వి పగటి కలలు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



ప్రజాపక్షం/హైదరాబాద్:ఫామ్‌హౌస్‌లో కెసిఆర్, గెస్ట్ హౌస్‌లో కెటిఆర్ కూర్చుని వంద సీట్లు బిఆర్‌ఎస్‌కు వస్తాయని పగటి కలలు కంటున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు.హైదరాబాద్‌లోని సిఎల్‌పి మీడియాసెంటర్‌లో ఎంఎల్‌ఏ మందుల సామేల్‌తో కలిసి ఆయన శుక్రవారం మాట్లాడుతూ బిఆర్‌ఎస్ నాయకత్వానికి కెటిఆర్ పనికి రారని ఆయన సొంత సోదరి కవితనే చెబుతుందని, ఇంట్లో ఉన్న తగాదాల కారణంగా కెటిఆర్ తన అసహనాన్ని సిఎంపైన రుద్దుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఇంకా బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నదనే భ్రమలో కెటిఆర్ ఉన్నారని, రాష్ట్రంలో గుర్రం ఎవరో, గాడిద ఎవరో అందరికి తెలుసన్నారు. రేవంత్ రెడ్డి రేస్ గుర్రమైతే, కెటిఆర్ కుంటి గుర్రమని ఎద్దేవా చేశారు. గతంలో రేవంత్ రెడ్డి వైట్ చాలెంజ్‌కు ఆహ్వానిస్తే కెటిఆర్ రాలేదని ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. ఎంఎల్‌ఏ మందుల సామేల్ మాట్లాడుతూ తుంగతుర్తిలోని తిరుమలగిరిలో సిఎం రేవంత్ రెడ్డి బహిరంగసభ విజయవంతమైందని, కెటిఆర్‌ను ప్రజలు నాయకునిగా నమ్మడం లేదని ఆరోపించారు.

కెటిఆర్ ముందుగా ఆయన సోదరి ఏమంటుందో చూడాలని సూచించారు. మేడిగడ్డ బ్యారేజీ ఎందుకు కూలిపోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్‌లో దళిత నాయకులను హీనాతి హీనంగా చూశారని, మందకృష్ణ మాదిగను జైలులో పెట్టారని గుర్తు చేశారు.



## 23న బంద్‌కు ఎఐవైఎఫ్ మద్దతు

ప్రజాపక్షం/హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న తేదీన వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర వ్యాపిత పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్‌కు అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, మేధావు లు, విద్యావేత్తలు సహకరించి పాల్గొనాలని ఎఐవైఎఫ్ విజ్ఞప్తి చేసింది. రాష్ట్ర వ్యాపిత బంద్ గోడ పత్రికను ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్ హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో శుక్రవారం విడుదల చేశారు.

కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఆర్. బాలకృష్ణ, సల్మాన్ బేగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని అనేక సంవత్సరాలుగా విద్యార్థి, యువజన సంఘాలు పోరాటాలు చేస్తున్నా పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో విద్యాశాఖకు మంత్రి లేకపోకడం వల్లనే విద్యారంగం కుంటుపడిందని, ఇందు కు సిఎం రేవంత్‌రెడ్డే నన్నారు. నెర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఎంఇఒ, డిఇఒ, తదితర పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్మీడియట్ కళాశాలల్లో అవినీతిని, గుర్తింపులేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఆధునికయుగం జర్నలిజంలో చరిత్రాత్మకమైన మార్పులు

- సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే వార్తా సేకరణ సులభతరం
- పాఠకుల అభిరుచులకు అనుగుణంగా వార్తలు రాయాలి
- తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/సిద్దిపేట:ఆధునిక యుగం జర్నలిజంలో చరిత్రాత్మకమైన మార్పులు వస్తున్నాయని మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం సిద్దిపేట విపంచి కళావేదికలో పాత్రికేయులకు రెండు రోజుల శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో మీడియా అకాడమి చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్తరూపం దాల్చాయన్నారు. సాంకేతికతను సమగ్రంగా తెలుసుకుంటే వార్తల సేకరణ సులభం అవుతుందన్నారు. పాఠకుల వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా వార్తలు ఉండాలన్నారు. తెలుగు వార్తలను సులభమైన భాషలో వ్రాయాలని సూచించారు. త్వరలోనే మీడియా ఆకాడమీ ఆధ్వర్యంలో ఎఐ అనే అంశంపై సెమినార్ వర్క్‌షాపు నిర్వహిస్తామన్నారు.

సిద్దిపేట శాసన సభ్యులు, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ రాజకీయరంగంలోనైనా, మీడియా రంగంలోనైన, ఇతర ఏ రంగాల్లోనైన వారు ప్రతి నిత్యం సామాజిక మార్పులకు, అవసరాలకు అనుగుణంగా మనల్ని మనం తీర్చిదిద్దుకోవాలని అన్నారు. జర్నలిస్టులు క్షేత్రస్థాయిలో పర్యటించి అనేక వార్తలను సేకరించి అధికారులతో ధృవీకరించుకొని క్రోఢీకరించుకొని వార్తలను విడుదల చేస్తామన్నారు. ఆయా వార్త లు ప్రజల్ని ప్రభావితం చేస్తాయన్నారు. జర్నలిస్టులు శిక్షణ ద్వారా నైపుణ్యాలను పొంది ప్రజల మన్ననలను పొందేలా జర్నలిస్టులు ప్రతి విషయాన్ని విపులీకరించుకొని సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో వార్తలు రాయాలన్నారు.

సమాజంలో యువత బెట్టింగ్, డ్రగ్స్ బారిన పడి చెడిపోతున్నారని దాన్ని నిర్మూలించటానికి పరిశోధనాత్మక వార్తలు రాయాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల మైక్రోఫైనాన్స్ ఆగడాలు ఎక్కువై వారి వేధింపులు తట్టుకోలేక బాధితులు అనేక అవస్థలు, అవమానాలతో చివరికి ఆ ఆత్మహత్యలకు దారితీస్తున్నాయన్నారు. జర్నలిస్టుల కు, రాజకీయనాయకులకు నేర్చుకోవటం అనేది ఎప్పుడూ ముఖ్యమన్నారు. నేర్చుకోవటం ద్వారా తప్పులను సరిదిద్దుకునే అవకాశం ఉంటుందన్నారు. సోషల్ మీడియా ప్రభావం వల్ల యువత పెడదారి పడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను కంట్రోల్ చేసే విధం గా జర్నలిస్టులు కృషిచేయాలన్నారు. సామాజిక అంశాలపై జర్నలిస్టులు ప్రత్యేకంగా ఫోకస్ చేయాలని సూచించారు. ప్రభుత్వాన్ని కదిలించే వార్తలపై జర్నలిస్టు లు దృష్టిసారించాలన్నారు. జర్నలిస్టులకు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించేందుకు మీడియా ఆకాడమి ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లాలన్నారు. సిద్దిపేట జర్నలిస్టులకు తన సొంత డబ్బులతో 10లక్షల రూపాయల బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్, సీనియర్ జర్నలిస్టు దిలీప్‌రెడ్డి సమాచారం హక్కు చట్టం 2005 ప్రసంగించారు. భాషా, తప్పుఒప్పులు దిద్దుబాటు అనే అంశంపై విశాలాంధ్ర ఎడిటర్ ఆర్‌వి రామారావు, వార్త కథనాలు, ప్రత్యేక కథనాలు, సోషల్ మీడియా ప్రభావంపై దిశ ఎడిటర్ మార్కెండేయులు బోధించారు. అతిథులకు తెలంగాణ మీడియా అకాడమీ పక్షాన ఘనంగా సన్మానించి, జ్ఞాపికలు అందచేశారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్, మీడియా ఆకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, టియుడబ్లుజె అధ్యక్షులు విరాహత్ అలి, జిల్లా అధ్యక్షులు రంగాచారి, తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి దెబ్బకి ఫామ్‌హౌస్‌లో కెసిఆర్

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దెబ్బకు మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఫామ్‌హౌస్‌లో కూర్చున్నారని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చి మరింత దోచుకోవచ్చని కలలు కన్న మాజీ సిఎం కెసిఆర్ కుటుంబానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పారని అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చామల కిరణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ హయాంలో పదేళ్లు చర్చ లేకుండా అసెంబ్లీని నడిపారని, మంత్రులకే తెలియకుండా గతంలో జిఓలు విడుదల చేశారని యన విమర్శించారు. కేంద్ర జలశక్తి శాఖ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఢిల్లీకి పిలిపించిందని, నీటి పంపకాలపై నెలకొన్న సమస్యలపై చర్చించేందుకు రప్పించినట్లు ప్రెస్ నోట్ కూడా విడుదల చేసిందని తెలిపారు. కానీ దానిని పక్కన పెట్టి బనకచర్ల గురించి మాట్లాడారని బిఆర్‌ఎస్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కేదార్ అనే వ్యక్తి దుబాయ్ లోడ్రగ్స్ కారణంగా చనిపోయినట్లు తేలిందని అన్నారు. కేదార్‌కు, కెటిఆర్‌కు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలిపారు. దుబాయ్‌లో కేదార్‌తో పెట్టుబడులు పెట్టించింది ఎవరని ప్రశ్నించారు.

## ఫోన్ ట్యాపింగ్‌తో ఎంజాయ్ చేసిన కెసిఆర్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఆరోపణ

ప్రజాపక్షం/జనగామ : ఫోన్ ట్యాపింగ్‌తో కెసిఆర్ తెగ ఎంజాయ్ చేశాడు. భార్యభర్తల సీక్రెట్ విషయాలు సైతం విన్నాడు. ఒక విధంగా చెప్పాలంటే సినిమాలో నటించే బ్రహ్మానందం కంటే ఎక్కువ ఆనందం పొందాడని బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. కిషన్‌రెడ్డి ఫోన్ ట్యాపింగ్‌కు గురైతే ఆయన ఎలా కెసిఆర్‌ను రక్షించినట్లు అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బిజెపి సిద్ధంగా ఉందన్నారు. శుక్రవారం జనగామలోని బిజెపి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కెసిఆర్‌కు ఏం పనిలేక ఫాంహౌస్‌లో పడుకొని ఇతర ఫోన్లు వింటూ ఆనంద పడ్డాడన్నారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్ల విషయాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, బిసిలకే 42శాతం ఇస్తే మంచిదన్నారు. కానీ అందులో 10శాతం ముస్లింలకు వెళుతుందన్నారు. ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర నాయకులు జిల్లా అధ్యక్షులు సౌడ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డిని పదేపదే విమర్శించొద్దు

బిఆర్‌ఎస్‌కు సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ హితవు

న్యూఢిల్లీ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని బిఆర్‌ఎస్ పదేపదే విమర్శించడం మానుకోవాలని, ఆయన ఎన్నుకోబడిన నేత అని నామినేట్ చేయబడిన వ్యక్తి కాదని సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. తెలంగాణకు రేవంత్ అన్యాయం చేయలేదని చెప్పారు. ఢిల్లీలో శుక్రవారం ఆయన మీడియాతో రెండు రాష్ట్రాల మధ్య నీటి సమస్యను పరిష్కరించేందుకు కేంద్రం సమావేశాన్ని ఏర్పాటు చేయడాన్ని ఆయన స్వాగతించారు.

టిఆర్‌ఎస్ బిఆర్‌ఎస్‌గా మారిన తరువాత సెంటిమెంట్ ఎగిరిపోయిందని నారాయణ అన్నారు. ప్రతి అంశంపై సెంటిమెంట్లతో బిఆర్‌ఎస్ నేతలు రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. బనకచర్ల గురించి చంద్రబాబు మొదట మాట్లాడాల్సింది తెలంగాణ ముఖ్యమంత్రితో అని.. అలా చేయకపోవడం వల్ల విమర్శలు వచ్చి తెలంగాణ సిఎం ఆ ప్రాజెక్టును వ్యతిరేకించారని చెప్పుకొచ్చారు. బనకచర్ల ప్రస్తుతం ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్టు కాదని, అది రూ.80వేల కోట్ల ప్రాజెక్టు కాదని.. 2 లక్షల కోట్లు అవుతుందని తెలిపారు.

## రాజస్థాన్ నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ స్మగ్లింగ్

'ఈగిల్'కు చిక్కిన ముఠా నుండి రూ.17లక్షలు స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్: రాజస్థాన్ కేంద్రంగా హైదరాబాద్‌కు స్మగ్లింగ్ అవుతున్న ఓ డ్రగ్స్ ముఠా గుట్టును 'ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్' (ఈగిల్) అధికారులు రట్టు చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి రూ.17లక్షల విలువైన 3.25 కిలోల నల్లమందుతో పాటు రెండు కార్లు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. రాజస్థాన్‌లోని జలోర్ జిల్లాకు చెందిన సవ్లారామ్ బిష్ణోయ్ (43), హపురం బిష్ణోయ్(38), లాలారామ్ బిష్ణోయ్ (41)లు గతంలో హైదరాబాద్‌కు వచ్చి ప్రైయివేట్ కంపెనీలో పనిచేసేవారు.

నల్లమందుకు అలవాటు పడిన ఈ ముగ్గురు హైదరాబాద్‌లోని గుజరాతీయులకు నల్లమందు విక్రయించడం ద్వారా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే రాజస్థాన్‌లో నల్లమందు కొనుగోలు చేసి అధికధరకు హైదరాబాద్‌లో విక్రయించేవారు. ఇలా సంపాదించిన డబ్బుతో కార్లు ఖరీదు చేసి జల్సాలకు అలవాటు పడ్డారు. ఈ ముఠా డ్రగ్స్ స్మగ్లింగ్‌కు సంబంధించి ఈగిల్‌కు విశ్వసనీయ సమాచారం అందింది. నల్లమందుతో కారులో బయల్దేరారు. ఈ సమాచారం తెలుసుకున్న ఈగిల్ అధికారులు కారుపై నిఘా పెట్టారు. కారు బోయిన్‌పల్లి కి చేరుకున్నాక అదుపులోకి తీసుకున్నారు. కారులో ఉన్న నల్లమందును స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, సర్కిల్ నెం.17, కె.జెడ్., జిహెచ్ఎంసి, ఖైరతాబాద్, హైదరాబాద్.
NIT No.: 14/EE/CIRCLE-17/KZ/GHMC/25-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 18.07.2025
పని పేరు: సివిల్ పనులు (01 నెం.లు), అంచనా విలువ / ఇసివి: రూ.16.80 లక్షలు, ప్రారంభ తేది / డౌన్‌లోడ్ ఆఖరి తేది & సమయం: క్ర.సం.01 నుండి 01 వరకు పనుల కొరకు: 18.07.2025న మ.12.00గం.ల నుండి 22.07.2025న మ.12.00గం.ల వరకు మాత్రమే, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.eprocurement.gov.in, ఇ-మెయిల్ అడ్రస్: eec17.ghmc@gmail.com, మొబైల్ నెం. 7337557246.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-17, కె.జెడ్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 5221-PP/CL/ADVT/1/2025-26, Date: 18-07-2025

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణా రాష్ట్రం. ఫోన్ నం.08743-232428
ఆర్.సి.నం. ఇ1/382/2025 eGP Portal-Tenders షార్ట్ టెండరు ప్రకటన తేది: 18.07.2025
ఈ దేవస్థానమునకు సంబంధించిన వివిధ పనులు చేయుటకుగాను ఈ-ప్రొక్యూర్‌మెంట్ పద్ధతిలో టెండర్లు కోరబడుచున్నవి. డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేది: 19.07.2025 ఉదయం గం. 11.00ల నుండి, టెండరు దాఖలుచేయు చివరి తేది: 25.07.2025 ఉదయం గం.11.00వరకు, ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది: 25.07.2025 ఉదయం గం.11.30లకు. ఇతర వివరములు https://tender.telangana.gov.in నందు చూడగలరు.
సం/- ఎల్. రమాదేవి, కార్యనిర్వహణాధికారి
DIPR R.O. No. : 5196-PP/CL/ADVT/1/2025-26, Date: 18-07-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
డివిజన్-14, జిహెచ్ఎంసి.
NIT No.26: NIT No. 27/E.E.14/GHMC/25-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 17.07.2025
పని పేరు: జిహెచ్ఎంసి, గోషామహల్ సర్కిల్ 14, బేగంబజార్ కార్పొరేట్ డివిజన్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్ ఆవరణలో ఉన్న ఎస్‌డబ్ల్యు డ్రెయిన్‌లోని అడ్డంకులను తొలగించడం. అంచనా విలువ: రూ.4.50 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్‌కు ప్రారంభ తేది: 18.07.2025న ఉ.11.00గం.ల నుండి మరియు బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 19.07.2025న ఉ.11.00గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-14, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-14, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 5230-PP/CL/ADVT/1/2025-26, Date: 18-07-2025

**LOST DOCUMENTS**
I, GOPULARAM NAGENDER, S/o. GOPULARAM NARASIMHA, R/o. 5-2-696, Risala Abdulla, Osmangunj, Nampally, Begumbazar, Hyderabad, Telangana - 500012. Have lost my original link Doc No. 6255/1985 and 3555/2012. That documents were either misplaced or lost during the journey on bus near wipro circle road area Gachibowli and despite my best efforts, I have been unable to locate them. If found Please Contact: 9393202777

**డాక్యుమెంట్స్ పోయినవి**
బొడ్డుపల్లి లింగయ్య s/o నర్సింహా, ఇంటి నెం. 3-17/1, గ్రామం: ఎల్లారెడ్డి గూడెం, మండలం: నార్కెట్‌పల్లి, జిల్లా: నల్గొండ గారికి చెందిన ల్యాండ్ డాక్యుమెంట్స్ మరియు లింక్ డాక్యుమెంట్స్ నెం. 21394/2021 నా ఇంటి నుంచి మహాత్మాగాంధీ యూనివర్సిటీకి మోటార్ సైకిల్‌పై వెళుతుండగా దారి మధ్యలో పోయినవి. దొరికిన వారు తిరిగి అందజేసిన ఎడల వారికి తగిన పారితోషకం ఇవ్వబడును. సంప్రదించవలసిన మొబైల్ నెంబర్: 9948047900

ప్రజాపక్షం
శనివారం, 19 జూలై

## నిస్సహాయత నుంచి ట్రంప్ బెదిరింపు

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బ్యాలెన్స్ కోల్పోతున్నారు. అది మిత్రులు, ఇతరులు తేడా లేకుండా విచక్షణారహితంగా దిగుమతి సుంకాల పెంపుదల ప్రకటించడం, వాటి అమలుకు విరామం ప్రకటించడం, ఈలోపు వాణిజ్య ఒప్పందానికి రాకపోతే అదనపు సుంకాల హెచ్చరికలు చేయడం పరిపాటి అయింది. అయినా ఇప్పటికి వాణిజ్య ఒప్పందం చేసుకున్నది రెండే రెండు దేశాలు–వియత్నాం, బ్రిటన్ (యూకే). 20 దేశాలకు సరికొత్త డెడ్‌లైన్ విధిస్తూ ఉత్తరాలు పంపారు. 'అమెరికాకు వ్యతిరేకమైన, బ్రిక్స్‌తో సంబంధం పెట్టుకున్న దేశాలపై 100 శాతం సుంకం హెచ్చరిక చేశారు. డాలర్‌కు ప్రత్యామ్నాయం ఆలోచిస్తే తాట తీస్తామంటున్నారు. రెండోవైపున, ఉక్రేన్‌తో 50 రోజుల్లో యుద్ధం నిలుపుదలకు ఒప్పించాల్సిందిగా రష్యాను, భారత్, చైనా, బ్రెజిల్‌లకు విజ్ఞప్తి చేస్తున్న ట్రంప్, అందులో అవి విఫలమైతే రష్యా నుండి అవి కొనుగోలు చేసే క్రూడ్ ఆయిల్‌పై 100 శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరించాడు. రష్యాపై మరో దఫా ఆంక్షల విధింపునకు రిపబ్లికన్ సెనెటర్ లిండ్సే గ్రాహం ప్రవేశపెట్టిన బిల్లును ట్రంప్ బలపరిచారు. ఆ బిల్లు ప్రకారం నిషేధించిన రష్యా ఉత్పత్తులు కొనుగోలు చేసే దేశాలు 500 శాతం సుంకాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టి కూడా ట్రంప్‌ను, అమెరికన్ కాంగ్రెస్ సభ్యులను కలుసుకున్నాక హెచ్చరిక జారీ చేశాడు. రష్యన్ క్రూడ్ ఆయిల్, ఆయిల్ ఉత్పత్తులు, బొగ్గు కొనుగోలు చేసే ప్రధాన దేశాలైన చైనా, ఇండియా, బ్రెజిల్‌లకు ప్రత్యేకించి అదనపు సుంకాల హెచ్చరిక చేశాడు రుట్టి. ఈ ద్వంద్వ ప్రమాణాలను భారత్ గురువారం ఖండించింది. 'మా ప్రజల ఇంధన అవసరాలు మాకు అత్యంత ప్రాధాన్యత గల విషయం. మార్కెట్‌లో రేట్లు, ప్రపంచ పరిస్థితులను బట్టి మేము నడుచుకుంటాం' అని భారత విదేశాంగ శాఖ ప్రకటించింది. ఈ పరిణామాల పర్యవసానాల కోసం వేచి చూద్దాం! అయితే ట్రంప్‌కు అసలు ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందన్నది? ప్రశ్న.

తాను అధికారంలోకి వచ్చిన 24 గంటల్లోనే ఉక్రేన్ యుద్ధాన్ని ముగింపజేస్తానని డోనాల్డ్ ట్రంప్ తమ ఎన్నికల ప్రచారంలోనే వాగ్దానం చేశారు. ఇప్పుడు ఉక్రేన్‌కు అదనంగా ఆయుధాలు పంపుతానని ప్రకటించారు. ఈ సంక్షోభం 50 రోజుల్లో పరిష్కారం కాకపోతే రష్యాపై, దాని వాణిజ్య భాగస్వాములపై "తీవ్రమైన సుంకాలు" విధిస్తానని హెచ్చరించారు. ఇది ఆయన నిస్సహాయ స్థితికి నిదర్శనం. యుద్ధ విరమణకు తొలుత ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఒప్పుకోలేదు. ఎందుకంటే అతని వెనుక యూరోపియన్ యూనియన్ ఉంది. జెలెన్స్కీపై కస్సుబుస్సులాడిన ట్రంప్, అరుదైన భూగర్భ ఖనిజాల విక్రయంపై ఉక్రేన్ లొంగి వచ్చి అమెరికాతో ఒప్పందం చేసుకున్న తదుపరి ట్రంప్ యుద్ధ విరమణకు రష్యాపై ఒత్తిడి పెంచాడు. తాము ఏ ప్రాథమిక లక్ష్యాల కోసమైతే (ఉక్రేన్‌ను నాటోలో చేర్చుకోకపోవడం, రష్యా భద్రతకై ఆక్రమించిన ఉక్రేన్ భూ, సముద్ర ప్రాంతాలను అట్టిపెట్టుకోవడం, రష్యా రక్షణకై సమగ్ర యూరప్ ఒప్పందం వగైరా) యుద్ధం ప్రారంభించామో వాటి నుంచి వెనక్కు వెళ్లబోమని రష్యా అధ్యక్షుడు పుతిన్ అధ్యక్షుడు ట్రంప్‌కు స్పష్టం చేశాడు. మరోవైపున, రష్యా అప్పుడప్పుడు కాల్పుల విరమణ పాటించింది. కానీ ఉక్రేన్ బరితెగించి రష్యా లోపలికెల్లా డ్రోన్లను పంపి దాని బాంబర్‌లపై దొంగ దెబ్బ తీసిన తదుపరి రష్యా ఉక్రేన్‌పై దాడులు ఉధృతం చేసింది. ఈలోపు ట్రంప్‌పై ఇయు, నాటో ఒత్తిడి పెరిగింది. దాంతో సుంకాలతో రష్యాను, దాని వాణిజ్య భాగస్వాములను బెదిరించి లొంగ దీసుకొనే ఎత్తుగడ వేశాడు ట్రంప్.

ఉక్రేన్ యుద్ధం మొదలైన నాటి నుంచీ అమెరికా, యూరప్‌లు రష్యాపై దఫదఫాలు ఆంక్షలు విధించాయి. అవి రష్యా యుద్ధ విధానాలను మార్చలేకపోయాయి. రష్యా చర్యలకు దాని వాణిజ్య మిత్ర రాజ్యాలను శిక్షించే ట్రంప్ తాజా విధానం విఫలం కాక తప్పదు. రష్యాకే కాదు అమెరికాకూ మిత్రదేశమైన భారత్ కూడా వాటిలో ఉంది. అమెరికా గతంలో ఆంక్షలు విధించినపుడు, రష్యా డిస్కౌంట్ రేటుకు ఆయిల్ విక్రయించి తన ఆర్థిక వ్యవస్థను నిలుపుకుంది. భారత్, చైనా పెద్ద మొత్తంలో ఆ ఆఫర్‌ను సద్వినియోగం చేసుకున్నాయి. అల్టిమేటంలు, బెదిరింపులవంటి పాత సామ్రాజ్యవాద ఎత్తుగడలతో వివాదాలు పరిష్కరించలేమని ట్రంప్ గ్రహించాలి. కావలసింది వాస్తవిక దృష్టితో కూడిన ఎడతెగని దౌత్యం. గాజాలో ఇజ్రాయెల్, ఉక్రేన్‌తో యుద్ధంలో రష్యా తమ పట్టువిడుపులు లేని వైఖరుల నుంచి వెనక్కి తగ్గకుండా వివాదాలు పరిష్కారం కావు– ట్రంప్ చేతిలో మంత్ర దండమేదీ లేదు!

# సెప్టెంబర్‌లో క్వాడ్, ఎస్‌సిఒ – మోదీ గడసాము



నిత్యా చక్రవర్తి

భారత్–చైనా ద్వైపాక్షిక సంబంధాల్లో జాగ్రత్తతో కూడిన మెరుగుదల ఆరంభమైంది. సాధారణ రాజకీయ, ఆర్థిక సంబంధాలు పునరుద్ధరణ పట్ల ఆసక్తితో ఉన్నట్లు ఇరుదేశాల నాయకత్వాలు తగిన సంకేతప్రాయంగా వెల్లడించారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ బుధవారంనాడు బీజింగ్‌లో చైనా అధ్యక్షుడు క్సి జిన్‌పింగ్‌ను కలుసుకుని భారత రాష్ట్రపతి, ప్రధాని నుంచి శుభాకాంక్షలు తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాల్లో గమనార్హమైన పురోగతిని ప్రస్తావించారు. చైనా అధ్యక్షుడు సంతృప్తి వ్యక్తం చేశారు.

టియాన్‌జిన్‌లో చైనా విదేశాంగమంత్రి ఆతిథ్యమిచ్చిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) విదేశాంగ మంత్రుల సమావేశంలో డాక్టర్ జైశంకర్ పాల్గొన్నారు. దక్షిణాసియా ప్రాంతంలో టెర్రరిజంపై చర్చలో ఆయన పాల్గొన్నారు. ఏప్రిల్ 22న పెహల్గాంలో టెర్రరిస్టు హత్యాకాండ నేపథ్యంలో, టెర్రరిజానికి వ్యతిరేకంగా ఎస్‌సిఒ సభ్యులు ఎట్టి మినహాయింపులు లేని పోరాటం చేయాల్సిన ఆవశ్యకతను వక్కాణించారు. పాకిస్థాన్ టెర్రరిజాన్ని ప్రోత్సహిస్తోందన్నారు. ఎస్‌సిఒ సభ్యుల్లో పాకిస్థాన్ కూడా ఉంది. ఆ టెర్రరిస్టులతో పాకిస్థాన్‌కు సంబంధమున్నట్లు భారత్ ఎటువంటి సాక్ష్యాధారాలు చూడలేదని, పొరుగుదేశానికి వ్యతిరేకంగా యుద్ధ వేడిని కొనసాగించటానికి భారత్ ఉద్దేశపూర్వకంగా ఆరోపణ చేస్తోందని పాక్ విదేశాంగమంత్రి డాక్టర్ ఇషాక్ దార్ ప్రతివాదన చేశారు. ఇప్పుడు, ఎస్‌సిఒ సభ్యదేశాల అధినేతల సమావేశం సెప్టెంబర్‌లో టియాన్‌జిన్‌లోనే జరగనుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సమావేశానికి హాజరవుతారని, ఆతిథ్యమిస్తున్న జిన్‌పింగ్‌తో విడిగా సమావేశమవుతారని సూచనలు కనిపిస్తున్నాయి. పెండింగ్‌లో ఉన్న ద్వైపాక్షిక సమస్యలను జిన్‌పింగ్‌తో చర్చించేందుకు భారత ప్రధానికి ఈ సందర్భం అవకాశమిస్తుందని భావించబడుతున్నది. గత సంవత్సరం అక్టోబర్‌లో రష్యాలోని కజాన్‌లో వారిరువురి చర్చ ల తర్వాతనే సంబంధాల సాధారణీకరణ క్రమం ఆరంభమైంది. పెండింగ్‌లో ఉన్న ద్వైపాక్షిక సమస్యలు–స్వల్పకాలికం, దీర్ఘకాలికం– చూద్దాం. ముందుగా టిబెట్టు సమస్య, 90వ సంవత్సరంలో ప్రవేశించిన ప్రస్తుత దలైలామా వారసుని నియామకంపై వివాదం. తన వారసుని ఎంపిక చేసే హక్కు దలైలామాకు ఉందని చెప్పటం ద్వారా కేంద్రమంత్రి కిరణ్‌రిజిజు తొలుత కొంత గడబిడ లేవదీశారు. దానికి చైనా అభ్యంతరం చెప్పింది. ఈ వారసుని ఎంపికలో భారత్ జోక్యం చేసుకోబోదని చెప్పి విదేశాంగమంత్రి ఆ వివాదాన్ని దిద్దుబాటు చేశా రు. అదీ సరైన వైఖరి. అయితే దలైలామా అంతిమంగా, చైనా అభిప్రాయాలను కాదని వారసుని ప్రకటిస్తే చైనా నుంచి ఏదోకరూపంలో జోక్యం ఉంటుంది. అప్పుడు భారత వైఖరి ఏమిటన్న సం దేహం ఉంది. రెండో సమస్య–ట్రంప్ వాణిజ్య యు ద్ధం నేపథ్యంలో భారత్ – చైనా వాణిజ్య సంబంధాల నిర్వహణ. చైనాకు అనుకూలంగా భారీగా వాణిజ్య నిల్వ ఉంది. చైనా ఇంతకుముందు భారత్ వ్యతిరేక వైఖరులు తీసుకున్నప్పుడు, చైనా నుంచి దిగుమతులు తగ్గించి వాణిజ్య లోటుతగ్గించే ప్రయ త్నం జరిగింది. ఆ పనిచేస్తే మన ఎలక్ట్రానిక్స్, ఫార్మారంగాల పరిశ్రమలు రెండింటిపై పడే వ్యతిరేక ప్రభావాన్ని వాణిజ్య మంత్రిత్వశాఖ గుర్తించింది. దాంతో దిగుమతుల తగ్గింపు ఆచితూచి జరుగుతోంది. అయినా చైనాతో భారత్ వాణిజ్య లోటు 2025లో 100 బిలియన్ అమెరికన్ డాలర్లకు చేరింది. ట్రంప్ టారిఫ్ యుద్ధం నేపథ్యంలో ప్రస్తుతం వాషింగ్టన్‌లో అమెరికా–భారత్ వాణిజ్య చర్చలు తుదిదశలో ఉన్నాయి. చైనా వాణిజ్యానికి చేటుచేయటానికి భారత్‌ను కేంద్రంగా వాడుకోవాలని అమెరికా చూస్తోంది. ఇది చైనాకు తెలుసు. చైనా ఎగుమతులను నష్టపరిచే విధంగా అమెరికాతో ఒప్పందాలు చేసుకునే దేశాలకు చైనా నుంచి ఎదురుదెబ్బ తప్పదని అది ఇప్పటికే హెచ్చరించింది. చైనాది రెండవ అతిపెద్ద ఆర్థికవ్యవస్థ. అమెరికాతో గతనెలలో వాషింగ్టన్‌లో జరిగిన వాణిజ్య చర్చల్లో అది తన అనేక వాణిజ్య రంగాలను అమెరికా దాడినుంచి కాపాడుకోగలిగింది. భారత్‌కు అంతటి బేరసారాల శక్తి లేదు. అందువల్ల చైనా వాణిజ్యానికి చేటుచేయటంపై అమెరికా ఆదేశాలకు భారత్ తలొగ్గినట్లయితే చైనా– భారత్ వాణిజ్య సంబంధాల్లో కొత్త సమస్యలు తప్పవు. తమిళనాడు, కర్నాటకల్లోని ఫాక్స్‌కాన్ ఐఫోన్ ఫ్యాక్టరీలనుంచి చైనీస్ ఇంజినీర్లను వెనక్కి తీసుకోవటం ద్వారా భారత్ ఆర్థికవ్యవస్థకు చేటుచేయగల తన శక్తిని చైనా ఇప్పటికే ప్రదర్శించింది. చైనా ఎగుమతులను దెబ్బతీసే అంశాలు అమెరికా – భారత్ వాణిజ్య ఒప్పందం లో ఉన్నట్లయితే చైనా అటువంటి ఒత్తిళ్లు మరిన్ని ప్రయోగించగలదు. అసమానతలున్నప్పటికీ, భార త్ ఆర్థిక వ్యవస్థ పురోగతిలో ఉంది. భారత్ ఈ సంవత్సరాంతానికి ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థానం చేరుకోవచ్చు. వచ్చే రెండు–మూడేళ్లలో అమెరికా, చైనా తర్వాత మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించవచ్చు. అయితే భారత్ ఇప్పుడు జనాభాలో చైనాతో సమానంగా ఉన్నప్పటికీ, చైనా ఆర్థికవ్యవస్థ భారత్‌కు ఆరు రెట్లు పైగా ఉంది. అమెరికాతో సమానం కావాలని, చైనాలో కమ్యూనిస్టు పాలన వందేళ్లలో ప్రవేశించే 2049 నాటికి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని చైనా కృతనిశ్చయంతో ఉంది.





అయితే చైనాను నిరోధించటానికి అమెరికా ఏర్పాటు చేసినట్లుగా జిన్‌పింగ్ పరిగణిస్తున్న క్వాడ్‌లో భారత్ క్రియాశీలంగా పాల్గొనడం చైనాకు ఆందోళన కలిగిస్తున్న తాజా అంశం. అధ్యక్షుడు ట్రంప్ ఇటీవలి యత్నాలు ప్రధాని మోదీకి ఆందోళన కలిగిస్తున్నప్పటికీ, భారత్ ఇప్పటికి క్వాడ్‌పై అమెరికా వైఖరులు బలపరుస్తున్నది. ఈ సంవత్సరం సెప్టెంబర్–అక్టోబర్‌లో భారత్‌లో క్వాడ్ అగ్రనాయక సమావేశానికి ప్రధాని నరేంద్ర మోదీ ఆతిథ్యం ఇవ్వనున్నారు. దాదాపు అదే సమయంలో– తేదీలు తేడాతో చైనాలోని టియాన్‌జిన్‌లో షాంఘై సహకార సంస్థ అగ్రనాయక సమావేశం జరుగుతుంది. క్వాడ్ సమావేశం తదుపరి ఎస్‌సిఒ సమ్మిట్ జరిగే పక్షంలో, మోదీ చైనాలో జిన్‌పింగ్‌తో సమావేశంలో క్వాడ్ నిర్ణయాలపై ఎంతో వివరించాల్సి ఉంటుంది. అదేవిధంగా ఎస్‌సిఒ తర్వాత క్వాడ్ సమ్మిట్ జరిగే పక్షంలో ఎస్‌సిఒ నిర్ణయాలు, అమెరికా వ్యూహంపై దాని ప్రభావం గూర్చి మోదీ ట్రంప్‌కు ఎంతో వివరణ ఇచ్చుకోవాల్సి ఉంటుంది. అమెరికా, చైనా డిమాండ్‌ల విషయంలో భారత్ ప్రయోజనాలను సమతౌల్యం చేయటానికి ప్రధాని మోదీ సెప్టెంబర్/అక్టోబర్‌లో ఎంతో శ్రమించాల్సి ఉంటుంది.

సరిహద్దు సమస్య దీర్ఘకాలికమైంది. 2020లో గల్వాన్ లోయలో పరిణామాలలాగా దానినిప్పుడు పెంచుకోవటంలో చైనా ఆసక్తిచూపటంలేదు. చైనా ఇప్పుడు ఇతర సమస్యలపై–మరింతగా ప్రపంచ సమస్యలపై ఆసక్తి చూపుతోంది. చైనా నాయకత్వం మధ్యకాలిక వైఖరి తీసుకోవటంలో భారత్ వైఖరి నిర్ణయాత్మక అంశంగా ఉంటుంది. భారత్ 'చైనా వ్యూహం' ఈ కాలపు డిమాండ్‌లకు అనుగుణంగా వెసులుబాటుతో ఉండాలి. చైనా డోనాల్డ్ ట్రంప్ ఖాళీ చేసిన 'బహుళపక్ష వ్యవస్థ' జాగాను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తోంది. నిబంధనలు ప్రాతిపదికగా ఉన్న అంతర్జాతీయ ప్రపంచ వ్యవస్థకు ప్రాతినిధ్యం వహించే నాయకుని స్థానంలో తాను ఉండటానికై చైనా ఇయుతో సహా అత్యధిక దేశాలతో మృదువుగా మాట్లాడుతోంది. ప్రస్తుత సుంకాల ప్రపంచ కల్లోలంలో అనేక వర్ధమాన దేశాల, యూరోపియన్ దేశాల మనస్సులు గెలుచుకోవటం ద్వారా చైనా ప్రపంచ వాణిజ్య దౌత్యంలో లబ్ధి పొందింది.

దక్షిణాసియాలో దౌత్యంలో భారత్‌ను ఇబ్బందిపెట్టటానికి ఇటీవల కాలంలో చైనా చేసిన ప్రయత్నాలు భారత్ గ్రహించాలి. అందుకు నిందను భారత్ మోయకతప్పదు. భారత్‌ను మినహాయించి సార్క్ తరహా శిబిరం ఏర్పాటుకై చైనా ఇటీవల పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లతో చర్చలు జరిపింది. భారత్‌కు అమిత్ర తక్షణ ఇరుగుపొరుగు దేశాలైన పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లపై ఇప్పుడు చైనా పెద్ద ప్రభావం కలిగి ఉంది. సున్నితమైన సమస్యలతో వ్యవహరించటంలో మన విదేశాంగశాఖ అధికారులకు ఎంతో అనుభవం ఉంది. ఇరుగుపొరుగు దేశాలతో సంబంధాల విషయంలో విధానాలు నిర్ణయించే స్వేచ్ఛ వారికిస్తే అది రానున్న రోజుల్లో భారత్ దౌత్యానికి సహాయకారి అవుతుంది. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖలో ప్రధానమంత్రి కార్యాలయం మితిమీరిన జోక్యం దాని సమర్థతను దెబ్బతీసింది. భారత్ విదేశాంగ విధానాన్ని ప్రస్తుత ప్రపంచ పరిణామాల దృష్ట్యా మోదీ ప్రభుత్వం పునరాలోచించాలి. అమెరికా, చైనా రెండింటితోనూ సంబంధాల పునర్నిర్ణయం వ్యూహాత్మక అవసరం.

# సర్కారు బడిలో విద్యార్థుల సంఖ్య పెరగాలంటే..



వెంకగారి భూమయ్య
9848559863

ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ విధులను నిర్వర్తిస్తూనే ప్రైవేట్ పాఠశాలల ఏర్పాటు లేదా నిర్వహణలో పాలుపంచుకోవడం అనేది ప్రభుత్వ విద్యా వ్యవస్థను పట్టిపీడిస్తున్న ఒక సంక్లిష్ట సమస్య. ఇది కేవలం వేతనాల స్థాయికి సంబంధించినది కాదు, అంతకు మించి నైతిక విలువలు, జవాబుదారీతనం, పారదర్శకతకు సంబంధించిన లోతైన ప్రశ్నలను లేవనెత్తుతుంది. ప్రజాధనంతో వేతనం పొందుతున్న ఒక ప్రభుత్వ ఉద్యోగి, అదే ప్రజా వ్యవస్థకు పోటీగా, వ్యక్తిగత లాభాపేక్షతో ప్రైవేట్ రంగంలో లాభాలు ఆర్జించడం అనేది నైతికంగా, చట్టబద్ధంగా తీవ్ర అభ్యంతరకరం. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనాల ఘర్షణ మాత్రమే కాదు, అంతకు మించి ప్రభుత్వ పాఠశాలల పట్ల అంకితభావం, జవాబుదారీతనం లోపించడాన్ని సూచిస్తుంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రైవేట్ పాఠశాలల వ్యాపారంలో నిమగ్నమైనప్పుడు, వారి దృష్టి సహజంగానే తమ ప్రభుత్వ పాఠశాల నుండి మళ్లుతుంది. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో బోధనా ప్రమాణాలను తీవ్రంగా దెబ్బతీస్తుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య కరువవుతుంది. అంతేకాకుండా, కొందరు ఉపాధ్యాయులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రభుత్వ పాఠశాలల నుండి విద్యార్థులను తమ ప్రైవేట్ పాఠశాలలకు మళ్లించడానికి ప్రయత్నించే దుస్థితి కూడా ఏర్పడవచ్చు. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గడానికి దారితీస్తుంది, చివరకు వాటి మనుగడనే ప్రశ్నార్థకమవుతుంది. ఇది ప్రజా ధనంతో జీతం పొందుతూనే, ప్రభుత్వ విద్యకు గొడ్డలి పెట్టుగా మారిన పరిస్థితిని స్పష్టంగా తెలియజేస్తుంది. ఈ ధోరణి కొనసాగితే, ప్రభుత్వ విద్యపై ప్రజలకున్న నమ్మకం సన్నగిల్లి, ప్రైవేట్ విద్య వైపు మొగ్గు చూపే పరిస్థితి వస్తుంది, ఇది సమాజంలో విద్యా అసమానతలను మరింత పెంచుతుంది. ఈ తీవ్రమైన సమస్యను పరిష్కరించడానికి ప్రజలు సూచించిన విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఒక కటాఫ్ వేతనం (ఉదాహరణకు నెలకు రూ. 50,000 మించకుండా) అనేది తాత్కాలిక ఒక పరిష్కారంగా కనిపించినా, దీనికి అనేక చిక్కులు ఉన్నాయి. వేతనాలను గణనీయంగా తగ్గించడం వల్ల కలిగే తక్షణ ఆర్థిక ప్రయోజనాలు స్పష్టంగా కనిపించినప్పటికీ, దీర్ఘకాలికంగా విద్యావ్యవస్థపై దాని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. ఒకవేళ వేతనాలు తగ్గితే, ప్రతిభావంతులైన, అర్హత కలిగిన యువత ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలోకి రావడానికి ఆసక్తి చూపకపోవచ్చు. ఇప్పటికే ఉన్న సమర్థవంతమైన ఉపాధ్యాయులు, మెరుగైన జీవనోపాధి కోసం ప్రైవేట్ రంగం వైపు మొగ్గు చూపడం లేదా అదనపు ఆదాయ వనరుల కోసం ప్రైవేట్ ట్యూషన్లు, కోచింగ్ సెంటర్లు, లేదా ఇతర ప్రైవేట్ వ్యాపారాలలోకి అడుగుపెట్టడం వంటి మార్గాలను అన్వేషించవచ్చు. అంటే, తక్కువ వేతనం అదనపు వ్యాపారాలకు కారణం కావచ్చు తప్ప వాటిని అడ్డుకోకపోవచ్చు. అంతేకాకుండా, వేతన కోత ప్రభుత్వ ఉపాధ్యాయుల నైతిక స్థైర్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తుంది. తమకు లభించే వేతనం తమ అర్హతకు, పనికి తగ్గట్టుగా లేదని భావించినప్పుడు ఉద్యోగులలో అసంతృప్తి పెరుగుతుంది. ఇది వారి పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది, అంకితభావం తగ్గి, బోధనా నాణ్యత మరింత దిగజారే ప్రమాదం ఉంది. అత్యంత దారుణంగా, తక్కువ వేతనం కొందరు ఉపాధ్యాయులను అక్రమ మార్గాల్లో డబ్బు సంపాదించడానికి ప్రోత్సహించవచ్చు, తద్వారా విద్యా వ్యవస్థలో అవినీతి ప్రబలే అవకాశం ఉంది. అంతేకాకుండా, ప్రభుత్వ ఉద్యోగులు, ముఖ్యంగా ఉపాధ్యాయ సంఘాలు ఈ రకమైన వేతన కోతను తీవ్రంగా వ్యతిరేకించి, పెద్ద ఎత్తున నిరసనలకు దిగే అవకాశం ఉంది, ఇది విద్యా రంగంలో అస్థిరతకు దారితీస్తుంది.

మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో అమలులో ఉన్న కొన్ని సంస్కరణల గురించి మనం ప్రస్తావించుకున్నప్పుడు, వాటిని పూర్తిగా తెలంగాణలో అమలు చేయడం అనేది అంత సులభం కాదు. ప్రతి రాష్ట్రానికి దానిదైన సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులు ఉంటాయి. ఒక రాష్ట్రంలో విజయవంతమైన విధానం మరొక రాష్ట్రంలో అదే స్థాయిలో పని చేయకపోవచ్చు. మహారాష్ట్రలో 'ఫలితాల ఆధారిత వేతనం' లేదా 'విద్యార్థుల సంఖ్య ఆధారిత వేతనం' వంటి ప్రయోగాలు ఉన్నప్పటికీ, ప్రతి ఉపాధ్యాయునికి రూ.50,000 మించకుండా వేతనం అనే కఠినమైన చట్టం అమలులో ఉందా అనేది స్పష్టం కాదు. ప్రభుత్వ ఉద్యోగుల పే స్కేల్ నిర్ణయం అనేది కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఉద్యోగుల డిమాండ్లు, జీవన వ్యయం వంటి అనేక అంశాలపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి, మహారాష్ట్ర మోడల్‌ను తెలంగాణలో అమలు చేయాలంటే విస్తృత అధ్యయనం, ప్రణాళిక, ప్రస్తుతం ఉన్న చట్టపరమైన నిబంధనలను సవరించడం వంటి సంక్లిష్ట ప్రక్రియ అవసరం.

ప్రస్తుతం, తెలంగాణ రాష్ట్రంలో సుమారు 1.25 లక్షల నుండి 1.30 లక్షల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ సంఖ్యలో ప్రాథమిక స్థాయి నుండి జూనియర్, డిగ్రీ కళాశాలల లెక్చరర్లు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు కూడా భాగమై ఉంటారు. వీరి వేతనాలపై ప్రభుత్వం ప్రతి సంవత్సరం వేల కోట్ల రూపాయలను ఖర్చు చేస్తుంది. ఉదాహరణకు, సగటున ఒక ఉపాధ్యాయునికి నెలకు రూ. 70,000 వేతనం అనుకుంటే, వార్షిక వేతన వ్యయం సుమారు రూ. 10,500 కోట్లు అవుతుంది. దీనికి అదనంగా, పెన్షన్లు, గ్రాట్యుటీలు, ఇతర అలవెన్సులు, వెల్ఫేర్ స్కీమ్‌ల కోసం ప్రభుత్వం చేసే వ్యయం కలిపి సంవత్సరానికి రూ. 15,000 కోట్ల నుండి రూ. 20,000 కోట్ల వరకు ఉండవచ్చని అంచనా. ఇది రాష్ట్ర బడ్జెట్‌లో గణనీయమైన భాగం, ఇది ఆర్థిక క్రమశిక్షణ అవసరాన్ని నొక్కి చెబుతుంది. అయితే, ఈ భారాన్ని తగ్గించడానికి కేవలం వేతన కోతపైనే ఆధారపడకుండా, ప్రభుత్వ వ్యయాన్ని అన్ని రంగాల్లోనూ తగ్గించడం, పన్ను వసూళ్లను పటిష్టం చేయడం, ఆర్థిక వృద్ధిని సాధించడం వంటి సమగ్ర ఆర్థిక ప్రణాళికలు అవసరం.

కాబట్టి, ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రైవేట్ వ్యాపారాల్లో పాల్గొనడాన్ని అరికట్టడానికి, విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి ఒక సమతుల్య విధానం అవసరం. కేవలం వేతన కోత వంటి తాత్కాలిక లేదా ఉపరితల పరిష్కారాలు దీర్ఘకాలికంగా విద్యా నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. దీనికి బదులుగా, కఠినమైన చట్టపరమైన చర్యలు, పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థలు అవసరం. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని కఠినతరం చేసి, ప్రైవేట్ వ్యాపారాల్లో భాగస్వామ్యాన్ని స్పష్టంగా నిషేధించాలి. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారికి కఠిన శిక్షలు విధించాలి, తద్వారా ఇతరులకు అది ఒక పాఠంగా మారుతుంది.
వీటన్నింటికీ మించి, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం అత్యంత కీలకమైన అంశం. పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, ఆధునిక బోధనా పద్ధతులను ప్రవేశపెట్టడం, సరిపడా సిబ్బందిని సమకూర్చడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను ఆకర్షణీయంగా మార్చాలి. ఉపాధ్యాయులకు నిరంతర శిక్షణ, అవసరమైన వనరులను అందిస్తూ, వారి పనితీరును క్రమం తప్పకుండా మూల్యాంకనం చేసి, జవాబుదారీతనాన్ని పెంచాలి. ఉత్తమ పనితీరు కనబరిచే వారికి తగిన ప్రోత్సాహకాలు అందించడం ద్వారా వారిని మరింత అంకితభావంతో పని చేయడానికి ప్రేరేపించవచ్చు. తల్లిదండ్రులలో ప్రభుత్వ విద్యపై నమ్మకం కలిగించడం ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచవచ్చు. ఈ సమగ్ర విధానం ద్వారా ప్రభుత్వ ఉపాధ్యాయులలో తమ పాఠశాల పట్ల అంకితభావం పెరుగుతుంది, వారు ప్రైవేట్ వ్యాపారాల వైపు చూడకుండా తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తారు. అప్పుడే ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులతో కళకళలాడుతాయి, నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులోకి వస్తుంది, తద్వారా రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయి.

# దృఢమైన దేహంలోనే చురుకైన మెదడు

మైదాన ఆటలు పిల్లలు, యువతకు మాత్రమే కాదని, పెద్దలు కూడా ఆడుతూ మన ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యకర దేహంలో చురుకైన మెదడు (సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ బాడీ) ఉంటుందని మనం తెలుసుకోవాలి. ఏ పని సజావుగా, విజయవంతంగా పూర్తి చేయాలన్నా మనకు సంపూర్ణ ఆరోగ్యం ఉండాలి. ఆరోగ్య పరిరక్షణకు అనునిత్యం కొంత సమయం కేటాయించాలి, ఆరోగ్యంగా ఉన్నపుడుదాని విలువ తెలియదు. అనారోగ్యం చుట్టుముట్టినపుడు ఆరోగ్యం విలువ అవగతం అవుతుంది. ఆరోగ్యానికి తప్పనిసరిగా అర గంట నుండి గంట సమయం కేటాయిస్తే ఆరోగ్య దేవత మన శరీరంలో కొలువు ఉంటుంది. ఆటలు ఆడడం వల్ల శారీరక దృఢత్వం పెరిగి మానసిక చురుకుదనం కలుగుతుంది.




### ఆటలతో బహుళ ప్రయోజనాలు

ఆటలతో ఆనందం కలగడమే కాకుండా శారీరక, మానసిక వికాసం కలిగి శ్రేయస్సుకు దోహదపడుతుంది. నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించాలన్నా, సమస్యలకు పరిష్కార నిర్ణయాలు తీసుకోవాలన్నా, జట్టు స్ఫూర్తి అనుభవంలోకి రావాలన్నా, సృజనాత్మక ఆలోచనలు అంకురించాలన్నా, జీవితం ఆనందమయం కావాలన్నా మైదాన ఆటలను ఆశ్రయించాలని నిపుణులు పేర్కొంటున్నారు. మన శరీరంలో ఆటలకు సంబంధించిన జన్యువులా ఉంటాయని, ఆటలు ఆడినవారిలో ఇవి చురుకుగా ఉంటూ మెదడు చురుకు దనాన్ని పెంచుతాయని శాస్త్ర పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి. నిత్యం ఆటలు ఆడే వ్యక్తులు స్మార్ట్‌గా, స్ట్రాంగ్‌గా, హ్యాపీగా ఉంటారని వెల్లడైంది. ఆటలు ఆడే పిల్లలు, యువత, పెద్దల్లో సహితం చురుకైన మెదడు, ఆలోచనా శక్తి పెరగడం, మానసిక శారీరక ఒత్తిడి తగ్గడం, జట్టుగా సమన్వయంతో పని చేసే అలవాటు కావడం, ఆత్మ విశ్వాసం పెరగడం, ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్స్ పెరగడం, విలక్షణ ఆలోచనలకు బీజాలు పడడం, ఓపిక పెరగడం, అనుకోని మార్పులను ఆకళింపు చేసుకొని ముందుకు సాగ డం, శారీరక దృఢత్వం పెరిగి అన్ని ప్రతికూల వాతావరణాలను తట్టుకునే శక్తి పెరగడం, సామాజిక మానవీయ సంబంధాలు పెరగడం, నూతన మిత్రులు పెరగడం, ఉపశమనం కలగడం, విశ్రాంతి కలగడం, రీచార్జ్ కావడం లాంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలుసుకోవాలి.

పెద్దలు ఆటల్లో పాల్గొనడం వల్ల తమలోని బాల్యం నిద్ర లేస్తుంది, అమితానందాన్ని బహుకరిస్తుంది. సంతోషాల మూటలను బహుకరిస్తుంది క్రీడా మైదానం. వయస్సును మరిచి మనందరం ఆటలను మనం అలవాటు చేసుకోవాలి. మన ఆరోగ్య పరిరక్షణకు మనమే ఆటపాటల్లో పాల్గొనాలి. మైదాన ఆటలు, సైక్లింగ్, వ్యాయామాలు, యోగా లాంటి అంశాలకు తగిన సమయాన్ని కేటాయిస్తూ, రేపటి మన ఆరోగ్యానికి నేడు పెట్టుబడి పెడదాం, ఆయురారోగ్యాలు, ఆనందమయ క్షణాలను ఆస్వాదిద్దాం.

# ఆఫ్రికా ఖండంలో కొత్త మహాసముద్రం!

ఇప్పట్లో కాదుగానీ, ఎప్పటికైనా ఆఫ్రికా ఖండంలో కొత్త మహాసముద్రం ఒకటి ఉద్భవించనుంది. 'ది ఎర్త్' తాజా సంచికలోని నివేదికను అనుసరించి, తూర్పు ఆఫ్రికాలో సోమాలియన్ ఫలకం, ఆఫ్రికన్ ఫలకం భవిష్యత్తులో విడిపోతున్నాయి. ఈ ప్రక్రియ వల్ల ఆఫ్రికా ఖండం రెండు భాగాలుగా విడిపోయే అవకాశం ఉంది. దీని వల్ల ఏర్పడే పెద్ద చీలికలోకి ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ నుంచి ఉప్పు నీరు చేరి, కొత్త మహాసముద్రం ఏర్పడవచ్చు. ఈ ప్రక్రియకు 5 నుంచి 10 మిలియన్ సంవత్సరాలు పడుతుందని గతంలో భావించేవారు. తాజా పరిశోధనల ప్రకారం, ఈ ప్రక్రియ వేగవంతమై, 1 మిలియన్ సంవత్సరాల్లోనే కొత్త మహాసముద్రం ఏర్పడవచ్చుని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో మాగ్మా (శిలాద్రవం) ప్ర భావం, భారీ భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు ఈ ప్రక్రియ ను మరింత వేగవంతం చేయొచ్చు. ప్రస్తుతం అఫార్ డిప్రెషన్ ప్రాంతంలో భూగర్భ చీలికలు, కొత్త బాల్సాల్టిక్ క్రస్ట్‌లు ఏర్పడుతున్నాయి. ఇవి కొత్త మహాసముద్రం ఆరంభ దశగా భావిస్తున్నారు. ఇలావుంటే, ఆఫ్రికా ఖండం విడిపోయే ప్రక్రియ వల్ల భవిష్యత్తులో ఈ క్రింది మార్పులు సంభవించే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఆఫ్రికా ఖండం రెండు భాగాలుగా విడిపోయి, సోమాలి యా, ఇథియోపియా, కెన్యా, టాంజానియా ప్రాంతాలు కొత్త ఖండం గా రూపాంతరం చెందవచ్చు. ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ నుండి ఉప్పునీరు చీలికలోకి ప్రవేశించి, భూభాగాల మధ్య కొత్త మహాసముద్రం ఏర్పడవచ్చు. ప్రస్తుతం భూమి మధ్యలో ఉన్న ఉగాండా, జాంబియా వంటి దేశాలు సముద్ర తీరాలను పొందే అవకాశం ఉంది. తూర్పు ఆఫ్రికా ప్రాంతం (అఫార్ డిప్రెషన్) ఈ మార్పులకు కేంద్రంగా మారుతుంది. భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు మరియు భూగర్భ శిలాద్రవం (మాగ్మా) కదలికలు తరచుగా సంభవిస్తాయి. ఈ మార్పుల కారణంగా ప్రస్తుత తీరప్రాంతాలు మారిపోయి, కొత్త తీరప్రాంతాలు ఏర్పడతాయి. జనావాసాల పునర్వ్యవస్థీకరణ, వనరుల పంపిణీలో మార్పులు సంభవిస్తాయి. ఈ మార్పులు భూమి టెక్టోనిక్ ప్లేట్ల కదలికల సహజ పరిణామంగా భావిస్తున్నారు. ఇది భూమి భౌగోళిక చరిత్రలో గొప్ప మలుపుగా నిలుస్తుంది. కొత్త మహాసముద్రం ఏర్పడితే ప్రపంచ వాతావరణంపై కూడా ప్రభావాలు తప్పకపోవచ్చు. ప్రస్తుత అంటార్కిటిక్ సర్కంపోలార్ కరెంట్ వలె కొత్త మహాసముద్రం కూడా ప్రపంచ ఉష్ణోగ్రతల సమతుల్యతను ప్రభావితం చేస్తుంది. ఎర్ర సముద్రం నుండి ప్రవేశించే ఉప్పు నీరు, కొత్త ప్రవాహాలను ఏర్పరచి ఆసియా, ఆస్ట్రేలియా ఖండాల వర్షపాతాన్ని మార్చవచ్చు. కొత్త సముద్ర జీవవైవిధ్యం కార్బన్ డయాక్సైడ్‌ను ఎక్కువగా గ్రహించడానికి వీలు కల్పించవచ్చు. అయితే, సముద్ర ఆమ్లీకరణ ప్రమాదం పెరగడంతో పగడపు దిబ్బలు, సముద్ర జీవులపై హాని కలిగించవచ్చు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## త్యాగమూర్తి ఉమెన్ చాందీ

**కొట్టాయం :** కాంగ్రెస్ పార్టీ అగ్రనేత దివంగత ఉమెన్ చాందీ ఒక వ్యక్తి కాదని పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. కేరళ రాజకీయాల వ్యక్తికరణ అని, అత్యంత క్రూరమైన, అన్యాయమైన రాజకీయ దాడులను ఎదుర్కొన్నప్పటికీ ఆయన రాష్ట్ర ప్రజల కోసం 'తనను తాను చంపుకున్నారని' అన్నారు. మాజీ ముఖ్యమంత్రి చాందీ రెండవ వర్ధంతి సందర్భంగా జరిగిన స్మారక సమావేశాన్ని ప్రారంభించిన తర్వాత రాహుల్ మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేతపై జరిగిన రాజకీయ దాడిని నేరంగా ఆయన అభివర్ణించారు. అతని (చాందీ) గురించి నిరంతరం అబద్ధాలు చెబుతున్నారని, కోట్లాది రూపాయల సోలార్ కుంభకోణాన్ని ప్రస్తావిస్తూ అన్నారు. చాందీ ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పుడు తాను క్రమం తప్పకుండా అతనితో మాట్లాడేవాడినని, కానీ కాంగ్రెస్ కురువృద్ధుడు ఎప్పుడూ ఎవరి గురించి కోపంగా మాట్లాడేవారు కాదన్నారు. ఆయన ఎల్లప్పుడూ సమతుల్యతతో వినయంగా రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం పనిచేసేవారని చెప్పారు. చాందీ నుండి తాను చాలా నేర్చుకున్నానని, కాంగ్రెస్ కురువృద్ధుడిలాంటి వ్యక్తులను మరింత మందిని అభివృద్ధి చేయాలనేది తన ఆకాంక్ష అని అన్నారు.

## గత పదేళ్ళుగా వాద్రాను బిజెపి వెంటాడుతోంది

ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ



**న్యూఢిల్లీ :** హర్యానాలోని శికోపూర్‌లో జరిగిన భూ ఒప్పందంలో అక్రమాలకు సంబంధించి మనీలాండరింగ్ కేసులో వ్యాపారవేత్తపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వం తన బావ రాబర్ట్ వాద్రాపై వేట ప్రారంభించిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం ఆరోపించారు. చివరికి సత్యం గెలుస్తుందని, తన సోదరి ప్రియాంక గాంధీ వాద్రా, ఆమె కుటుంబం ఎలాంటి 'హింస'నైనా తట్టుకుంటుందన్నారు. తన బావను గత పదేళ్లుగా ఈ ప్రభుత్వం వెంటాడుతోందన్నారు. అందులో భాగమే ఈ తాజా చార్జిషీట్ అని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్టు చేశారు. రాబర్ట్, ప్రియాంక, వారి పిల్లలు మరోసారి దురుద్దేశపూరితమైన, రాజకీయంగా ప్రేరేపించబడిన అపవాదు, వేధింపులను ఎదుర్కొంటున్నందున తాను వారికి అండగా నిలుస్తానన్నారు. వారందరూ ఎలాంటి హింసనైనా తట్టుకునేంత ధైర్యం ఉన్నారని తనకు తెలుసని, ఆ ధైర్యాన్ని కొనసాగిస్తారన్నారు. 'చివరికి సత్యం గెలుస్తుంది' అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు పేర్కొన్నారు. గాంధీ కుటుంబం ఎల్లప్పుడూ ఇటువంటి రాజకీయ ప్రేరేపిత వ్యూహాలను బలం, స్థితిస్థాపకతతో ఎదుర్కొంటూనే ఉందని, వారికి అండగా యావత్ పార్టీ నిలుస్తుందని రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్ అన్నారు. ఎసిసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ 'మోదీ, షా ద్వయం కలిసి కాంగ్రెస్ సీనియర్ నాయకత్వం, వారి కుటుంబాన్ని వెంటాడేందుకు ఇడికి నెలవారీ పనిని ఇచ్చినట్లు కనిపిస్తోందన్నారు. 'మిస్టర్ రాబర్ట్ వాద్రాపై తాజా ఇడి చర్య పూర్తిగా రాజకీయ ప్రతీకారం. బెదిరింపులకు మరో వ్యర్థ ప్రయత్నం' అని ఆయన ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో ఆరోపించారు. మరో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి రణదీప్ సుర్జేవాలా వాద్రాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్‌ను వేటగా అభివర్ణించారు. ఇది 'బెదిరించడానికి, హింసించడానికి' ప్రభుత్వం చేసిన మరొక ప్రయత్నమని, ఇది ఘోరంగా విఫలమవుతుందన్నారు.

## ఇస్లాంపూర్ ఇక ఈశ్వర్‌పూర్

మహారాష్ట్ర సర్కార్ నిర్ణయం

**ముంబయి:** మహారాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. సంగ్లీ జిల్లాలోని ఇస్లాంపూర్ పేరును ఈశ్వర్‌పూర్‌గా మార్పు చేసినట్లు ప్రకటించింది. ఈ మేరకు గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి ఛగన్ భుజ్‌బల్ అసెంబ్లీ వేదికగా శుక్రవారం ప్రకటించారు. రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆమోదం కోసం కేంద్రానికి పంపనున్నట్లు చెప్పారు. మహారాష్ట్రలో ఇప్పటికే ఔరంగాబాద్‌ను ఛత్రపతి శంభాజీనగర్‌గా, ఉస్మానాబాద్‌ను ధారాశివ్‌గా మారుస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, కేంద్రం ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఇస్లాంపూర్ పేరును ఈశ్వర్‌పూర్‌గా మార్చాలన్న డిమాండ్ ఎప్పట్నుంచో పెండింగ్‌లో ఉండగా.. తాజాగా హిందుత్వ సంస్థ శివ్ ప్రతిష్ఠాన్ మరోసారి ఈ అంశంపై కలెక్టరేట్‌లో విజ్ఞాపన పత్రం అందజేసింది. ఈ నేపథ్యంలోనే మహారాష్ట్రలో సిఎం దేవేంద్ర ఫడణవీస్ సారథ్యంలోని కూటమి ప్రభుత్వం పేరు మార్పునకు ఆమోదం తెలిపింది. ఇస్లాంపూర్ పేరు మార్చాలన్న డిమాండ్ 1986 నుంచి పెండింగ్‌లో ఉందని శివసేన నేత ఒకరు తెలిపారు.

## యెమెన్ నర్సు ఉరిశిక్ష ప్రస్తుతానికి వాయిదా..

ఆమెను సురక్షితంగా తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం

'సుప్రీంకోర్టు'కు కేంద్రం వెల్లడి





**న్యూఢిల్లీ :** యెమెన్‌లో హత్యకేసులో మరణశిక్ష పడిన భారతీయ (కేరళ రాష్ట్రం) నర్సు నిమిష ప్రియను సురక్షితంగా బయటకు తీసుకురావడానికి ప్రయత్నాలు కొనసాగుతున్నాయని, ఈ విషయంలో ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నదని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం సుప్రీంకోర్టుకు తెలిపింది.న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, సందీప్ మెహతాలతో కూడిన డివిజన్ బెంచ్‌కు ప్రియను జులైలో ఉరితీయడం అనే షెడ్యూల్ వాయిదా పడిందని చెప్పింది.'సేవ్ నిమిషప్రియఇంటర్నేషనల్ యాక్షన్ కౌన్సిల్ ఆర్గనైజేషన్ తరపున హాజరైన న్యాయవాది హత్యకు గురైన బాధిత కుటుంబాన్ని కలిసి చర్చలు జరిపేందుకు కేంద్రం నియమించిన ప్రతినిధి బృందాన్ని నిమిష ప్రియకు న్యాయపరంగా సహాయపడేందుకు మద్దతు కొనసాగించాలని కోరారు. ధర్మాసనం మాట్లాడుతూ పిటిషనర్ ప్రభుత్వానికి ఒక వినతిపత్రం అందజేయవచ్చని చెప్పింది. దానిని వారు తరలించడానికి స్వేచ్ఛగా ఉన్నారు అని ధర్మాసనం చెప్పింది. అనంతరం అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి మాట్లాడుతూ కేంద్రం ప్రయత్నాలు కొనసాగుతున్నాయని చెప్పగా, పిటిషనర్ తరపు న్యాయవాది మాట్లాడుతూ ఉరితీయడం వాయిదాపడిందని బెంచ్‌కు చెప్పారు. 'మొదటి విడతగా ఇప్పటికిప్పుడు వారు ఉరితీయడం ఆపివేశారు. మనం తొలుత వారి క్షమాపణను కోరాల్సిన అవసరం ఉంది. బ్లడ్‌మనీ రెండవదశలో వస్తుంది. మొదట బాధిత కుటుంబం మనల్ని క్షమించాల్సి ఉంటుంది' అని న్యాయవాది చెప్పారు. బ్లడ్‌మనీపై చర్చ తర్వాత బాగా జరగవచ్చని చెప్పారు. ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోతే నిషేధంఉన్నందున యెమెన్ ఎవరూ ప్రయాణించలేని దేశమేమీ కాదని న్యాయవాది తెలిపారు. ధర్మాసనం దీనిపై స్పందిస్తూ మీరు ప్రభుత్వంతో సంప్రదించండి, ప్రభుత్వం ఇప్పటికే మీ కోసం చాలా చేస్తోంది. ద్వేషించే వారిని వారివైపు నుంచి చివరి వరకూ బాగా చూసుకోవడం సాధ్యమే అని ధర్మాసనం చెప్పింది. పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనాన్ని అభ్యర్థిస్తూ పిటిషనర్ ఆర్గనైజేషన్ నుంచి ఇద్దరు లేదా ముగ్గురుతో కూడిన ప్రతినిధి బృం దం, ఇప్పటికే యెమెన్‌లో బాధిత కుటుంబంతో సంప్రదింపులలో భాగస్వామియైన కేరళకు చెందిన ఒక మత ప్రబోధకుడి ప్రతినిధులు, యెమెన్‌కు ;ప్రయాణం అయ్యేలా అనుమతించాలన్నారు. కేంద్రం సముచితమని భావిస్తే ప్రభుత్వం నుంచి కూడా ఒక ప్రతినిధి కూడా యెమెన్‌కు వెళ్లవచ్చని న్యాయవాది చెప్పారు.బాధితురాలి కుటుంబంతో చర్చలు జరపడానికి నిమిషప్రియ తల్లి యెమెన్‌లో ఉందని, ఢిల్లీ హైకోర్టు ఆమె ప్రయాణానికి కేంద్రాన్ని అనుమతి కోరడంతో ఆమె యెమెన్‌కు వెళ్లిందని పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనానికి వివరించారు. ధర్మాసనం ఆగష్టు 14కు విచారణను వాయిదా వేసింది.

## జస్టిస్ వర్మ అభిశంసనతో ప్రభుత్వానికి సంబంధం లేదు

అది పూర్తిగా ఎంపిల అంశం : కేంద్ర మంత్రి మేఘ్‌వాల్

**న్యూఢిల్లీ :** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మపై పార్లమెంటులో అభిశంసన తీర్మానం తీసుకురావడమనే అంశం పూర్తిగా పార్లమెంటు సభ్యులకు సంబంధించిన వ్యవహారమని, అందులో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ శుక్రవారం తెలిపారు. నగదు దొరికిన వివాదంపై న్యాయమూర్తి వర్మ మీద ఆరోపణలను పరిశీలించడానికి నాటి భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీ ఇప్పటికే తన నివేదికను సమర్పించిందని 'పిటిఐ' కి వెల్లడించారు. న్యాయమూర్తి వర్మ ఆ నివేదికతో ఏకీభవించకపోతే , సుప్రీంకోర్టు లేదా హైకోర్టును ఆశ్రయించినట్లయితే, అది ఆయన విచక్షణాధికారం అని మంత్రి మేఘ్‌వాల్ అన్నారు. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు న్యాయమూర్తిని తొలగించే హక్కు పార్లమెంటుకు ఉందని ఆయన చెప్పారు. న్యాయమూర్తిని అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు లోక్‌సభలో కనీసం 100 మంది సభ్యుల మద్దతు, రాజ్యసభలో 50 మంది సభ్యుల మద్దతు అవసరం అని ఆయన తెలిపారు. ఇది పూర్తిగా ఎంపిల వ్యవహారం అని, వారు కొన్ని ప్రయత్నాలు చేశారని, ఇందులో ప్రభుత్వానికి ఎటువంటి ప్రమేయం లేదని మేఘవాల్ చెప్పారు. ఇదిలా ఉండగా, నగదు దొరికిన వివాదంలో తనను దుష్ప్రవర్తనకు పాల్పడినట్లు తేల్చిన అంతర్గత విచారణ ప్యానెల్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ న్యాయమూర్తి వర్మ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

తనను పదవి నుండి తొలగించాలని నాటి ఛీఫ్ జస్టిస్ ఖన్నా మే 8న చేసిన సిఫార్సును రద్దు చేయాలని ఆయన కోరారు. సోమవారం నుండి ప్రారంభం కానున్న పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో న్యాయమూర్తి వర్మను తొలగించడానికి ప్రభుత్వం ఒక తీర్మానం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎంపిలు కూడా ఈ తీ ర్మానంపై సంతకం చేస్తారని కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ తెలిపారు. సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.కె. ఉపాధ్యాయ నేతృత్వంలోని 25 పేజీల విచారణ నివేదికలో హిందీలో రెండు చిన్న నోట్స్ ఉన్నాయి. మార్చి 14న న్యాయమూర్తి వర్మ లూటియన్స్ ఢిల్లీ నివాసంలోని స్టోర్ రూమ్‌లో అగ్నిప్రమాదం జరిగిన తర్వాత, నాలుగు నుండి ఐదు సగం కాలిపోయిన కరెన్సీ నోట్లతో కూడిన సంచులు లభించినట్లు అందులో పేర్కొన్నారు. ప్రాథమికంగా, షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగిందని నివేదిక తెలిపింది. అప్పట్లో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న న్యాయమూర్తి వర్మ, తన సమాధానంలో ఆ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. తన ద్వారా లేదా తన కుటుంబ సభ్యుల ద్వారా ఎన్నడూ స్టోర్‌రూమ్‌లో నగదు ఉంచబడలేదని చెప్పారు. నాడు ఆయన అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయబడగా, అక్కడే కొనసాగతున్నప్పటికీ ఆయనకు ఎటువంటి న్యాయపరమైన పని అప్పగించలేదు.

**ఆదివారం పార్లమెంటుపై రాజకీయ పార్టీలతో భేటీ**

పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కూడా అయిన మేఘ్‌వాల్ ఆగస్టు 21న ముగిసే పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సజావుగా జరుగుతాయని, అర్థవంతమైన చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. సమావేశాలు ప్రారంభమయ్యే ముందు ఆదివారం రోజు వివిధ రాజకీయ పార్టీల ముఖ్య నాయకులతో ఒక సమావేశం జరుగుతుందని, అక్కడ వారు తమ స మస్యలను తెలియజేస్తారని ఆయన అన్నారు. సమావేశం మొదటి రోజున బిజినెస్ అడ్వైజరీ కమి టీ (బిఎసి) జరుగుతుందని, అందులో సభలో చేపట్టాల్సిన అంశాలను నిర్ణయిస్తారని మంత్రి తెలిపారు.





రాజ్యాంగం మూల స్వభావాన్ని మార్చేందుకు బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే ప్రతిపక్షాల ఆరోపణపై న్యాయ శాఖ మంత్రి మాట్లాడుతూ, 'నరేంద్ర మోడీ 11 సంవత్సరాలుగా ప్రధానమంత్రిగా ఉన్నారు.... ప్రభుత్వం ఎప్పుడు రాజ్యాంగం మూల స్వభావాన్ని చెడగొట్టడానికి ప్రయత్నించింది? కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు, అత్యవసర పరిస్థితి సమయంలో, అది మొత్తం రాజ్యాంగాన్ని మార్చింది. 42వ సవరణ ఏమిటి? రాజ్యాంగాన్ని మార్చడానికి పనిచేసింది కాంగ్రెస్' అని అన్నారు. దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి) అమలుపై ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ, యుసిసిని అమలు చేసిన మొదటి రాష్ట్రం గోవా అని, దాని తర్వాత ఉత్తరాఖండ్ అని, ఇతర రాష్ట్రాలు కూడా ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాయని ఆయన అన్నారు.

'ఈ అంశం భారత లా కమిషన్ ముందు పెండింగ్‌లో ఉంది, కమిషన్ నివేదిక వచ్చిన తర్వాత దాని గురించి మాట్లాడుతాము' అని మేఘవాల్ చెప్పారు. కొన్ని రాష్ట్రాల్లో భాషా వివాదంపై ఒక ప్రశ్నకు, 2020 జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) పూర్తిగా స్పష్టంగా ఉందని ఆయన అన్నారు. 'మేము అన్ని భారతీయ భాషలను గౌరవిస్తాము. అలా చేస్తూనే ఉంటాము. మేము అన్ని భారతీయ భాషలను బలోపేతం చేస్తాము . ఇది ఎన్ఇపిలో భాగం' అని పేర్కొన్నారు.

## తూర్పు భారతం అభివృద్ధికి 'విక్షిత్' బిహార్ కీలకం

ఉద్యోగాలు పేరుతో ఆర్‌జెడి భూమి లాక్కొంది : ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ :** ఉద్యోగాలు ఇస్తామని తప్పుడు వాగ్దానం చేసి పేదల నుండి భూమిని ఆర్‌జెడి లాక్కుందని శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. పరక్షంగా 'ల్యాండ్ ఫర్ జాబ్' కుంభకోణాన్ని ప్రస్తావించారు. తూర్పు భారతదేశ అభివృద్ధికి 'విక్షిత్' (అభివృద్ధి చెందిన) బిహార్ కీలకమని ఆయన పేర్కొన్నారు. బిహార్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ తన ప్రచారాన్ని ఇప్పటి నుంచే ప్రారంభించారు. శుక్రవారం మోతిహారిలో జరిగిన బహిరంగ ర్యాలీలో ప్రసంగించారు. 'బనాయేంగే నయా బీహార్, ఫిర్ ఏక్ బార్ ఎన్డీఏ సర్కార్' (మరోసారి ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మేము కొత్త బీహార్‌ను నిర్మిస్తాం) అనే కొత్త నినాదాన్ని రూపొందించారు. ఇది జనంలో నినాదాలను రగిలించి పార్టీ కార్యకర్తలను ఉత్తేజపరిచింది. కాంగ్రెస్‌–ఆర్జేడీ కలయిక పేదలు, సామాజికంగా అణగారిన ప్రజలతో రాజకీయాలు చేసిందని, రాష్ట్రం గతంలో నిర్లక్ష్యం, స్తబ్దతకు గురైందని, ప్రతిపక్ష కూటమిపై మోదీ విమర్శలు చేశారు. ఆపరేషన్ సింధూర్ తీర్మానాన్ని తాను బీహార్ నేల నుంచే తీసుకున్నానని, ప్రపంచం దాని విజయాన్ని చూసిందని ప్రధాని ఉద్ఘాటించారు. ఆర్జేడీ యువతకు ఉపాధి కల్పించడం గురించి ఆలోచించలేకపోతోందన్నారు. వారు (ఆర్జేడీ నాయకులు) ఉద్యోగాల కోసం తప్పుడు హామీ ఇచ్చి పేదల నుండి భూమిని లాక్కున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆర్జేడీ–కాంగ్రెస్ పాలనలో అభివృద్ధిలో భారీ అంతరం ఉందన్నారు. వారు ఎప్పుడూ పేదల అభ్యున్నతి గురించి ఆలోచించలేదని, పేదలు, సామాజికంగా అణగారిన వర్గాల పేరుతో రాజకీయాలు మాత్రమే ఆడారని ఆయన ఆరోపించారు. యువతకు మరిన్ని అవకాశాలను హామీ ఇస్తూ, దేశవ్యాప్తంగా ఉద్యోగాలు, ఉపాధి కల్పించడంలో కేంద్రం రూ. లక్ష కోట్లు పెట్టుబడి పెడుతుందని ప్రధాని అన్నారు. తూర్పు భారత దేశం సమగ్ర అభివృద్ధికి 'విక్షిత్ బీహార్' ముఖ్యమైనదని మోదీ పేర్కొంటూ రాష్ట్ర పురోగతి గురించి ఎన్‌డిఎ ఆందోళన చెందుతోందని అన్నారు. 'గత 45 రోజుల్లో ప్రభుత్వం బీహార్‌లోని 24,000 స్వయం సహాయక బృందాలకు రూ. 1,000 కోట్లు విడుదల చేసింది. దేశంలోని మొత్తం 1.5 కోట్ల 'లక్షపతి దీదీ'లలో 20 లక్షల మంది రాష్ట్రానికి చెందినవారే' అని అన్నారు. దేశ స్వాతంత్ర్య పోరాట సమయంలో మహాత్మా గాంధీ ఉద్యమానికి చంపారన్ కొత్త దిశానిర్దేశం చేశారని చెప్పారు. ముంబయిలాగే మోతీహారిని అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు.

## ఢిల్లీలో 45 పాఠశాలలకు బాంబు బెదిరింపు మెయిల్స్





**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో పాఠశాలలకు బాంబు బెదిరింపులు ఘటనలు అంతకంతకూ పెరుగుతున్నాయి. తాజాగా శుక్రవారం శుక్రవారం ఢిల్లీలోని 45కు పైగా పాఠశాలలు, మూడు కళాశాలలకు ఇ–మెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. వరుస ఘటనలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులలో భయాందోళనలను రేకెత్తిస్తున్నాయి. ఢిల్లీలో పాఠశాలలకు బాంబు బెదిరింపులు రావడం ఈ వారంలో ఇది నాల్గవ రోజు. ఢిల్లీ పోలీసులు, ఇతర సత్వర స్పందన అధికారులు ప్రస్తుతం గాలింపు, తరలింపు కార్యకలాపాలలో నిమగ్నమై ఉన్నారని ఒక అధికారి తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే బాంబు నిర్వీర్య, డాగ్ స్క్వాడ్‌లతో పాటు పోలీసులు పాఠశాలలు, కళాశాలలకు చేరుకున్నారు. అధికారుల నుండి అందిన తాజా సమాచారం ప్రకారం, ఉత్తర ఢిల్లీలోని ఇంద్రప్రస్థ (ఐపి) కాలేజ్ ఫర్ ఉమెన్, హిందూ కాలేజీ, శ్రీ రామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సిసి) వంటి మూడు కళాశాలలకు ఇటువంటి బెదిరింపులు వచ్చినట్లు ఒక సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. గతంలోనూ బహుళ జిల్లాల్లోని పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. ద్వారకలో, సెయింట్ థామస్ స్కూల్, జిడి గోయెంకా స్కూల్, డిఐఎస్ ఎడ్జ్ స్కూల్, మోడరన్ ఇంటర్నేషనల్ స్కూల్, ద్వారకా ఇంటర్నేషనల్ స్కూల్, లా పెటైట్ మాంటిస్సోరి ఆరు పాఠశాలలకు బెదిరింపులు వస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందించింది. తదనంతరం, ఈ పాఠశాలల్లో సహాయక చర్యలు ప్రారంభించారు. 'హలో... నేను పాఠశాల తరగతి గదుల్లో అనేక పేలుడు పరికరాలను (ట్రినిట్రోటోలుయెన్) ఉంచానని మీకు తెలియజేయడానికి వ్రాస్తున్నాను. పేలుడు పదార్థాలను నల్లటి ప్లాస్టిక్ సంచులలో దాచిపెట్టారు' అని ఇమెయిల్స్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు. ద్వారక పాఠశాలల్లో ఇప్పటివరకు అనుమానాస్పదంగా ఏమీ కనుగొనబడలేదని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ద్వారక) అంకిత్ సింగ్ తెలిపారు. అదేవిధంగా, రోహిణిలో, సెక్టార్ 3లోని ఎంఆర్‌జి స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్, సెక్టార్ 24లోని సావరిన్ పబ్లిక్ స్కూల్, హెరిటేజ్ పబ్లిక్ స్కూల్, సెక్టార్ 9లోని ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్, సెక్టార్ 3లోని అభినవ్ పబ్లిక్ స్కూల్, హెరిటేజ్ స్కూల్ అధికారులు తమ ప్రాంగణంలో పేలుడు పరికరాలు ఉన్నాయని మెయిల్స్ రాగా, పోలీసులను సంప్రదించిన తర్వాత తరలింపు ప్రక్రియను ప్రారంభించారు. దేశ రాజధానిలోని ఇతర ప్రాంతాల పాఠశాలల్లో కూడా ఇలాంటి దృశ్యాలు కనిపించాయి. ఈ విషయంపై ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిషి బిజెపిని తీవ్రంగా విమర్శించారు.

**బెంగళూరులోనూ బాంబు బెదిరింపులు**

ఢిల్లీ తరహాలోనే శుక్రవారం బెంగుళూరులోని స్కూళ్లకు కూడా బాంబు బెదిరింపులు వచ్చాయి. సిటీలోని సుమారు 40 ప్రైవేటు స్కూళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చినట్లు పోలీసులు వెల్లడించాయి. ఆర్ఆర్ నగర్‌తో పాటు కేన్‌గిరిలో ఉన్న స్కూళ్లకు కూడా బెదిరింపులు వచ్చినట్లు తెలుస్తోంది. బెదిరింపు మెయిల్స్ రావడంతో విద్యార్థులు, పేరెంట్స్ ఆందోళనకు గురయ్యారు. పోలీసులు తక్షణమే స్కూళ్ల వద్ద తనిఖీ బృందాలను ఏర్పాటు చేశారు.

## లాలూపై ట్రయల్ కోర్టు విచారణ నిపివేతకు సుప్రీం 'నో'



**న్యూఢిల్లీ :** భూములకు ఉద్యోగాల కుంభకోణంలో బిహార్ మాజీ ముఖ్యమంత్రి, ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌కు చుక్కెదురైంది. ఈ కేసులో ట్రయల్ కోర్టు విచారణను నిలిపివేసేలా ఢిల్లీ హైకోర్టుకు ఆదేశాలివ్వాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారంనాడు కొట్టివేసింది. ఈ కేసులో జోక్యం చేసుకునేందుకు నిరాకరించింది. దీంతో ఈ కేసు విచారణ యథాతథంగా కొనసాగనుంది. ఇండియన్ రైల్వేస్ వెస్ట్ సెంట్రల్ జోన్ జబల్‌పూర్‌లో గ్రూప్‌డి నియామకాల్లో అవకతవకలకు సంబంధించిన కేసు ఇది. 2004–2009 మధ్య లాలూ ప్రసాద్ రైల్వేశాఖ మంత్రిగా ఉన్నారు. ఉద్యోగాలకు ప్రతిగా అభ్యర్థులు లాలూ కుటుంబసభ్యులు, సన్నిహితులకు భూములు బదలాయించారని ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీల ఆరోపణగా ఉంది. ఈ క్రమంలో సిబిఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాల్సిందిగా లాలూ ప్రసాద్ అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. అయితే అత్యున్నత న్యాయస్థానం ఇందుకు నిరాకరించింది. విచారణను త్వరతగతిన పూర్తి చేయాల్సిందిగా ఢిల్లీ హైకోర్టును న్యాయమూర్తులు ఎంఎం సుంద్రేష్, ఎన్.కోటీశ్వర్‌లతో కూడిన సుప్రీం ధర్మాసనం ఆదేశించింది. హైకోర్టు ముందు జరుగుతున్న విచారణలో జోక్యం చేసుకోలేమని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. ప్రస్తుతానికి విచారణ కోర్టుకు లాలూ ప్రసాద్ వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది. దీనికి ముందు, ఈ కేసులో ప్రత్యేక కోర్టు ముందున్న విచారణపై స్టే ఇచ్చేందుకు మే 29న ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. తదుపరి విచారణను ఆగస్టు 12కు వాయిదా వేసింది.



## మనీలాండరింగ్ కేసులో ఛత్తీస్‌గఢ్ మాజీ సిఎం కుమారుడు అరెస్టు

**రాయ్‌పూర్ :** లిక్కర్ స్కామ్‌తో సంబంధం ఉన్న మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ నాయకుడు, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ కుమారుడు చైతన్య బాఘేల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) శుక్రవారం అరెస్టు చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. దుర్గ్ జిల్లా భిలాయ్ పట్టణంలోని ఆయన నివాసంలో తాజాగా దాడులు నిర్వహించిన తర్వాత మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్ఎ) కింద ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అయితే ఆయన నివాసం వద్ద పార్టీ పార్టీ మద్దతుదారులు తరలి రాగా, ఇంటి వెలుపల భారీ సంఖ్యలో పోలీసు సిబ్బంది మోహరించారు. శుక్రవారం చైతన్య పుట్టినరోజు అని మాజీ ముఖ్యమంత్రి బఘేల్ తెలిపారు. కాగా, ప్రత్యేక పిఎంఎల్ఎ కోర్టు చైతన్యను ఐదు రోజుల పాటు ఇడి కస్టడీకి పంపినట్లు వర్గాలు తెలిపాయి. ఈ కేసులో తాజా ఆధారాలు అందిన తర్వాత సోదాలకు సహకరించడం లేదని ఆరోపిస్తూ మనీలాండరింగ్ నిరోధక చట్టంలోని సెక్షన్ 19 కింద చైతన్యను అరెస్టు చేసినట్లు వర్గాలు తెలిపాయి. చైతన్యతో సంబంధం ఉన్న కంపెనీలు మద్యం కుంభకోణం నుండి వచ్చిన దాదాపు రూ. 17 కోట్ల నేరపూరిత ఆదాయాన్ని పొందాయని ఆ వర్గాలు తెలిపాయి. ఈ కుంభకోణం ఫలితంగా రాష్ట్ర ఖజానాకు భారీ నష్టం జరిగిందని, మద్యం సిండికేట్ లబ్ధిదారుల జేబులను రూ. 2,100 కోట్లకు పైగా నింపిందని ఇడి పేర్కొంది. రాయ్‌గఢ్ జిల్లాలోని తమ్నార్ తహసీల్‌లో అదానీ గ్రూప్ బొగ్గు గని ప్రాజెక్ట్ కోసం చెట్లను నరికివేసే అంశాన్ని లేవనెత్తాల్సి ఉండగా, అసెంబ్లీ సమావేశాల చివరి రోజున ఇడి తన ఇంటికి వచ్చిందని భూపేశ్ బఘేల్ ఎక్స్‌లో పోస్ట్ చేశాడు. ఈ నెల ప్రారంభంలో సీనియర్ బఘేల్ తహసీల్‌ను సందర్శించి, ఆ ప్రాంతంలో బొగ్గు గని ప్రాజెక్టు కోసం చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న స్థానిక గ్రామస్తులకు మద్దతు ఇచ్చారు. ఈ గనిని మహారాష్ట్ర స్టేట్ పవర్ జనరేషన్ కంపెనీ లిమిటెడ్‌కు కేటాయించారు. ఇది ఎండిఒ (మైన్ డెవలపర్ కమ్ ఆపరేటర్)ను అదానీ గ్రూప్‌కు కాంట్రాక్ట్ ఇచ్చింది. విపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడానికి కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని, అయితే తాను న్యాయవ్యవస్థను విశ్వసించానని, వారితో సహకరిస్తానని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. అరెస్టుకు నిరసనగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు శుకవారం ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ కార్యకలాపాలను బహిష్కరించారు. ఏజెన్సీ ప్రతిపక్షాలను వేధించడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

## ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న ఖైదీల విడుదలపై రాష్ట్రాలు ఉమ్మడి నిర్ణయం తీసుకోవాలి

సుప్రీంకోర్టు ఆదేశం

**న్యూఢిల్లీ :** జైలు నిబంధనలు రాష్ట్రాల వారీగా వేర్వురుగా ఉంటాయని, అయితే ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న ఖైదీలను విడుదల చేసే క్రమంలో ఒకే రకమైన నియమాలు రూపొందించాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మోహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. ప్రాణాంతక వ్యాధులున్న రోగులు, 70 ఏళ్ల పైబడిన ఖైదీలను విడుదల చేయాలని నేషనల్ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను రిజర్వ్ చేసింది. ఈ విషయంలో కేంద్రం ఇప్పటికే మార్గదర్శకాలను రూపొందించిందని, అదే రికార్డులో ఉన్నట్లు తెలిపింది. 'జైలు నిబంధనల విషయానికి వస్తే రాష్ట్రాల వారీగా వ్యక్తిగతంగా ఉంటాయి. అయితే, ప్రాణాంతాక వ్యాధులున్న రోగుల విడుదలకు అన్ని రాష్ట్రాలు ఒకే రకమైన నిబంధనల రూపకల్పనకు ముందుకు రావాలి.' అని బెంచ్ తెలిపింది. అయితే, ఇలాంటి ఖైదీల పట్ల కేంద్రం ఆలోచిస్తుందని అడిషినల్ సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి కోర్టుకు తెలిపారు. అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఇందుకు తగిన నిర్వహణ చర్యలు తీసుకోవాలని సూచించినట్లు చెప్పారు. క్షమాభిక్షలో భాగంగా ఇలాంటి ఖైదీల విడుదల అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాలకు కేంద్రం సూచించినట్లు చెప్పారు. మరోవైపు ఈ విధానంలో దుర్వినియోగం జరిగే అవకాశాలను సుప్రీం పరిగణనలోకి తీసుకుంది. ఇలాంటి అర్హులైన ఖైదీలకు వైద్య చికిత్స, విడుదల విషయంలో సరైన నిబంధనలను రూపొందించాలని చెప్పింది. దీనిపై స్పందించిన పిటిషనర్ ప్రాణాంతక వ్యాధులుగా ఉన్నవారిగా ఎవరిని గుర్తించాలనే అంశాన్ని మార్గదర్శకాల్లో ఉంచామని తెలిపారు. వీరిని సంబంధిత జైలు వైద్య అధికారి ధ్రువీకరిస్తారని చెప్పారు. ఇందు కోసం ఒక వైద్య బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్రం ఆలోచిస్తుందని తెలిపారు. ఈ క్రమంలోనే ఢిల్లీ ప్రభుత్వం తరపున హాజరైన న్యాయవాది మాట్లాడుతూ 1985 నుంచి ఆస్తమాతో బాధపడుతున్న ఖైదీ జైలులో ఉన్నాడని తెలిపారు. మరోవైపు కేరళలో కూడా 94ఏళ్ల ఖైదీ ఉన్నాడని నల్సా న్యాయవాది చెప్పారు. 2018లో రూపొందించిన విధానంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తుల కోసం కొన్ని నిర్దిష్ట నిబంధనలను చేర్చిందని, వైద్య బోర్డును ఏర్పాటు చేయాలని ఉత్తరప్రదేశ్ న్యాయవాది అన్నారు. కాగా, ఈ పిటిషన్‌పై మే 5న కేంద్రంతో పాటు బిహార్, ఉత్తరప్రదేశ్ సహా 18 రాష్ట్రాల స్పందనలు కోరింది సుప్రీం కోర్టు. 70ఏళ్లు పైబడిన, ప్రాణాంతక వ్యాధిగ్రస్తులైన ఖైదీలు బిహార్, కేరళ, మహారాష్ట్ర, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, బంగాల్, ఒడిశాతో సహా అనేక రాష్ట్రాల్లో జైలు శిక్ష అనుభవిస్తున్నారని నల్సా తెలిపింది. తమ నేరారోపణలను సవాలు చేయడానికి, బెయిల్ నిరాకరణకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టుకు రాలేని ఇలాంటి ఖైదీల పట్ల ప్రత్యేక శ్రద్ధ అవసరమని పిటిషనర్ వాదించారు. జైళ్లలో రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల జైలు అధికారులు సహాయం అందించడం కూడా సాధ్యం కాకపోవచ్చు అని పిటిషన్‌లో పేర్కొన్నారు. అందుకే ఈ విషయంలో జోక్యం అవసరమని అన్నారు. 2022 డిసెంబర్ 31 నాటికి దేశంలో జైలు ఆక్యుపెన్సీ రేటు 131 శాతంగా ఉందని చెప్పింది.





# జనరల్

STATE & REGIONAL NEWS

## ఈగల్ డెకాయ్ ఆపరేషన్‌లో 86మంది అరెస్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఈగల్ టీమ్ దూకుడు పెంచింది. శుక్రవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో డెకాయ్ ఆపరేషన్ నిర్వహించింది. గంజాయి కొనుగోలు చేస్తుండగా 86 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. పట్టుబడిన వారిలో సాఫ్ట్వేర్ ఇంజినీర్లు, విద్యార్థులు, డెంటల్ టెక్నిషియన్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, మార్కెటింగ్ ఉద్యోగులు, హెచ్‌ఆర్ మేనేజర్లు ఉన్నట్లు సమాచారం. 'భాయ్ బచ్చా ఆగయా' అంటూ వాట్సాప్ గ్రూప్ ద్వారా గంజాయి అమ్మకాలు జరుపుతున్నట్లు గుర్తించారు. కాగా, ఇటీవలే హైదరాబాద్లోని మల్నాడు రెస్టారెంట్లో డ్రగ్స్ పార్టీని ఈగల్ టీమ్ భగ్నం చేసిన విషయం తెలిసిందే.

## విచారణ కమిషన్ ఏర్పాటుపై వివరణ ఇవ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని భూదాన్ భూములకు సంబంధించి జరిగిన అక్రమాలపై విచారణ కమిషన్ ఏర్పాటు చేస్తారో లేదో తెలియజేయాలని రాష్ట్రాన్ని హైకోర్టు కోరింది. కమిషన్ ఏర్పాటుపై ఏం నిర్ణయం తీసుకున్నదీ తదుపరి విచారణలో చెప్పాలంది. నాగారం గ్రామంలోని సర్వే నెం.194, 195లో తండ్రి ద్వారా వచ్చిన 10 ఎకరాలకుపైగా భూమిని ప్రైవేటు వ్యక్తులకు బదలాయించడంపై విచారణ జరిపించాలని గత నెలలో వినతిపత్రం ఇస్తే అధికారులు చర్యలు తీసుకోలేదంటూ వి.రాములు అనే వ్యక్తి వేసిన పిటిషన్‌ను జస్టిస్ కె.లక్ష్మణ్ శుక్రవారం విచారించారు.
ప్రైవేటు పార్టీలైన అబ్దుల్ జావీద్, అర్షియా సుల్తానాల సాయంతో అధికారులు పిటిషనర్ భూములను మూడో పార్టీలకు కేటాయించారన్నారు. అనంతరం వీటిని మధ్యవర్తుల సాయంతో సబ్‌డివిజన్‌లు చేసి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు విక్రయించారని తెలిపారు. దీనిపై విచారణ జరిపి సహకరించిన అధికారులు, ప్రైవేటు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జూన్ 28న వినతి పత్రం సమర్పించినా చర్యలు తీసుకోలేదన్నారు. ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు ఈ భూములను కొనుగోలు చేసినందున విచారణ చేపట్టాలన్న వినతిని బేఖాతరు చేశారన్నారు. ప్రభుత్వ వివరణపై విచారణ ఈనెల 28న జరుపుతామని హైకోర్టు తెలిపింది.

## ఎలా కూల్చివేస్తారు?

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కోర్టులు ఉత్తర్వులు ఉన్నప్పటికీ తన ఇంటిని కూల్చేశారనే కోర్టుధిక్కరణ పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపి హైడ్రా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్లకు నోటీసులు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్, శేరిలింగంపల్లి జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతిలకు నోటీసులు ఇచ్చింది. కోర్టు ధిక్కరణకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగంపేటలో సున్నంచెరువు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్న హైకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా 200 చదరపు గజాల్లోని ఇంటిని కూల్చివేయడంపై వడ్డే తార కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ జరిపి ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చారు. తదుపరి విచారణను ఆగస్టు 22వ తేదీకి వాయిదా వేశారు.

## సిద్ధిపేట–2 సిఐపై విచారణ జరపండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దాంపత్య వివాదంలో కౌన్సెలింగ్ పేరుతో పిటిషనర్‌ను వేధించారనే కేసులో హైకోర్టు సిద్ధిపేట–2 పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేసింది. సిద్ధిపేట–2 సిఐ ఎం.శ్రీనివాస్ తీరుపై నిష్పాక్షిక విచారణ జరపాలని ఎస్పీని ఆదేశించింది. తప్పు చేశారని తేలితే సర్వీసు రికార్డులో నమోదు చేయాలని ఎస్పీకి ఆదేశాలు జారీ చేసింది. దాంపత్య వివాదంలో కౌన్సెలింగ్ పేరుతో పోలీసు స్టేషన్‌కు పిలిచి బెదిరింపులకు గురిచేయడంపై జి.సుమన్ వేసిన పిటిషన్‌లో జస్టిస్ టి.వినోద్‌కుమార్ ఈ ఉత్తర్వులను జారీ చేశారు.

## శ్రీలక్ష్మి వ్యాజ్యంపై తీర్పు వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఓఎంసీ కేసులో నిందితురాలు, ఐఏఎస్ శ్రీలక్ష్మి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. శుక్రవారం వాదనలు పూర్తి కావడంతో న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణ్ తీర్పును వాయిదా వేశారు. ఆకేసులో డిశ్చార్జి పిటిషన్‌ను కొట్టివేస్తూ సీబీఐ కోర్టు తీర్పు చెప్పింది. దీనిపై శ్రీలక్ష్మి రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. ఇదే కేసులో మరో అధికారి కృపానందం, ఆనాటి మంత్రి సబితా ఇంద్రారెడ్డిలను సీబీఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించిందని ఆమె లాయర్ చెప్పారు. అంతమాత్రాన అదే ఉత్తర్వులు ఇక్కడ శ్రీలక్ష్మికి వర్తించవని సీబీఐ ప్రతివాదన. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి తీర్పును వాయిదా వేశారు.

## ఇక అన్ని గురుకులాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీలు

సిఎస్ రామకృష్ణ సమీక్ష

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని గురుకులాల ఆహార కల్తీ ఘటనలు, విద్యార్థుల ఆత్మహత్యాయత్నాల నేపథ్యంలో అన్ని గురుకులాలల్లో 'ఒకే సంయుక్త ' పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.అన్ని గురుకులాల్లో ఆకస్మికంగా తనిఖీ చేసేందుకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కమిటీని నియమించాలని, అలాగే స్వల్ప అస్వస్థతకు గురయ్యే వారి నిమ్మితం గురుకులాల్లో ప్రాథమిక చికిత్సా కేంద్రాలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, 'హాస్టల్ భద్రత సెల్'ను కూడా వెంటనే ఏర్పాటు చేయాలని గురుకుల సంస్థ ప్రతిపాదనలను సిద్ధం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనుంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు అధ్యక్షతన హైదరాబాద్‌లోని సచివాలయంలో గురుకులాల సంస్థల కార్యదర్శులతో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎస్‌సి గురుకుల కార్యదర్శి డాక్టర్ వి.ఎస్. అలగు వర్షిని, ఎస్‌టి గురుకుల కార్యదర్శి సీతాలక్ష్మి, బిసి గురుకుల కార్యదర్శి సైదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆహార కల్తీ, ఆత్మహత్యలు , గురుకులాల పనితీరు తదితర అంశాలపై చర్చించారు. మాసాబ్‌ట్యాంక్‌లోని డిఎస్ఎస్ భవన్‌లో గురుకులాల కార్యదర్శులు సమావేశమై పలు నిర్ణయాలు తీసుకున్నారు.
**నిర్ణయాలు ఇలా ఉన్నాయి:** ఆహార నాణ్యతపై మెస్ మానిటర్లతో విద్యార్థుల పరిశీలన. ప్రతి వంటగదిలో పిస్ట కంట్రోల్, పాడైన ఆహారాన్ని గుర్తించే ఎస్ఒపిలు 'క్వార్టెట్ గ్రూపుల' ద్వారా మానసిక ఆరోగ్య పర్యవేక్షణ,ప్రతి నలుగురు విద్యార్థుల బృందం నిత్యం గమనించే విధానం విద్యార్థులు భద్రతగా ఉన్నామనే భావన కల్పించేందుకు 'కల్చర్ ఆఫ్ కేర్' దిశగా చర్యలు రాత్రి వేళల్లో కూడా బాధ్యతలతో విధులు నిర్వర్తించే సూపర్‌వైజర్లు సైకాలజిస్టులతో ఆన్‌లైన్ /ఆఫ్‌లైన్ విధానంలో మానసిక కౌన్సిలింగ్ విద్యార్థులు తినే ఆహార నమూనాలను త్రైమాసికంగా ప్రయోగశాలలకు పంపించాలి.

## రోడ్ల నిర్మాణాలకు అటవీ భూమి సేకరణ పనులు పూర్తిచేయాలి

మంత్రి శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బాచుపల్లి గండిమైసమ్మ వరకు ఆరు వరసల రోడ్డు, బహదూర్ పల్లి నుంచి దూలపల్లి మీదుగా కొంపల్లి వరకు సాగే రహదారి నిర్మాణాలకు అటవీ భూమి బదలాయింపుపై రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం నాడు సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అటవీశాఖ చీఫ్ ప్రిన్సిపల్ కన్సర్వేటర్ సువర్ణ, హెచ్ ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ నవాజ్, జిహెచ్ ఎంసీ అదనపు కమిషనర్, కొంపల్లి మున్సిపల్ కమిషనర్, మేడ్చల్ అదనపు కలెక్టర్, తదితరులు పాల్గొన్న ఈ సమావేశంలో రోడ్ల నిర్మాణానికి అవసరమైన అటవీ భూమి, ఫారెస్టేతర స్థలాల భూసేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని శ్రీధర్ బాబు ఆదేశించారు. సెప్టెంబర్ మొదటి వారంలో ఈ పనులకు శంకుస్థాపన జరిగే విధంగా యుద్ధ ప్రాతిపదికన నిర్దేశించిన పనులన్నీ పూర్తి చేయాలని చెప్పారు. అటవీ శాఖకు చెందిన 19 ఎకరాల భూమి అప్పగింతకు సంబంధించి మొదటి దశ ఫార్మాలిటీలన్నీ గడువులోగా అయ్యేలా చూడాలని ఆదేశించారు. స్థానికులకు చెందిన భూముల సేకరణ, నష్టపరిహారం చెల్లింపులో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని ఆయన అధికారులకు సూచించారు. భూసేకరణకు పరిహారంగా ఇచ్చే నిధులను సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

# కబ్జాలు చేసిన వారే హైడ్రాపై విమర్శలు

వెలుగులోకి ఎన్నో బతుకమ్మ కుంటలు

సెప్టెంబర్ 21న బతుకమ్మకుంటను ప్రారంభించనున్న సిఎం

హైడ్రా అంటే డిమాలీషన్, డెవలప్‌మెంట్

హైడ్రా కమిషనర్ ఎవి. రంగనాథ్ కీలక వ్యాఖ్యలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భావితరాలకు భవిష్యత్‌ని ఇవ్వడం కోసం హైడ్రా పని చేస్తోందని హైడ్రా కమిషనర్ ఎవి. రంగనాథ్ అన్నారు. చెరువులను కాపాడాలనే ఉద్దేశ్యంతో మొదట్లో తాము చాలా దూకుడుగా వెళ్లడంతో చెరువుల ఆక్రమణలు తగ్గాయని తెలిపారు. హైడ్రా ఏర్పాటు చేసి శుక్రవారంతో ఏడాది పూర్తి అయింది. ఈ సందర్భంగా అంబర్‌పేట్ బతుకమ్మకుంట వద్ద హైడ్రా ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన, మాజీ ఎంపి వి.హనుమంతురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగనాథ్ మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో సామాజిక కోణంలో చూసి పేదల ఇళ్లు కూల్చడంలేదన్నారు. కబ్జాలు చేసిన వారే హైడ్రాపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. సెప్టెంబర్ 21వ తేదీన బతుకమ్మ కుంటను సిఎం రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని వెల్లడించారు. హైడ్రా అంటే డిమాలీషన్, డెవలప్‌మెంట్ అని అభివర్ణించారు. ఇప్పుడు వెలుగులోకి వచ్చిన బతుకమ్మకుంట శాంపిల్ మాత్రమేనని, త్వరలో ఎన్నో బతుకమ్మకుంటలు వెలుగులోకి వస్తాయని రంగనాథ్ చెప్పారు.
**ఏడాదిలో హైడ్రా చర్యల ఫలితాలు..** హైడ్రా ఏర్పాటు అయి నేటికి ఏడాది పూర్తి అయింది. గత సంవత్సరం జులై 19వ తేదీన హైడ్రాను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిహెచ్ఎంసితో పాటు ఒఆర్ఆర్ లోపలి వరకు 2050 కిలోమీటర్ల మేర హైడ్రా పరిధిలో ఉంటుంది. చెరువులు, నాలాలు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు, ఫుట్ పాత్‌లు, రహదారుల అక్రమణలపై హైడ్రా చర్యలు చేపడుతుంది. ఏడాది కాలంలో 600 చోట్ల ఆక్రమణలను తొలగించి 500 ఎకరాల భూమిని హైడ్రా కాపాడింది. ఏడాది కాలంలో కబ్జాల చెర నుంచి దాదాపు 500 ఎకరాలకు విముక్తి కల్పించింది. 360 ప్రాంతాల్లో చెరువుల ఆక్రమణలు తొలగించి 133 ఎకరాలు భూమిని కాపాడింది. ప్రభుత్వ, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కబ్జాల చెర నుంచి హైడ్రా విముక్తి కల్పించింది. 86 చోట్ల ఆక్రమణలను తొలగించి 123 ఎకరాలను కాపాడింది. 20 చోట్ల నాలాల ఆక్రమణలను తొలగించడంతో 8 ఎకరాల స్థలాలకి మోక్షం లభించింది. 74 చోట్ల రహదారి ఆక్రమణలను తొలగించి, దాదాపు 220 ఎకరాల మేర రహదారి ఆక్రమణలను కాపాడింది. చెరువుల ఆక్రమణలు తొలగించిన చోట చెరువులకు పూర్వవైభవం తెస్తోంది. మొదటి విడతలో ఆరు చెరువులను సుందరీకరణ చేస్తోంది. అంబర్‌పేట బతుకమ్మ కుంట, కూకట్‌పల్లి నల్ల చెరువు, మాదాపూర్ సున్నం చెరువు, తమ్మిడికుంట చెరువు, ఉప్పల్ పెద్ద చెరువు, పాతబస్తీలోని బమ్రాక్ నుద్దౌలా చెరువులను హైడ్రా సుందరీకరణ చేస్తోంది.




## అక్కసుతోనే బిఆర్‌ఎస్ విమర్శలు

టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి

**ప్రజాపక్షం / హైదరాబాద్:** పదేళ్ల బిఆర్‌ఎస్ ప్రభుత్వ హాయాంలో అప్పటి సిఎం కెసిఆర్ సచివాలయంరాలేదని, ప్రజల మధ్య తిరగలేదని, చివరకు ఢిల్లీకి వెళ్ళి కేంద్ర మంత్రులను కలిసిందీ లేదని, ఇప్పుడు సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి వెళ్ళి రాష్ట్రానికి కావాల్సిన అనుమతులు, నిధులను సమకూర్చుతుంటే బిఆర్‌ఎస్ నేతలు అక్కసుతోనే విమర్శలు చేస్తున్నారని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జయప్రకాష్‌రెడ్డి (జగ్గారెడ్డి) అన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రే రెండు తెలుగు రాష్ట్రాల సిఎంలను పిలిచారని, ఆ సమావేశం నివేదిక కేంద్ర ప్రభుత్వానికే వస్తుందని, సమావేశం వివరాలు బయటపెట్టాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కోరడం హాస్యాస్పదమన్నారు. బండి సంజయ్, కెటిఆర్ అకస్మాత్తుగా నాయకులు, మంత్రులు అయ్యారని, వారికి తోక తెలవదు, తొండం తెలియదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌పై ప్రజలు పెట్టిన బరువు, బాధ్యతలను నెరవేర్చే పనిలో ఉన్నామని, కెసిఆర్ కుటుంబం ఫామ్‌హౌస్‌లో పడుకున్నారని, కాంగ్రెస్ నాయకులను కూడా ఫామ్‌హౌస్‌లో ఉండాలంటారా అని ఆయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ముఖాముఖి చర్చకు రావాలంటే మాజీ సిఎం కెసిఆర్‌కు భయమని, అందుకే కెసిఆర్ అసెంబ్లీకి కూడా రావడంలేదని అన్నారు. కాంగ్రెస్ తొక్కాలనుకుంటే బిఆర్‌ఎస్ నాయకులను రాజకీయంగా తొక్కేస్తుందని, ఎవరిపైనా నిఘా పెట్టాల్సిన అవసరం ప్రభుత్వానికి లేదన్నారు. జైతెలంగాణ అని సిఎం రేవంత్‌రెడ్డి ఎందుకు అనడంలేదని ప్రశ్నిస్తున్న కెటిఆర్, హరీష్‌రావు అసలు వారి పార్టీ పేరులో ఉన్న 'తెలంగాణ' అనే పదం తొలగించి 'భారత' అనే పదం ఎందుకు పెట్టారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. రేవంత్‌రెడ్డి ఎపి సిఎం చంద్రబాబు శిష్యుడంటున్నారని, రేవంత్‌రెడ్డి కంటే ముందే టిడిపిలో మూడుసార్లు ఎంఎల్‌ఎ, మంత్రి, డిప్యూటీ స్పీకర్ అయ్యింది కెసిఆర్ కాదా అని నిలదీశారు.

# హెచ్‌సిఎ అక్రమాలపై ప్రభుత్వ నజర్

రూ.600 కోట్ల కుంభకోణం,

తెరపైకి కెటిఆర్, కవిత పేర్లు

ఇప్పటికే సిఐడి, ఇడిలో కేసులు నమోదు

త్వరలో అధికారులతో క్రీడల మంత్రి వాకాటి శ్రీహరి సమీక్ష




**ప్రజాపక్ష/హైదరాబాద్ :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) అక్రమాల పుట్టపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించింది. ఇటీవల హెచ్‌సిఎ అక్రమాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తుండడంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ట మసకబారుతుంది. ఈ నేపథ్యంలో హెచ్‌సిఎ వ్యవహారాలన్నింటిపై ప్రభుత్వం దృష్టి సారించింది. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)లో భారీగా అక్రమాలు, అవినీతి చోటుచేసుకోవడం.. బిసిసిసి ఇచ్చిన రూ.600 కోట్ల నిధులు గోల్‌మాల్ కావడగం.. ఇందులో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, ఎంఎల్‌సి కవితలపై ఆరోపణలు రావడం.. ఇటీవలే హెచ్‌సిఎపై సిఐడితో పాటు డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) వరుసగా కేసులు నమోదు కావడం ఇందుకు ప్రధాన కారణం. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌లో గత కొద్ది సంవత్సరాలుగా కోట్లాది రూపాయల నిధుల దుర్వినియోగం, అవినీతి, అక్రమ లావాదేవీలు, బోర్డు పదవుల కోసం రాజకీయ హస్తం వంటి తీవ్రమైన ఆరోపణలు వెల్లడి అయ్యాయి. ఈ అన్ని సమస్యలపై సంబంధిత అధికారులతో క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి త్వరలో సమీక్షా సమావేశం నిర్వహించి ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షించనున్నారు. ఆ తరువాత ప్రభుత్వం ఏ విధంగా చర్యలు తీసుకునే అవకాశం ఉందో ఒక నిర్ధారణకు వస్తారని తెలిసింది.
**ఆర్థిక దుర్వినియోగం..** క్రికెట్ బాల్స్, చెయిర్స్, జిమ్ ఎక్విప్మెంట్ వంటి కొనుగోళ్ల పేరుతో సబ్ కాంట్రాక్టుల ద్వారా నిధులను దారి మళ్లింపు. ఇందులో కొంత మొత్తం (90 లక్షలకు పైగా) హెచ్‌సిఎ మాజీ కోశాధికారి సురేందర్ అగర్వాల్ కుటుంబ సభ్యుల ఖాతాలకు బదిలీ చేయబడినట్లు విచారణలో బయటపడింది. దీనిలో భాగంగా 51.29 లక్షల ఆస్తులను ఇడి అటాచ్ చేసింది.
**మనీ లాండరింగ్..** హవాలా మార్గంలో నిధుల లావాదేవీలు జరిగాయని, పెద్ద మొత్తంలో మనీలాండరింగ్ ఆరోపణలున్నాయి. దీనిపై డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) విచారణ జరుపుతోంది. కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశముంది.
**నకిలీ పత్రాల తయారీ..** నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం ద్వారా నియామకాలకు మోసదారి మార్గాలు ఆసరాగా వాడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫోర్జరీ సంతకాలతోనే హెచ్‌సిఎ అధ్యక్ష పదవిని జగన్‌మోహన్‌రావు దక్కించుకున్నాడనే ఆరోపణలు కూడా ఉన్నాయి.
**ఐపిఎల్ టికెట్ల దందా..** ఐపిఎల్ టికెట్ల అక్రమ విక్రయం, అదనంగా టికెట్లు పొందేందుకు సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యంపై హెచ్‌సిఎ అధికారుల ఒత్తిడులు, పైపై మేనేజ్‌మెంట్ వద్ద నుంచి ఎక్కువ టికెట్లు తీసుకునేందుకు యత్నం. బినామి కంపెనీల ద్వారా టికెట్ల విక్రయంలో కెటిఆర్‌పై ఆరోపణలు రావడం.
**ఆడగాళ్ల ఎంపికలో అవకతవకలు..** జట్టులోకి ఎంపిక కావాలంటే డబ్బులు ఇవ్వాల్సిందేనని ఆరోపణలు వచ్చాయి. ప్రామాణికతను తునాతునకలు చేసినట్లు ఇతర విచారణల్లో వెల్లడైంది. జట్టులోకి అభ్యర్థులను ఎంపిక చేసేందుకు వారి తల్లిదండ్రుల నుంచి పెద్ద మొత్తంలో లంచాలు తీసుకున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.
**అరెస్టులు..దర్యాప్తు..** హెచ్‌సిఎ ప్రెసిడెంట్ జగన్మోహన్‌రావుతో పాటు నేతలు శ్రీనివాసరావు, రాజేంద్ర యాదవ్, సునీల్‌కాంటే, జి.కవితపై ఈడీ కేసులు నమోదయ్యాయి. ప్రధాన అధికారులు, క్లబ్ అధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు మొత్తం ఐదుగురు అరెస్ట్ అయ్యారు. నిందితులను సిఐడి కస్టడీకి తీసుకొని విచారణ జరుపుతోంది.




## రూ.6వేల కోట్ల ఫీజు చెల్లింపుపై నిర్లక్ష్యం వద్దు

గ్రామీణ విద్యార్థుల విద్యకు అప్పు అయినా తెండి?

తెలుగు సంక్షేమ భవన్ ముట్టడిలో ఎంపి ఆర్.కృష్ణయ్య

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** రాష్ట్రంలోని 14 లక్షల మంది కాలేజీ విద్యార్థుల స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు రూ.6,000 కోట్లు తక్షణమే చెల్లించాలని, 100 బిసి కాలేజీ హాస్టళ్లు మంజూరు చేయాలని, బిసి గురుకులాల్లో 20శాతం సీట్లు పెంచాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేశ్, జిల్లపల్లి అంజి ఆధ్వర్యంలో హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్ లోని తెలుగు సంక్షేమ భవన్‌ను వేలాది మంది విద్యార్థులు ముట్టడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ విద్య రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి విద్యార్థులకు అందే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొచ్చి 20 నెలలు గడుస్తున్నా ఒక పైసా కూడా విదల్చకపోవడం బాధాకరమన్నారు. అనేక సంక్షేమ పథకాలకు లక్షల కోట్ల అప్పు తెస్తున్న ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఈ పథకానికి రూ.6000 కోట్లు అప్పు తెస్తే ఎవరు అడ్డుకుంటారని ప్రశ్నించారు. కేంద్రప్రభుత్వం కూడా ఎస్‌సి, ఎస్‌టిలకు ఫీజురీయింబర్స్‌మెంట్ స్కీంకు వేల కోట్లు కేటాయిస్తుందని, ఈ డబ్బులన్నీ ఏం చేస్తున్నారని నిలదీశారు. ఈ స్కీం ద్వారా గ్రామాల్లోని కూలీల పిల్లలు ఉన్నత విద్య అభ్యసిస్తున్నారని, ఫలితంగా సమాజంలో గుణాత్మక మార్పును ఆహ్వానించేది పోయి అడ్డుకొంటారా? అని ప్రశ్నించారు. ఫీజు చెల్లించాలని కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని, దీంతో కొంతమంది సర్టిఫికెట్లు తెచ్చుకోలేక ఉద్యోగాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.
ఈ ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని మార్చి 'ట్రస్ట్ బ్యాంకు' ప్రతిపాదన తెచ్చిందని, దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు పగిళ్ల సతీశ్, మోదీ రాందేవ్, జి.అనంతయ్య, విద్యార్థి నాయకులు రాజేంద్ర భూపేశ్, చంద్ర గౌడ్, స్వామి గౌడ్, భాస్కర్, నిఖిల్, నరేశ్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## విదేశీ ఉగ్ర సంస్థగా 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్'

ప్రకటించిన అమెరికా – స్వాగతించిన భారత్

జమ్ము కశ్మీర్‌లో పహల్గామ్ ఉగ్రదాడికి బాధ్యత వహించిన టిఆర్‌ఎఫ్




**వాషింగ్టన్/న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కర్–ఎ–తైబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' (టిఆర్‌ఎఫ్)ను 'విదేశీ ఉగ్రవాద సంస్థ'గా అమెరికా ప్రకటించింది. ఇది 'సకాలంలో ముఖ్యమైన' చర్య అని, ఇది రెండు దేశాల మధ్య బలమైన ఉగ్రవాద వ్యతిరేక సహకారాన్ని ప్రతిబింబిస్తుందని భారత దేశం స్వాగతించింది. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో మాట్లాడుతూ, వాషింగ్టన్ ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి, పహల్గామ్ దాడికి న్యాయం చేయాలన్న అధ్యక్షుడు ట్రంప్ పిలుపును అమలు చేయడానికి కట్టుబడి ఉందని ఈ నిర్ణయాన్ని ప్రకటించిన సందర్భంగా తెలిపారు.అమెరికా విదేశాంగ శాఖ టిఆర్‌ఎఫ్‌ను ప్రకటిత విదేశీ ఉగ్రవాద సంస్థ (ఎఫ్‌టిఒ), ప్రత్యేకంగా ప్రకటించిన గ్లోబల్ టెర్రరిస్ట్ (ఎస్‌డిజిటి) జాబితాలో చేర్చుతోందని రూబియో చెప్పారు. పహల్గామ్ దాడికి లష్కర్–ఎ–తైబా (ఎల్‌ఇటి) అనుబంధ సంస్థ టిఆర్‌ఎఫ్ బాధ్యత వహించింది. ఈ దాడిలో 26 మంది పౌరులు మరణించారు. ఇది '2008 ముంబై దాడి (ఎల్‌ఇటి పాల్పడింది) తర్వాత భారతదేశంలో పౌరులపై జరిగిన అత్యంత ఘోరమైన దాడి' అని ఆయన అన్నారు. 2024లో జరిగిన దాడితో సహా భారత భద్రతా దళాలపై అనేక దాడులకు టిఆర్‌ఎఫ్ వహించిందని అని రూబియో చెప్పారు. 'విదేశాంగ శాఖ తీసుకున్న ఈ చర్యలు ట్రంప్ పరిపాలన మన(అమెరికా) జాతీయ భద్రతా ప్రయోజనాలను పరిరక్షించడానికి, ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడానికి, పహల్గామ్ దాడికి న్యాయం చేయాలన్న అధ్యక్షుడు ట్రంప్ పిలుపును అమలు చేయడానికి కట్టుబడి ఉందని రుజువు చేస్తుంది' అని ఆయన పేర్కొన్నారు.
స్వాగతించిన భారత్ : అమెరికా నిర్ణయాన్ని భారతదేశం స్వాగతించింది. దీనిని భారత్–అమెరికా ఉగ్రవాద వ్యతిరేక సహకారానికి 'బలమైన ధృవీకరణ'గా , విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అభివర్ణించారు. టిఆర్‌ఎఫ్‌ను నియమించడం 'సకాలంలో ముఖ్యమైన' చర్య అని, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటంలో ప్రపంచ సహకారం ఆవశ్యకతను నిరంతరం నొక్కి చెబుతున్నామని భారత్ తెలిపింది. ఉగ్రవాదం పట్ల 'జీరో టాలరెన్స్ (ఏమాత్రం సహించలేని) విధానం' పట్ల భారత్ కట్టుబడి ఉందని, ఉగ్రవాద సంస్థలు, వాటి అనుబంధ సంస్థలు జవాబుదారీగా ఉండేలా చూడటానికి తన అంతర్జాతీయ భాగస్వాములతో కలిసి పని చేయడం కొనసాగిస్తుందని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.'టిఆర్‌ఎఫ్'ను విదేశీ ఉగ్రవాద సంస్థ (ఎఫ్‌టిఒ), ప్రత్యేకంగా ప్రకటించిన గ్లోబల్ టెర్రరిస్ట్ (ఎస్‌డిజిటి)గా ప్రకటిస్తూ అమెరికా విదేశాంగ విభాగం తీసుకున్న నిర్ణయాన్ని భారత ప్రభుత్వం స్వాగతిస్తుంది.

## ఇష్టం వచ్చినట్టు బూతులు.. మాట్లాడితే తస్మాత్ జాగ్రత్త

టిపిసిసి జనరల్ సెక్రటరీ గజ్జెల కాంతం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ గురించి ఇష్టం వచ్చినట్లు బూతులు మాట్లాడుతే తస్మాత్ జాగ్రత్త..అని బిఆర్‌ఎస్ నేతలను టిపిసిసి జనరల్ సెక్రటరీ గజ్జెల కాంతం హెచ్చరించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కెసిఆర్ కుటుంబం తెలంగాణ సొమ్ము అంతా దోచుకుంది, ప్రజల సొమ్ముతో అమెరికాలో ఇండ్లు కొన్నారు అని తెలిపారు. సిఎం రేవంత్‌రెడ్డి నీతి నిజాయితీగా రాష్ట్ర ప్రజల కోసం 18 గంటలు పని చేస్తున్న ఏకైక సిఎం అని కొనియాడారు. చంద్రబాబుకు నీళ్ళు.... రాహుల్ గాంధీకి మూటలు...అని బిఆర్‌ఎస్ నేతలు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. కేంద్ర జలశక్తి మంత్రితో సిఎంల సమావేశం జరిగింది...ఆ విషయాన్ని స్పష్టంగా సిఎం రేవంత్ రెడ్డి క్లియర్ గా చెప్పిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సోనియా కుటుంబం అంటేనే నీతి నిజాయితీకి మారుపేరన్నారు. ఈ దేశ ప్రజల కోసం పనిచేసిన నెహ్రూ కుటుంబం ఆస్తి అంతా పేద ప్రజలకు ఖర్చు చేసిందన్నారు. సోనియమ్మ, రాహుల్ గాంధీకి స్వంతంగా ఇల్లు లేదు.. ఎంపి క్వార్టర్స్ లోనే ఉంటున్నారు అని గుర్తు చేశారు. దేశం కోసమే గాంధీ కుటుంబం పనిచేస్తుంది, దేశం కోసం రాజీవ్ గాంధీ ప్రాణాలు అర్పించారన్నారు. అంతటి నిజాయితీతో ఉన్న కాంగ్రెస్ పార్టీని, నేతలపై ఇష్టం వచ్చినట్టు బూతులు మాట్లాడుతే తస్మాత్ జాగ్రత్త అని మరోసారి హెచ్చరించారు. గోదావరి, కృష్ణ నీళ్ళ విషయంలో నాడు జగన్ తో ఇంట్లో కలిసి మెలిసి తినలేదా..అని ప్రశ్నించారు. రోజా ఇంట్లో భోజనం చేసి రాయల సీమను రతనాల సీమగా చేస్తానని చెప్పలేదా ? అని కెటిఆర్‌ను ఉద్దేశించి అన్నారు. మూడు వేల టిఎంసిల మిగులు జలాలున్నాయనీ కెసిఆర్ జగన్ తో చెప్పలేదా !??? అని గుర్తు చేశారు.కెటిఆర్ పెద్ద సంసారిలాగా ఇప్పుడు మాట్లాడుతున్నారన్నారు. రెండు రాష్ట్రాల సిఎంలు,సిఎస్ అధికారులందరి సమక్షంలో బహిరంగంగా చర్చ జరిగిందని తెలిపారు.బిసిలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తుంటే అరవడం ఎందుకు..గతంలో మీరు బిసిలకు ఏమీ చేశారు అని ప్రశ్నించారు.మేడిగడ్డ చర్చకు మా కరీంనగర్ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, రైతులు, అధికారులు వస్తారు. నీ స్థాయికి సిఎం రేవంత్ రెడ్డి ఎందుకు వస్తాడు....? అని కెటిఆర్‌ను ఉద్దేశించి అన్నారు. మీ అయ్య కెసిఆర్ ను అసెంబ్లీకి రమ్మను అక్కడ చర్చ చేస్తాడు.. మా సీఎం.... అని అన్నారు. ఫోన్ ట్యాపింగ్, ఈ కార్ రేస్ , కాళేశ్వరం కమీషన్ దోపిడీ ఇవన్నీ విచారణలు కొనసాగుతున్నాయి. వీటిలో కచ్చితంగా మీరు దోషులుగా తేలుతారన్నారు.

## భారీ వర్షానికి విరిగిన చెట్లు



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపల్ పరిధిలోని గండి మైసమ్మ బిఆర్ఎస్ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం కురిసిన అతి భారీ వర్షానికి రోడ్డు పక్కన ఉన్న చెట్లు పడిపోయాయి. వాహనాదారులకు ఇబ్బంది కలగడంతో పూర్తిస్థాయిలో ట్రాఫిక్ జాం ఏర్పడింది. అధికారం చొరవ తీసుకొని ప్రమాదాలు పులనావృతం కాకుండా చూడాలని వాహనదారులు స్థానికులు వాపోయారు.

## ఎస్ఆర్ నగర్ ప్రాంగణంలో ఘనంగా బోనాల ఉత్సవాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలి ఓ అండ్ ఎం డివిజన్6 ఎస్ ఆర్ నగర్ కార్యాలయంలోని ఆలయంలో బోనాలు ఘనంగా నిర్వహించారు. డివిజన్ ప్రాంగణంలోని దుర్గాదేవి ఆలయంలో ఉత్సవ ఊరేగింపు, బోనాల సమర్పణ తదితర కార్యక్రమాలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఈడి మయాంక్ మిట్టల్, డైరెక్టర్ లు, అధికారులు, ఉద్యోగులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలమండలి సిజిఎం ప్రభు, జిఎం ప్రభాకర్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో డైరెక్టర్లు ప్రవీణ్ కుమార్, సుదర్శన్, శ్రీధర్, అమరేందర్ రెడ్డిలతో పాటు సిజిఎంలు, జిఎంలు, రిటైర్డ్ అయిన డైరెక్టర్లు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్ రహదార్లు గుంతలమయం.. ప్రమాదాలకు నిలయం

**ప్రజాపక్షం/జవహర్‌నగర్:** గురువారం రాత్రి నుండి ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో జవహర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదార్లతో సహా పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి పోయాయి. పలు ప్రాంతాల్లో రహదార్లలో గుంతలు ఏర్పడి ప్రమాదాలకు దారి తీస్తున్నాయి. ఎక్కడ గుంతలు ఉన్నాయన్న విషయం తెలియక వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. అంబేడ్కర్‌నగర్ సమీపంలోని నోబుల్ స్కూల్ నుండి గబ్బిలాలపేటకు వెళ్లే ప్రధాన రహదారి భారీ వర్షాల కారణంగా సిసి రోడ్డు కుంగిపోయి పలు చోట్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం వందలాది వాహనాలు తిరిగే దమ్మాయిగూడ నుండి అంబేడ్కర్‌నగర్ మీదుగా జవహర్‌నగర్ వరకు ఉన్న ప్రధాన రహదారి జలమయం అవటంతో నానా అవస్థలకు గురవుతున్నారు. కెఎన్ఆర్ కాలనీ రోడ్డు సైతం ఇదే పరిస్థితి నెలకొంది. దీనికి తోడు రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా తరచు నిలిచి పోతుండటంతో ఇబ్బందులు అధికంగా ఉంటున్నాయని పలువురు వాపోతున్నారు.



## భారీ వర్షాలు...ప్రజలకు అవస్థలు

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజ్‌గిరి:** మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి నుండి నిరవధికంగా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రధాన రహదార్లన్నీ జలమయ్యాయి. కూకట్‌పల్లి, ప్రగతినగర్, మూసాపేట, బోయినపల్లి, మల్కాజిగిరి, ఉప్పల్, నాచారం, ఆల్వాల్, కీసర, రాంపల్లి, శామీర్‌పేట, మేడ్చల్, మల్లాపూర్, ఈసీఐఎల్, ఏఎస్ రావునగర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. పలు ప్రధాన రహదార్లతో పాటు చిన్న చిన్న గల్లీల్లో సైతం గంటల కొద్దీ నీరు నిలిచి ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు రహదార్లు గుంతలు ఏర్పడి నీరు ఎక్కడ పడితే అక్కడ నిలిచి పోయింది. ఎక్కడ గుంతలు ఉన్నాయో తెలియక వాహనదారులు ఎలా వెళితే ఏ ప్రమాదానికి గురవ్వాల్సి వస్తుందోనన్న భయంతో కొట్టుమిట్టాడుతున్నారు. ఉప్పల్‌లో రోడ్డు పైకి భారీగా వరద నీరు చేరటంతో వాహనాల రాకపోకలు తీవ్ర అంతరాయం ఏర్పాడింది. నాచారం భవానినగర్‌లో మోకాలి లోతు వరకు వరద నీరు ప్రవహిస్తోంది. భవానినగర్ నాలా వద్ద భారీ వర్షం నీరు పారుతుండటంతో ప్రయాణీకులను తీసుకొని వెళుతున్న ఓ ఆటో కొట్టుకొని పోతుండటాన్ని చూసిన ప్రజలు ఆటోలో ఉన్న వారిని కాపాడారు. పలు చోట్ల వర్షపు నీరు చెరువులను తలపిస్తున్నాయి. నాలాల నుండి మురుగు నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. శుక్రవారం ఉదయం సాయంత్రం పాఠశాలలు, కార్యాలయాలకు వెళ్లి వచ్చేందుకు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.





## ఈటల రాజేందర్‌కు బిజెపి శ్రేణుల విజ్ఞప్తి

**ప్రజాపక్షం/దుండిగల్:** బిజెపి సూరారం డివిజన్ అధ్యక్షుడు కేశవ్ యాదవ్ ఆధ్వర్యంలో సూరారం డివిజన్‌లోని సంజయ్ గాంధీ నగర్‌లో స్థానికులు బస్తివాసులతో కలిసి వివేకానంద కమ్యూనిటీ హాల్ నిధుల విడుదల కోసం బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్ రెడ్డి అధ్యక్షతన స్థానిక ఎంపి ఈటల రాజేందర్‌ను కలిసి ఎంపి లార్ప్స్ నుంచి నిధులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, భద్రప్ప, చారి తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు కోతలతో ప్రజల ఇబ్బందులు

**ప్రజాపక్షం/కొడంగల్:** సమయపాలనలేని కరెంటు కోతలతో కొడంగల్ ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని సిపిఐ నియోజకవర్గ నాయకులు గంటి సురేష్ అధికారుల తీరుపై మండిపడ్డారు. శుక్రవారం స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతినిత్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్షమో లేక ప్రభుత్వ ఆదేశాలతో కరెంటు కోతలు విధిస్తున్నారో అర్థం కావడంలేదని ఆరోపించారు. గత కొంత కాలంగా నియోజకవర్గ కేంద్రంలో అధికారులు సమయపాలన పాటించకుండ ఇష్టానుసారంగా ప్రతి రోజు దాదాపు 10 నుంచి 15 సార్లు కరెంటు తీయడం జరుగుతుందని అన్నారు. వారానికి ఒకరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు కరెంటు నిలిపివేయడంతో ప్రజలతో పాటు వ్యాపారస్థులు, ఉద్యోగులు, విద్యార్థులు ఇలా ప్రతి ఒక్కరు తీవ్ర ఇబ్బందులకు గురికాకతప్పడంలేదని వాపోయారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులను అడిగితే పొంతనలేని సమాధానాలు ఇస్తూ తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఒక పక్క వర్షాలు లేక రైతులు విలవిలలాడితే మరోపక్క కరెంటు కోతలు విధించడం సమంజసం కాదని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గ కేంద్రంలో ఇలాంటి కరెంటు కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎందుకు కాంగ్రెస్ నాయకులు మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదని ప్రజలు ఇబ్బందులు పడుతుంటే సమస్యలను పరిష్కరించడం వారి బాధ్యత కాదా అని ప్రశ్నించారు. ఇప్పటికైన విద్యుత్ శాఖ అధికారులు కరెంటు కోతలు లేకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. వీరితో పాటు సిపిఐ పార్టీ కార్యకర్తలున్నారు.



## మహిళా లబ్ధిదారులకు కుట్టుమిషన్ల పంపిణీ

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నిజాంపేట్ టిఎంఆర్ఇఎస్ జూనియర్ బాయ్స్ కళాశాల, హైదర్‌నగర్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టాపకంగా చేపడుతున్న ఇందిరా మహిళ శక్తి ద్వారా మైనారిటీ మహిళా అర్హులకు ఇంచార్జి మినిస్టర్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో (200) కుట్టుమిషిన్లను పంపిణీ చేసిన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రణాళికతో ఉందన్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# అతలాకుతలం చేసిన భారీ వర్షం





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్‌లో శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షం అతలాకుతలం చేసింది. మధ్యాహ్నం ఒక్కసారిగా కమ్ముకున్న మేఘాలతో అల్వాల్, బోయిన్ పల్లి మీదుగా వర్షం మొదలైంది. అలా సికింద్రాబాద్, అమీర్ పేట, పంజాగుట్ట, మాదాపూర్, మణికొండ ప్రాంతాలకు విస్తరించింది. ఇటు రాజేంద్రనగర్, అత్తాపూర్, గండిపేట్, నాచారంతో పాటు కోఠి, బేగం బజార్, నారాయణ గూడ, హిమాయత్ నగర్‌లో భారీ వర్షం కురిసింది. పాతబస్తీలోని బార్కస్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా, టోలిచౌకి, కార్వాన్‌ను భారీవర్షం ముంచెత్తింది. కుండపోతలాంటి వర్షంతో డ్రైనేజీలు భయంకరంగా పొంగి పొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తం గా ఉండాలని అధికారులు ప్రకటించారు. ఈదురుగాలులు, భారీ వర్షం కారణంగా పలుచోట్ల అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. రోడ్లపై వర్షపు నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అన్ని ప్రధాన రహదారులపై వాననీరు భారీగా చేరడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. చాలాచోట్ల ట్రాఫిక్ నిలిచిపోయి వాహనదారులు ఎటూ వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. యూసఫ్‌గూడ, శ్రీకృష్ణానగర్‌లో మ్యాన్ హోల్స్ పొంగి పొర్లాయి. హైటెక్ సిటీ ప్రాంతంలో ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. ఉప్పల్ వద్ద భారీవర్షంతో నీరంతా రోడ్లపైకి చేరింది. సికింద్రాబాద్ పాస్‌పోర్ట్ కార్యాలయం, ప్యాట్నీ, రెజిమెంటల్ బజార్ వద్ద రహదారిపై మోకాళ్ల లోతు నీరు ప్రవహించింది. ఇక్కడి సిక్ విలేజ్ రోడు పూర్తిగా నీట మునిగిపోయింది.

ముషీరాబాద్ బాపూజీనగర్‌లో నాలాపై నుంచి వరద ప్రవాహం పోటెత్తింది. రాంనగర్ బాప్టిస్ట్ చర్చి వద్ద రహదారిపై వరద నీరు చేరి రాకపోకలకు ఆటంకం కలిగింది. మాదాపూర్‌లో కురుస్తున్న భారీ వర్షానికి మాదాపూర్ కాకతీయ హిల్స్ జూబీహిల్స్ మార్గంలో ప్రధాన రోడ్డుపై చేరిన వరద నీరు చేరింది. సికింద్రాబాద్, బోయిన్ పల్లి, తిరుమలగిరి, ప్యారడైజ్, బాలానగర్, కోంపల్లి, సూరారం ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. కొద్దిపాటి సమయంలోనే భారీవర్షం పడటంతో డ్రైనేజీలు నిండిపోయి వాననీరు రోడ్లపైనే నిలిచి పోయింది. నాచారం భవానీనగర్‌లో మోకాళ్ల లోతులో నీరు జామ్ అవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కుత్బుల్లాపూర్ పరిసరాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం పడుతుండటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నాంపల్లిలో భారీగా కురిసిన వర్షం దాటికి ఫర్నిచర్ దుకాణాల్లోకి వరద నీరు చేరింది.

**కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు..**

ఈ ఏరియా.. ఆ ఏరియా అనే తేడా లేకుండా హైదరాబాద్ నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ తిప్పలతో వాహనదారులకు నరక యాతన అనుభవించారు. వరద ప్రవాహానికి వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సికింద్రాబాద్ వైపు ట్రాఫిక్ తిప్పలు పడ్డారు. జెబిఎస్, కార్ఖానా, తిరుమల గిరి, అల్వాల్ వైపు వెళ్లే వాళ్లు మాత్రం ట్రాఫిక్‌తో అల్లాడిపోయారు. దాదాపు రెండు కిలోమీటర్లకు పైగానే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మాదాపూర్, హైటెక్ సిటీ, ఇనార్బిట్ మాల్ మార్గంలో కూడా ట్రాఫిక్ జామ్ అయింది. మలక్ పేట్ యశోదా ఆసుపత్రి దగ్గర నుంచి కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. లక్డీకాపూల్ నుంచి మెహిదీ పట్నం మార్గంలో అయితే ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు చుక్కలు చూశారు. షేక్ పేట్, ఖాజాగూడ, రాయదుర్గం, గచ్చిబౌలిలో అవస్థలు పడ్డారు. కొండాపూర్, హఫీజ్ పేట్, మాదాపూర్, మియాపూర్, ఐటీ కారిడార్‌ల లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాయదుర్గం, షేక్ పేట్ మార్గంలో 3 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పద్మవ్యూహంలో ఐటీ కారిడార్ ఉంది. రాయదుర్గం, బయోడైవర్సిటీ, ఐకియా జంక్షన్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. గచ్చిబౌలి పిజెఆర్ ఫ్లైఓవర్‌పై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఏఎంబి మాల్ ముందు వర్షపు నీరు భారీగా నిలిచిపోయింది. హఫీజ్ పేట్, ఆల్విన్ కాలనీ, చందానగర్ మార్గంలో స్తంభించిపోయింది. హైటెక్ సిటీ, కెపిహెచ్‌బి మార్గంలో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ఐటీ కారిడార్ రోడ్లు చెరువులను తలపించాయి.

**నీట మునిగిన ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ పర్యటన**

నగరవ్యాప్తంగా కురిసిన భారీ వర్షానికి అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో నడుంలోతు వరద ఇళ్లను ముంచెత్తింది. ప్యాట్నీ నాలా పరిధిలో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. నీట మునిగిన ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించి, సహాయక చర్యలను పర్యవేక్షించారు. హైడ్రా, డిఆర్ఎఫ్ సిబ్బందితో పాటు, వర్షాకాల అత్యవసర బృందాలు రంగంలో దిగి సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి. మాసాబ్ ట్యాంక్, హైటెక్ సిటీ, అయ్యప్ప సొసైటీ, గాజులరామారం, కూకట్‌పల్లి, హఫీజ్‌పేట్ వంటి ప్రాంతాల్లో భారీగా నీరు నిలిచినట్లు హైడ్రా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందింది.

**కాలనీలను ముంచెత్తిన ప్యాట్నీ నాలా..**

ప్రతి ఏటా వర్షాకాలం తమ కాలనీలు నీట మునుగుతున్నాయని ఫిర్యాదుల నేపథ్యంలో ప్యాట్నీ నాలా విస్తరణకు హైడ్రా చర్యలు తీసుకుంది. అయితే ఓ ఇంటి యజమాని పనులను అడ్డుకోవడంతో ఆగిపోయాయి. దీంతో గతంలో మాదిరే సమస్య తలెత్తిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇళ్లలో చిక్కున్న వారిని డిఆర్ఎఫ్ సిబ్బంది బోట్ల సాయంతో సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌గారు ప్యాట్నీ నాలా పరిసర ప్రాంతాల్లో బోటులో పర్యటించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే పనులను పర్యవేక్షించారు.

**బతుకమ్మ కుంటలోకి వరద నీరు..**

అంబర్‌పేటలో బతుకమ్మ కుంటకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గతంలో వరద నీటితో లోతట్టు ప్రాంతాలు నీట మునిగేవని, ప్రస్తుతం చెరువు ఆ వరదను ఆపుతోందని స్థానికులు చెబుతున్నారు. భారీ మొత్తంలో వరద నీరు బతుకమ్మ కుంటకు చేరుతోందంటున్నారు.

## నియోపోలిస్, కోకాపేట్‌లో జంక్షన్ అభివృద్ధి





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కోకపేట్ నియోపోలీస్ జంక్షన్‌ను సుందరంగా తీర్చిదిద్దనున్నారు. హెచ్ఎండిఏ, సత్వా గ్రూప్‌కి చెందిన ఎడెన్ బిల్డ్‌న్ లిమిటెడ్ సంయుక్తంగా అభివృద్ధి చేయనున్నారు. నియోపోలిస్ ఎస్ఇజెడ్ మెయిన్ వద్ద రోటరీ, నియోపోలిస్, మొకిలా రోడ్డులోని రెండు త్రికోణ కూడలులను సుందరంగా నిర్మించనున్నారు. కార్పొరేట్ సామాజిక(సిఎస్ఆర్)లో భాగంగా చేపడుతున్నారు. ఈ కూడలులు మొదటగా హెచ్ఎండిఏ ద్వారా సిఎస్ఆర్ మేసనరీ నిర్మాణాలతో అభివృద్ధి చేసిన, అర్బన్ ఫారెస్ట్రీ విభాగం ద్వారా ఆధునికరించారు. ఇప్పుడు వీటిని సత్వా గ్రూప్ మరింత అభివృద్ధి చేయనుంది. స్థానిక వారసత్వాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక శిల్పాలు, సౌందర్యాత్మక అంశాలు ఉంటాయి. సత్వా గ్రూప్ ఈ కూడలుల అభివృద్ధి, నిర్వహణను ఐదు సంవత్సరాల పాటు పూర్తిగా సిఎస్ఆర్ ద్వారా చేపడుతుంది. ఈ నిర్వ హణపై హెచ్ఎండిఏకి ఎలాంటి ఆర్థిక భారం ఉండదు. ఇది ప్రజా ప్రైవేట్ భాగస్వామ్యానికి ఒక ఆదర్శంగా నిలుస్తుంది. నియోపోలిస్ ప్రాంతం రియల్ ఎస్టేట్ కార్యకలాపాల కేంద్రంగా మారింది. అందులో అనేక పేరు గాంచిన డెవలపర్లు అత్యాధునిక హైరైజ్ భవనాలు, వాణిజ్య భవనాలు నిర్మిస్తున్నారు. ఈ వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతంలోని కీలక కూడలుల అభివృద్ధి ద్వారా మెరుగైన సౌకర్యం కల్పించాలని నిర్ణయించారు.



## విద్యార్థులకు మంత్రి అడ్లూరి చెక్కుల పంపిణీ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ప్రజల భాగస్వామ్యంతో విద్యను అందరికీ అందించాలనే దిశగా చేసే సేవా కార్యక్రమాలు ప్రభుత్వ లక్ష్యాలను ముందుకు తీసుకెళ్తాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ముత్తూట్ సిఎస్ఆర్ ఫౌండేషన్ సహకారం,సావిత్రి బాయి పూలే సంఘం చొరవతో లయన్ డాక్టర్ బి.విజయ రంగ, మాధవి బెల్లం ఆధ్వర్యంలో, వివిధ ప్రభుత్వ మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్ కాలేజీల్లో చదువుతున్న 21 మంది విద్యార్థులకు విద్యా ఫీజు చెక్కులను శుక్రవారం మంత్రి హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్‌లోని నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద విద్యార్థుల చదువు నిమిత్తం లయన్స్ క్లబ్, ముత్తూట్ ఫౌండేషన్ సహాయ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. విశేష అతిథి ఎంఎల్‌సి బొగ్గారాపు దయానంద్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం విద్యా సమానత్వానికి, సామాజిక అభివృద్ధికి చక్కటి నిదర్శమని కొనియాడారు. చెక్కులు అందుకొన్న వారిలో 10 మంది (ఎంబిబిఎస్),10 మంది (ఇంజినీరింగ్), ఒకరు నర్సింగ్ విద్యార్థులు ఉన్నా రు.

## సంక్షేమ పథకాల పట్ల సరైన అవగాహన కల్పించాలి

### జిల్లా అభివృద్ధి, పర్యవేక్షణ కమిటీ(దిశా) సమీక్షలో చైర్మన్ హోదాలో ఎంపి ఈటల




**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజ్‌గిరి:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాల పట్ల ప్రజల్లో సరైన అవగాహన లేక పోతున్న కారణంగా పూర్తిస్థాయిలో వినియోగించుకోలేక పోతున్నారని మల్కాజిగిరి ఎంపి, జిల్లా అభివృద్ధి సమన్వయం, పర్యవేక్షణ కమిటీ (దిశా) చైర్మన్ ఈటల రాజేందర్ ఆవేదన వ్యక్తం చేసారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి కార్యక్రమాల పురోగతి అంచనా వేసే లక్ష్యంగా నిర్ణీత వ్యవధిలో జరిగే దిశా కమిటి సమావేశంలో జిల్లా ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశానికి ఆయన దిశా చైర్మన్ హోదాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు మాసాలకు ఒక సారి క్రమం తప్పకుండా జరుగుతున్న డిఆర్‌సి సమావేశం తప్ప పథకాలను సమర్థవంతంగా అమలు చేసే దిశగా సమవేశాలు జరుగక పోవటం లేదని, ఇకపై క్రమం తప్పకుండా ఇలాంటి సమీక్షా సమావేశాలు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని నొక్కి చెప్పారు. సంక్షేమ పథకాలు రాష్ట్ర కేంద్రాలకు చెందినవా అన్న విషయం ముఖ్యం కాదని, పేదరికంతో ఉండి ఆయా పథకాలకు అర్హులైన వారందరికి ప్రయోజనం కలిగేలా చూడాలని, మేడ్చల్ జిల్లా 90 శాతం పట్టణ ప్రాంతాలైనందున ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయాల్సిన అవసరం ఉందని, రానున్న కాలంలో పేదల అభ్యున్నతి కోసం మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు రానున్నాయని తెలిపారు. జిల్లాలో కనీసం 100 రోజుల వేతనాన్ని అందించటానికి జీవనోపాధి పథకాన్ని అమలు చేస్తున్నామని, జాబ్ కార్డుల కోసం 19387 కుటుంబాలు జాబ్ కార్డుల కోసం నమోదు చేసుకోగా 18104 జాబ్‌కార్డులు ఇచ్చామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వివరించగా జిల్లాలో తక్కువగా జాబ్ కార్డులు ఎందుకు ఉన్నాయని ఈటల ప్రశ్నించారు. మేడ్చల్‌లోని ఎస్‌హెచ్‌జిలకు అధిక ప్రయోజన పొందేలా పిఎం ఎఫ్ఎంఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసే దిశగా క్రమం తప్పకుండా బ్యాంకర్ల సమావేశం నిర్వ హించాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి సూచించారు.

కొండాపూర్‌లో నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్, భువనగిరి జిల్లాలో స్వామి రామానందతీర్థ రూరల్ ఇనిస్టిట్యూట్‌లైన కేంద్ర ప్రభుత్వ సంస్థలు నైపుణ్యాభివృద్ధ శిక్షణలు అందిస్తున్నాయని, నిరుద్యోగ గ్రామీణ యువతకు ప్లేస్‌మెంట్లు కల్పిస్తోందని ఆయన చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు ఎన్ని జాబ్ మేళాలు నిర్వహించారో తెలపాలని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద ప్రశ్నించగా ఎంపిడిఓల సమన్వయంతో 5 గ్రామీణ మండలాల్లో జాబ్ మేళాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ మనుచౌదరి బదులిచ్చారు. తన నియోజకవర్గంలోని ఆల్వాల్, మల్కాజిగిరి మున్సిపాలిటీలలో ఆసరా పెన్షన్లు పొందలేక పోతున్న విషయాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి చెబుతూ జిహెచ్ఎంసి డిప్యూటి, జోనల్ కమిషనర్లు సైతం దిశా సమావేశానికి హాజరు కావాలని సూచించారు.

అంగన్‌వాడి కేంద్రాలు మౌలిక సదుపాయాల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయని సరైన నిర్వహణ లోపించిందన్న విషయాన్ని మల్కాజిగిరి ఎమ్మెల్యే చెప్పగా పిల్లల ఆరోగ్యం కోసం పౌష్టికాహారం మెనూను విధిగా అమలు చేయాలని, సమస్యలను పరిష్కరించాలని ఈటెల సూచించారు. ఉప్పల్ బస్తీ దవఖానాల్లో వైద్యులెవరూ అందుబాటులో ఉండటం లేదంటూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చెప్పగా జిల్లాలో ఎన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు సొంత భవనాలు పూర్తయ్యాయి, ప్రారంభించనివి ఎన్ని ఉన్నాయి, అద్దె ప్రాతిపదికన ఎన్ని ఆస్పత్రులు, కళాశాలలు కొనసాగుతున్నాయి, ఔషధాల లభ్యత తదితర విషయాలన్నింటిని సమగ్రంగా తెలియచేయాలని ఎంపి ఈటెల కలెక్టర్‌ను కోరారు.జిల్లాలో జవహర్ నవోదక విద్యాలయ ఏర్పాటు చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే కోరారు.

## వన మహోత్సవానికి అధికారులు కసరత్తు

శాఖల వారీగా మొక్కలు కేటాయింపులు

**ప్రజాపక్షం/వికారాబాద్:** వనమహోత్సవానికి అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. ప్రతి సంవత్సరంలాగానే ఈసారి కూడా లక్ష్యాలను నిర్దేశించారు. వర్షాలు కురుస్తుండంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గత ప్రభుత్వం హరితహారం పేరిట మొక్కలు నాటడం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వనమహోత్సవ పేరుతో అమ లు చేస్తోంది. శాఖల వారీగా మొక్కలు కేటాయింపు... అటవీ శాఖకు 3.6లక్షలు, జిల్లా పంచాయతీరాజ్ 4లక్షలు, డిఆర్‌డిఒ, ఎంపిడిఒలు 26.87లక్షలు, ఆర్అండ్‌బి 5వేలు, నీటి పారుదల శాఖ 76వేలు, వ్యవసాయశాఖకు 6.38లక్షలు, మార్కెట్‌కు 5వేలు, ఉద్యానవనశాఖకు 2.55లక్షలు తదితర శాఖలకు కేటాయించారు. అటవీ గ్రామీణాభివృద్ధి శాఖల పర్యవేక్షణలో కార్యక్రమం రూపకల్పన చేస్తున్నారు. ఇప్పటివరకు ఆయా శాఖల అధికారులతో సమీక్షలు చేసి లక్ష్యాలను నిర్దేశించారు. ఈసారి వికారాబాద్ జిల్లాలో వనమహోత్సవ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. వర్షాలు ప్రారంభం కాగానే మొక్క లు నాటేందుకు సిద్ధంగా ఉండాలని సమాయత్తం చేస్తున్నారు. వికారాబాద్ జిల్లావ్యాప్తంగా, అటవీ గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో మొత్తం 609 నర్సరీల్లో మొక్కలను పెంచుతున్నారు. అటవీశాఖ పర్యవేక్షణలో 594 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఉన్నాయి. మొక్కల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. జిపిల్లోని ఒక్కో నర్సరీలో 5వేల నుంచి దాదాపు 30వేల మొక్కలు పెంచుతున్నారు. ఫారెస్ట్ పిఎస్ కింద గచ్చకయ, వెదురు, గుల్‌మోల్, రేన్ ట్రీ, రవి, మర్రి, గానుగ, తురాయి, గార్డెనింగ్ మొక్క లు పెంచుతున్నారు. హోం సీడ్ కింద ఇంటివద్ద నాటుకునే పూల, పండ్ల మొక్కలను పెంచుతున్నారు. గత ఏడాది 40,54,000 మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా 80శాతం మేర టార్గెట్‌ను పూర్తి చేశా రు. ఈసారి కూడా అంతే టార్గెట్ మొక్కలు నాటాలని లక్ష్యం పెట్టుకున్నారు. గత ఏడాది కంటే మరింత సమర్థవంతంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. గతంలో నర్సరీల్లో భారీగా మొక్కలు ఎండిపోవడం, నాటినా సక్రమంగా సంరక్షించకపోవడం తదితర కారణాలతో 80శాతం మొక్కలు బతికాయి. ఇది అధికారులు చెప్పే లెక్కలు మాత్రమే. వాస్తవంగా కేవలం 40 నుండి 50శాతం మాత్రమే బతికాయి, ఈసారి అలా కాకుండా నాటిన మొక్క ల్లో 80శాతానికిపైగా సంరక్షించే విధంగా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రతి అంగన్‌వాడి కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రోడ్డుపక్కన, పొలంగట్లపై మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉన్నాం – డిఎఫ్ఒ జ్ఞానేశ్వర్:** వనమహోత్సవ కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉన్నాం అని వికారాబాద్ జిల్లా అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్ అన్నారు. వర్షాలు పడగానే మొక్కలు నాటాలనే ఆదేశాలు జారీ చేశాం, అన్ని శాఖలు సమన్వయంతో వనమహోత్సవాన్ని విజయవంతం చేస్తాం, గతం కంటే మెరుగైన ఫలితాలను సాధిస్తా మన్నారు.

## శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉక్కుపాదం మోపాలి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉక్కుపాదం మోపేందుకు పోలీసులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి సూచించారు. శుక్రవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిల్కమర్రి రవీందర్‌రెడ్డిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఫరూక్‌నగర్ మండలం చిల్కమర్రి గ్రామంలో గురువారం బోనాల వేడుకల్లో పాల్గొన్న రవీందర్‌రెడ్డిపై కత్తితో దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సమస్యలు ఏమైనా ఉంటే చర్చలతో పరిష్కరించుకోవాలే తప్పా కక్షలు పెంచుకొని దాడులు చేయడం మంచి సంస్కృతి కాదని హెచ్చరించారు. రవీందర్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, మెరుగైన వైద్యసేవలు అందిస్తామని పేర్కొన్నారు. రవీందర్‌రెడ్డిపై హత్యాయత్నంపై పోలీసులు దర్యాప్తు చేయాలని కోరారు. కార్యక్రమంలో మధురాపురం మాజీ సర్పంచ్ శివారెడ్డి, నాయకులు వెంకటేష్ గౌడ్, రాజశేఖర్‌రెడ్డిలు ఉన్నారు.

## మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్, హైదరాబాద్, ద్వార బ్యాంకింగ్, ఫైనాన్సియల్ సర్వీసెస్, ఇన్సురేన్స్ సెక్టార్‌లలో మైనారిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ, ఉపాధి అందిస్తున్నామని రంగారెడ్డి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కోట్ల నవీన్ కుమార్‌రెడ్డి తెలిపారు. శిక్షణ కార్యక్రమం నాన్‌రెసిడెన్షియల్‌గా హైదరాబాద్‌లో మాత్రమే ఒక నెల పాటు నిర్వహించ బడుతుందన్నారు. అర్హత కలిగిన మైనారిటీ అభ్యర్థులు(ముస్లిములు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, పారసీలు,బౌద్ధులు) దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన వివరించారు. దరఖాస్తులను ఆగస్టు 18 వరకు స్వీకరించడం జరుగుతుందన్నారు. అభ్యర్థులు తమ తమ దరఖాస్తులను రంగారెడ్డి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని రూమ్ నెంబర్ 8 లో ఉన్న మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో పని దినాలలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 వరకు ఫారాలను సమర్పించాలని , మరిన్ని వివరాలకు 0402930046 లేదా ఈ మెయిల్: directormsccctelangana gmail.com ని పని దినాలలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 వరకు సంప్రదించాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నవీన్ కుమార్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు

### కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్‌లోని వైదేహి నగర్‌లో నూతనంగా చేపడుతున్న సిసి రోడ్డు పనులను కాలనీ సంక్షేమ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా లోలెవల్ చూసుకోని సీసీ రోడ్డు పనులు చేపట్టాలని కార్పొరేటర్ సంబంధిత కాంట్రాక్టర్‌ను సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, కిషన్ రావు, జంగారెడ్డి, శివరాం ప్రసాద్, నరసింహరెడ్డి, జయరామకృష్ణ శర్మ, పార్టీ నాయకులు శ్రీధర్ రావు, కాంతారావు, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీల్లో సిల్టు తొలగించాలి

### హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వర్షకాలంలో డ్రైనేజీలో మట్టి చేరి పొంగిపొర్లే అవకాశం ఎక్కువగా ఉందని, దీనిపై జలమండలి సంబంధిత అధికారులు డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్టును తొలగించాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్, జిహెచ్‌ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బానోతు సుజాత నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్‌లోని శ్రీ రమణ కాలనీలో నెల కొన్న డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షకాలంలో ఓపెన్ నాలా ఉన్న ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగిపొర్లే అవకాశం ఉంటుందని, ప్రజలు చాలా జాగ్రతంగా ఉండాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మమత మల్లేష్ గౌడ్, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓజోన్ ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న మహిళలకు అరుదైన శస్త్రచికిత్స




**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ మహిళలకు అరుదైన వైద్య చికిత్స అందించి ప్రాణాలు కాపాడినట్లు ఓజోన్ ఆసుప్రతి వైద్యం తెలిపారు. శుక్రవారం కొత్తపేట ఓజోన్ ఆసుప్రతిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు తెలిపిన ప్రకారం ... సుష్మి (21) ప్రమాదవశాత్తు 4వ అంతస్తు నుండి పడి తీవ్ర గాయాలతో తమ ఆసుపత్రిని ఆశ్రయించినట్లు తెలిపారు. భారీ రక్త స్రావం, తక్కువ బీపీతో ఆమె పరిస్థితి అత్యంత విషయంగా మారిందన్నారు. వెంటనే అత్యవసర చికిత్సను అందించి ప్రాణాపాయం నుంచి ఆమెను రక్షించినట్లు తెలిపారు. రెండు తొడల ఎముకలు విరగడం పిల్విస్, చెయ్యి, మోకాలు, మడమల గాయాలకు అత్యాధునిక శస్త్ర చికిత్సలు నిర్వహించామన్నారు. ప్రస్తుతం సుష్మతను జనరల్ వార్డులలో ఉంచినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డాక్టర్లు కళ్యాణ్, రాఘవ ఆదిత్య, సురేష్‌రెడ్డి, నిఖిల్, వికాస్, రాజేష్, విజయ్‌కుమార్, సాయితేజ, ఇంద్రసేన్‌రెడ్డి, సుష్మా తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల్లో అత్యధిక స్థానాలు




**ప్రజాపక్షం/యాచారం :** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మస్కు నర్సింహ్మా అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా నర్సింహ్మా మాట్లాడుతూ కాంగ్రేస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను యుద్దప్రాతిపాధికన అమలు చేస్తుందన్నారు. కాంగ్రేస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్పిన అవసరం ఉందని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న కృషిని గుర్తించుకోని వచ్చే ఎన్నికల్లో కాంగ్రేస్ పార్టీ అభ్యర్దులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి రమావత్ జ్యోతి శ్రీనివాస్ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గులాం అక్బర్, జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్,నాయకులు గడల మల్లేశ్,లిక్కి పాండు రంగారెడ్డి,వి. తిరుమలేశ్,ముస్కు కుమార్ తదితరులు పాల్గోన్నారు.

## గడ్డిఅన్నారంను తీర్చిదిద్దుతా

### కార్పొరేటర్ బద్దం ప్రేమ్



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** గ్రేటర్‌లోనే గడ్డిఅన్నారం డివిజన్‌ను నంబర్1 తీర్చిదిద్దుతున్నట్లు కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని శంఖేశ్వర్‌బజార్ చౌరస్తా నుంచి శారదా దియేటర్ వరకు నూతనంగా నిర్మిచబోయే బిటి రోడ్డు పనులకు కార్పొరేటర్ ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ వాసులకు ఇబ్బందులు కలుగకుండా పనులు వేగవంతం చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ఎఇ రూప, వర్క్ ఇన్స్‌స్పెక్టర్ వెంకటేష్, కాలనీ అధ్యక్షులు అశోక్, మున్నా యాదవ్, లావణ్య, నాయకులు చిలకూరి రాంరెడ్డి, ఒంకార్, దాసరి జయప్రకాష్, శ్రావణ్‌గౌడ్, రాజేశ్వరి, శ్రీకాంత్, సిరిరెడ్డి, టింకు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటికో ఇంకుడు గుంత..

**భూగర్భ జలాల పెంపునకు జలమండలి యాక్షన్ ప్లాన్**

**ముఖ్యమంత్రి ఆదేశంతో 90 రోజుల ప్రత్యేక కార్యక్రమం**

**16 వేల ఇంకుడు గుంతల నిర్మాణానికి సిద్ధం కావాలి**

**జలమండలి ఎండి. అశోక్ రెడ్డి**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇంకుడు గుంతల ప్రాధాన్యం, వాటి నిర్మాణ ఆవశ్యకత ప్రజలకు తెలపడానికి జలమండలి 90రోజుల యాక్షన్‌ప్లాన్‌ను రూపొందిస్తోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశంతో ఓఆర్ ఆర్ వరకు భూగర్భ జలాలను పెంచే లక్ష్యంగా ఇంటికో ఇంకుడు గుంత కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై జలమండలి ఎండి.అశోక్ రెడ్డి, ఇడి.మయాంక్ మిట్టల్ కలిసి జలమండలి అధికారులు, ఎన్‌జిఓలతో శుక్రవారం జూమ్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎండి మాట్లాడుతూ ఓఆర్ ఆర్ పరిధిలో భూగర్భ జలాలను పెంచే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశంతో జలమండలి 90 రోజుల యాక్షన్ ప్లాన్ రూపొందించిందని, ఈ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా రానున్న 90రోజుల్లో 16వేల ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. జలమండలి అధికారులు, ఎన్‌జిఓలు క్షేత్రస్థాయిలో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టే అనువైన ప్రాంతాలను వారంలోగా గుర్తించాలని ఆదేశించారు. అపార్టుమెంట్ లు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీ వాసులకు ఇంకుడు గుంతల ప్రాధాన్యత తెలిపేలా కార్యక్రమాలను రూపొందించాలని అధికారులను సూచించారు. వీటితోపాటు నిరుపయోగంగా ఉన్న బోర్‌వెల్‌లను గుర్తించి, ఇంజక్షన్ బోర్‌వెల్‌గా మార్చడానికి ప్రతిపాదనలను రూపొందించాలన్నారు. వేసవిలో భూగర్భ జలాల స్థాయి తగ్గిపోవడంతో తాగునీటితో పాటు గృహ అవసరాలకు సైతం ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసే పరిస్థితి తలెత్తిందన్నారు. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశంతో హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మార్గదర్శకంలో జలమండలి ఇంటికో ఇంకుడు గుంత అనే నినాదంతో ముందస్తు ప్రణాళికతో ప్రత్యేక కార్యచరణకు దిగిందన్నారు. మయాంక్ మిట్టల్ మాట్లాడుతూ ఇంకుడు గుంతల కోసం గుర్తించిన ప్రాంతాలను నిర్మాణం ముందు, నిర్మాణం తరువాత తీసిన ఫొటోల ను అప్లోడ చేసి, జియోట్యాగ్ చేసే వీలుగా ప్రత్యేక మొబైల్ యాప్‌ను రూపొందించాలని ఐటీ వింగ్ అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు కార్యక్రమం పురోగతిని తెలుసుకునే విధంగా ప్రత్యేకమైన డ్యాష్ బోర్డును రూపకల్పన చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇఎన్‌సి డైరెక్టర్ ఆపరేషన్2 వివిఎల్ ప్రవీణ్ కుమార్, ప్రాజెక్ట్ డైరెక్టర్ సుదర్శన్, డైరెక్టర్ ఆపరేషన్1 అమరేందర్‌రెడ్డి, సిజిఎంలు, ఇంకుడు గుంతల ప్రత్యేక అధికారి జాల సత్యనారాయణ, ఎన్‌జిఓల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆగస్టు 2న సిపిఐ రంగారెడ్డి జిల్లా మహాసభ




సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** మొయినాబాద్ మండల కేంద్రంలోని అంజనాదేవి ఫంక్షన్‌హాల్‌లో ఆగస్టు 2న నిర్వహించనున్న సిపిఐ జిల్లా 17వ మహాసభలు మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. మహాసభల కరపత్రాలను శుక్రవారం మొయినాబాద్ మండల కేంద్రంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, రామస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం ప్రభు లింగం, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణతో కలిసి సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరుగుతున్న జిల్లా మహాసభల విజయవంతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. మహాసభలో భవిషత్తు కార్యచరణ రూపొందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమం లో నాయకులు శ్రీనివాస్, శ్రీశైలం, అంజయ్య, మంజుల, సుధాకర్ గౌడ్, జలీల్, తదితరులు పాల్గొన్నారు.

## ట్రంక్‌లైన్ పూర్తి అయితే వరద నుంచి విముక్తి

### ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** వరద ప్రభావం ఉన్న హస్తినాపురం, వనస్థలిపురం డివిజన్‌లోని కాలనీలకు ట్రంక్ లైన్ పనులు పూర్తి అయితే వరద ప్రభావం నుంచి విముక్తి కలుగుతుందని ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం సాగర్ రింగ్ రోడ్డు వద్ద జరుగుతన్న నాలా ట్రంక్ లైన్ పనులను బిఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ట్రంక్ లైన్ పనుల కోసం ప్రభుత్వం నుంచి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. హస్తినాపురం డివిజన్‌లో ఎన్నో ఏళ్లుగా ఉన్న సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ పనులు పూర్తి అయితే వనస్థలిపురంలోని క్రిస్టియన్ కాలనీ, రాజీరెడ్డి కాలనీ, హస్తినాపురం ఈస్ట్, న్యూ వెంకటరమణ కాలనీ, శ్రీ వెంకటరమణ కాలనీ, అనురాధ కాలనీ, ఓంకార్ నగర్ చుట్టుపక్కల కాలనీలకు వరద నుంచి విముక్తి లభిస్తుందని ఆయన తెలిపారు. ఎల్‌బి నగర్ నియోజకవర్గ సంపూర్ణ అభివృద్ధికి పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమలో హస్తినాపురం డివిజన్ అధ్యక్షులు అందోజు సత్యం చారి, యువజన నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, రవి మురిరాజ్, కర్మన్‌ఘాట్ మాజీ ధర్మకర్త మధు సాగర్ తదితరులు ఉన్నారు.

## ముస్కీ చెరువు సందర్శించిన హెచ్‌ఎండిఏ అదనపు కమిషనర్



**ప్రజాపక్షం/గండిపేట:** మణికొండ ముస్కీ చెరువును హెచ్‌ఎండిఏ అదనపు కమిషనర్ శ్రీవాస్తవ శుక్రవారం అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు చెరువు పరిసర ప్రాంతాల నివాసితులు రెండు ముఖ్యమైన అంశాలను స్పష్టంగా వివరించారు. చెరువు ప్రధాన గేట్ వద్ద పెద్దఎత్తున మట్టి వేసి, పచ్చదనం తొలగిస్తూ అభివృద్ధి పేరిట చెడు చెడు చర్యలు కొనసాగిస్తున్నారని ఆయనకు వివరించారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్య వచ్చిన మద్దతు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.మనందరం కలిసి ముస్కీ చెరువును రక్షించేందుకు, దీని స్థిరమైన అభివృద్ధిని నిర్ధారించేందుకు ప్రయత్నాలు కొనసాగిద్దామన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతోనే రైతు మృతి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతోనే ఒక రైతు ప్రాణాలు పోయాయని, ఇందుకు ట్రాన్స్‌కో అధికారులు పూర్తి బాధ్యత వహించాలని మాజీ ఎమ్మెల్యే తనయుడు మురళీ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లేడు చౌదరిగూడ మండలం గాలిగూడ గ్రామానికి చెందిన రైతు క్యాత్రమోని నర్సింలు మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు దైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మురళీ యాదవ్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ట్రాన్స్‌కో అధికారులు ఎల్‌సి ఎలా ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. ముందుగానే రైతు ట్రాన్స్‌కో లైన్‌మెన్‌కు సమాచారం ఇచ్చి ఎల్‌సి తీసుకుంటే సమాచారం ఇవ్వకుండా మళ్లీ విద్యుత్ ఎలా పునరుద్ధరిస్తారని ప్రశ్నించారు. తక్షణమే మృతి చెందిన రైతు కుటుంబానికి ట్రాన్స్‌కో అధికారులు నష్టపరిహారం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంతో ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు హెచ్చరించారు. రైతు కుటుంబానికి బిఆర్‌ఎస్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు

### హరిపురికాలనీలో ఘనంగా బోనాల వేడుకలు

**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** సంస్కృతి సంప్రదాయలకు ప్రతీక బోనాల ఉత్సవాలు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌కెపురం డివిజన్ హరిపురికాలనీ మహిళా మండలి ఆధ్వర్యంలో బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు హాజరై అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సుకన్య, వాణి, పద్మజ, లక్ష్మీ, అనిత, పద్మావతి, ఉమా, రాజేశ్వరి, మారం సుజాత, శోభ పాల్గొన్నారు.

**హరిపురికాలనీలో ...** సంస్కృతి సాంప్రదాయలకు ప్రతీక బోనాల ఉత్సవాలు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌కెపురం డివిజన్ హరిపురికాలనీ మహిళా మండలి ఆధ్వర్యంలో బోనాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు ముఖ్యఅతిధిగా హాజరై అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సుకన్య, వాణి, పద్మజ, లక్ష్మీ , అనిత, పద్మావతి, ఉమా, రాజేశ్వరి, మారం సుజాత, పాల్గొన్నారు.

**ఫరూఖ్‌నగర్ :** భక్తిశ్రద్దలతో పోచమ్మ తల్లి అమ్మవారి విగ్రహా ప్రతిష్టాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని భీమారం గ్రామంలో దాత రాఘవేందర్ గౌడ్ (రవి) తన సొంత ఖర్చులతో నూతనంగా దేవాలయం నిర్మించడంతోపాటు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. గ్రామంలో రెండు రోజుల పాటు అమ్మవారి దేవాలయం అవరణలో హోమాలు, పూజలు భక్తి శ్రద్దలతో కనున్నల పండువగా గ్రామస్తులు నిర్వహించారు. అమ్మవారి విగ్రహం ప్రతిష్ఠించిన మరుక్షణం భారీ వర్షం కురవడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు పెట్టి అమ్మవారిని నెలకొల్పడం శుభ పరిణమామని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు భవిష్యత్ తరాలకు గుర్తిండి పోతాయని గ్రామస్తులు పేర్కొన్నారు. దైర్యం, దైవం పట్ల ప్రజలపై ప్రేమ ఉన్నవాళ్ళే ఇలాంటి సహాసోపేతమైన నిర్ణయం తీసుకుంటారని వివరించారు. వారి కుటుంబం ఎల్లప్పుడు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని గ్రామస్తులు పేర్కొన్నారు.






### అమ్మవారికి మకర తోరణం బహుకరణ

**కొత్తూరు:** మైసమ్మ తల్లి అమ్మవారికి మకర తోరణం స్థానిక నేతలు బహుకరించారు. శుక్రవారం కొత్తూరు మున్సిపాలిటిలో ఆషాడ మాసం సందర్భంగా అమ్మవారికి మకర తోరణం బహుకరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ అమ్మవారి అశీస్సులు మున్సిపల్ ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు తెలిపారు. ఆషాడం మాసంలో అమ్మవారికి భోనం నైవేద్యంగా సమర్పించి మొక్కులు తీర్చుకోవడం అనవాయితీగా వస్తుందని వివరించారు. తన సొంత ఖర్చులతో అమ్మవారికి మకర తోరణం ఏర్పాటు చేసి బహుకరించినట్లు తెలిపారు. అమ్మవారి చల్లని అశీస్సులు ప్రజలందరిపై ఉండాలని వేడుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, కడెంపల్లి సదానందం గౌడ్, అనిత శ్రీనివాస్ గౌడ్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు వెంకటేష్, కుమార్, కర్రోళ్ల లక్ష్మ య్య, పేపర్ యాదయ్య, వడ్ల విష్ణు, మేకల రాఘవేందర్ యాదవ్, శివకుమార్ చారి, బండి కృష్ణ, పవన్‌లు పాల్గొన్నారు.

# సమన్వయంతో సంక్షేమ పథకాలు అమలు

### 'దిశ' సమావేశంలో ఎంపి, దిశ చైర్మన్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి




**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను జిల్లా అధికారులు సమన్వయంతో పూర్తిస్థాయిలో అమలు చేసేలా పనిచేయాలని చేవెళ్ల ఎంపి, దిశ చైర్మన్ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కోరారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సమన్వయ,పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖలలో చేపట్టిన పనులు, పథకాల అమలుపై కలెక్టర్ సి.నారాయణరెడ్డితో కలిసి ఎంపి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు, వాటి ప్రయోజనాలు, ఎంత సబ్సిడీ అందుతుందనేది సంబంధిత శాఖల అధికారులు తెలుసుకోవాలని, ప్రభుత్వ పథకాలపై గ్రామాలు, మండల, పట్టణ కేంద్రాల్లో సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో మష్రుమ్ పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, జిల్లాలో గాలివానకు ధ్వంసమైన పాలీహౌస్ల పునరుద్దరణకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులకు తెలిపారు. అంగన్ వాడి కేంద్రాలు,ప్రభుత్వ పాఠశాలల్లో పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని, గుడ్డుతో పాటు సోయామిల్క్ అందించేలా చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారికి ఎంపి సూచించారు. జిల్లాలో మత్స్యకారులకు చేపలు పట్టే విధానంపై పూర్తి స్థాయిలో శిక్షణ ఇప్పించి, కావాల్సిన వలలను అందజేయాలని, తద్వారా స్థానిక మత్స్యకారులకు ఆర్థికంగా ప్రయోజనం కలుగుతుందని ఎంపి సంబంధిత శాఖ అధికారికి సూచించారు. జిల్లాలో ఇదివరకే నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇండ్ల కేటాయింపులో స్థానికులకే మొదటి ప్రాధాన్యత ఇచ్చేలా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని, చేవెళ్ల పార్లమెంటు పరిధిలోని డబుల్ ఇండ్లకు సంబంధించిన వివరాలు అందజేయాలన్నారు. జిల్లాలో ముద్ర, విశ్వకర్మ పథకాలతో పాటు చిరు వ్యాపారస్తులు ఆర్థికంగా అభివృద్ధికి చెందేందుకు దరఖాస్తు చేసుకున్న వారికి సత్వరమే రుణాలు అందేలా బ్యాంకర్లు చొరవ తీసుకోవాలని ఎంపి ఆదేశించారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రధాన, ఇతర రహదారులను పూర్తి చేయాలని, చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వెంటనే చేపట్టాలని ఎంపి సంబంధిత శాఖల అధికారులకు తెలిపారు. చేవెళ్ల, రాజేంద్రనగర్ ప్రాంత రైతుల కోసం మిల్క్ సెంటర్ ఏర్పాటు చేయాలని దిశ కమిటీ సభ్యులు ఎంపికి విన్నవించారు. జిల్లాలోని ఆయా ఆసుపత్రుల్లో పశు సంవర్ధక శాఖ అధికారులు అందుబాటులో ఉండడం లేదని దిశా కమిటీ సభ్యులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తమ నియోజకవర్గాల్లోని సమస్యలను ఎంపి, కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డిఆర్‌డిఒ శ్రీలత, జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్, జిల్లా పరిషత్ సిఇఒ కృష్ణారెడ్డి, విద్యాశాఖ అధికారి సుసింధర్ రావు, జిల్లా కార్మిక శాఖ అధికారి సత్యనారాయణరెడ్డి, మిషన్ భగీరథ ఇఇ రాజేశ్వర్, వ్యవసాయ శాఖ అధికారి ఉష, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# క్రీడ





## ప్రజ్ఞానందకు ఊహించని ఓటమి..
# సెమీఫైనల్లో అర్జున్

ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న భారత గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ఎరిగేసి విశ్వ వేదికపై మరోసారి తన తడాఖా చూపించాడు. ప్రతిష్ఠాత్మక ఫ్రీస్టయిల్ గ్రాండ్‌స్లామ్ టూర్‌లో అదరగొడుతున్న అతడు దర్జాగా సెమీఫైనల్‌కు దూసుకెళ్లాడు. లాస్ వేగాస్‌లో శుక్రవారం జరిగిన క్వార్టర్స్‌లో ఉజ్బెకిస్థాన్ స్టార్ నొద్రిబెక్ అబ్దుసత్రోవ్‌ను తెలంగాణ కుర్రాడు చిత్తు చేశాడు. అయితే.. వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్‌ను ఓడించి రెట్టించిన ఉత్సాహంతో క్వార్టర్స్ చేరిన ప్రజ్ఞానంద మాత్రం అనూహ్యంగా టైటిల్ రేసులో వెనకబడ్డాడు.

## జడ్డూ..'మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్'



### గౌతం గంభీర్

లార్డ్స్‌లో గెలవాల్సిన మ్యాచ్‌ను భారత జట్టు చేజార్చుకుంది. ప్రధాన బ్యాటర్లు విఫలమైన దశలో సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా అసమాన పోరాటంతో టీమ్‌ను గెలిపించేందుకు సర్వశక్తులు ఒడ్డాడు. టెయిలెండర్లతో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన అతడు ఇంగ్లాండ్ వెన్నులో వణుకుపుట్టించాడు. చరిత్రలో నిలిచిపోయే ఇన్నింగ్స్ ఆడిన జడ్డూ శ్రమకు తగిన గుర్తింపు దక్కింది. ఈ వెటరన్ ప్లేయర్‌ను ఆకాశానికెత్తేసిన ప్రధాన కోచ్ గౌతం గంభీర్ 'మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్' ట్యాగ్ ఇస్తున్నామని చెప్పాడు.

ఐదోరోజు భారత టెయిలెండర్లు గొప్ప ప్రదర్శన చేశారు. ముఖ్యంగా జడేజా అద్భుత పోరాటం కనబరిచాడు. అందుకే అతడు టీమిండియాకు మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్' అని గౌతీ అన్నాడు. సహాయక కోచ్ రియాన్ టెన్ డస్చేట్ సైతం ఇదే అభిప్రాయం వెలిబుచ్చాడు. 'లార్డ్స్ మైదానంలో జడేజా బ్యాటింగ్ వేరే లెవల్‌లో సాగింది. గత రెండు మ్యాచుల్లో అతడు నిలకడగా రాణించాడు. జడ్డూ డ్రెస్సింగ్ రూమ్‌కు ప్రశాంతత తీసుకొచ్చాడు. నేను కొన్ని ఏళ్లుగా అతడిని గమనిస్తున్నా. జడేజా ఆటలో ఎంతో పరిణతి సాధించాడు. నిఖ్సాన బ్యాటర్‌గా అవతరించాడు' అని డస్చేట్ వెల్లడించాడు.



## భారత ఓపెనర్‌కు షాకిచ్చిన ఐసిసి..
### ఇంగ్లాండ్ జట్టు మొత్తానికి జరిమానా!

క్రికెట్ స్ఫూర్తిని దెబ్బతీసే చర్యలను తీవ్రంగా పరిగణించే అంతర్జాతీయ క్రికెట్ మండలి హద్దు మీరిన ఆటగాళ్లకు జరిమానాలు విధిస్తుంటుంది. ఈ క్రమంలోనే భారత ఓపెనర్ ప్రతికా రావల్‌కు ఐసిసి షాకిచ్చింది. ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి వన్డేలో కోడ్‌ను ఉల్లంఘించినందుకు ఓపెనర్‌కు మ్యాచ్ ఫీజులో 10 శాతం జరిమానా వేసింది. అంతటితోనే సరిపెట్టకుండా ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించింది. నాట్ సీవర్ బ్రంట్ నేతృత్వంలోని ఆతిథ్య జట్టుకు కూడా భారీ ఫైన్ పడింది. స్లో ఓవర్ రేటు కారణంగా జట్టు సభ్యులకు మ్యాచ్ ఫీజులో 5 శాతం జరిమానా విధించింది ఐసిసి.

## రెజ్లింగ్‌లో భారత్‌కు స్వర్ణం!




పోలీయాక్ ఇమ్రేవర్గా జానోస్ మెమోరియల్ 2025 రెజ్లింగ్ టోర్నీలో భారత రెజ్లర్ సుజీత్ కల్కల్ స్వర్ణ పతకం సాధించాడు. హంగేరీలోని బుడాపెస్ట్ వేదికగా జరిగిన 65 కేజీల పురుషుల ఫ్రైస్టైల్ ఫైనల్లో సుజీత్ కల్కల్ 5–1 తేడాతో రహీమ్‌జాదేను ఓడించాడు. ఈ ఏడాది జరిగిన రెజ్లింగ్ ర్యాంకింగ్ సిరీస్‌ల్లో భారత్‌కు ఇదే తొలి స్వర్ణం కావడం విశేషం. అమ్మాన్, మంగోలియా వేదికగా జరిగిన రెజ్లింగ్ టోర్నీల్లో భారత రెజ్లర్లు పతకాలు సాధించకుండానే వెనుదిరిగారు. ఫైనల్లో సుజీత్ ఆరంభం నుంచే ఆధిపత్యం చెలాయించాడు. తొలి పిరియడ్‌లోనే ఒక యాక్టివిటీ పాయింట్ సాధించిన సుజీత్.. రెండో పిరియడ్ పూర్తయ్యేసరికి రెండు యాక్టివిటీ పాయింట్స్‌తో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. ఆఖరి వరకు ఇదే జోరును కొనసాగించి విజయాన్ని సొంతం చేసుకున్నాడు. ఈ టోర్నీలో సుజీత్ తొలి రౌండ్‌లో 11–0 తేడాతో పారిస్ 2024 ఒలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్ అల్బేనియా రెజ్లర్ ఇస్లాం దుడాయేవ్‌ను ఓడించాడు. క్వార్టర్ ఫైనల్లో యూరోపియన్ రెజ్లర్, సిల్వర్ మెడలిస్ట్ ఖమ్జాత్ అర్సామెర్జ్యూయెవ్‌ను చిత్తు చేశాడు. సెమీఫైనల్లో ఆర్మేనియాకు చెందిన వాజ్‌జెన్‌ను 6–1 తేడాతో ఓడించాడు. ఇదే టోర్నీలో పురుషుల 57 కిలోల విభాగంలో భారత్‌కు మరో పతకం దక్కింది. కాంస్య పోరులో భారత రెజ్లర్ రాహుల్ 4–0తో జర్మనీకి చెందిన నిక్లాస్ స్టెచెలేపై విజయం సాధించి బ్రాంజ్ దక్కించుకున్నాడు. అంతకుముందు జరిగిన క్వార్టర్‌ఫైనల్లోరాహుల్ 5–3 తేడాతో కొరియాకు చెందిన కిమ్ సంగ్‌ను ఓడించాడు. కానీ సెమీఫైనల్లోరాహుల్ 6–7 తేడాతో అమెరికా రెజ్లర్ ల్యూక్ జోసెఫ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. ఇతర పోటీల్లో భారత్‌కు చెందిన ఉదిత్(61 కిలోల విభాగం), విక్కీ(97 కిలోల విభాగం) ఓటమిపాలయ్యారు. ఈ టోర్నీలో పొందే ర్యాకింగ్ పాయింట్స్.. ఈ ఏడాది సెప్టెంబర్‌లో క్రొయేషియాలోని జాగ్రెబ్ వేదికగా జరిగే వరల్డ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో సీడింగ్ పొందేందుకు ఉపయోగపడుతాయి.

# సైన్స్ ఫోకస్

## అపార ఖనిజ సంపద

గ్రహశకలాల్లో ఇనుము, ప్లాటినం, టైటానియం వంటి అపారమైన ఖనిజ సంపద ఉంది. వాటి ఉపరితలంపై ఉన్న నీటిని విచ్ఛిన్నం చేసి అంతరిక్ష వాహనాలకు ఇంధనంగా ఉపయోగించవచ్చని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు. ఎన్నో పరిశోధ నలు, మరెన్నో అవసరాల కోసం మనిషికి కావాల్సిన ఎన్నో ఖనిజాలు ఉండడంతో, గ్రహశకలాల నుంచి వాటిని తవ్వి తీస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అయితే, ఆస్టరాయిడ్స్‌ను తవ్వి, ఖనిజాలను వెలికితీయడం సాధ్యమా?

ప్రస్తుత పరిస్థితుల్లో ఇది అసాధ్యమనే చెప్పాలి. ఎందుకంటే, ఆస్టరాయిడ్ బెల్ట్ మనకు సుమారు 179.5 నుంచి 329 మిలియన్ కిలోమీటర్ల దూరంలో ఉంది. అత్యాధునిక వ్యోమనౌకలను ఉపయోగించినప్పటికీ, ఒక గ్రహశకలానికి చేరుకోవాలంటే 6 నుంచి 8 నెలలు పడుతుంది. ఒక్కోసారి సంవత్సరం కూడా కావచ్చు. అలాంటి వ్యోమనౌకను సిద్ధం చేసినప్పటికీ, అక్కడ తవ్వకానికి అవసరమైన పరికాలను మోసుకెళ్లడం అనుకున్నంత సులభం కాదు. ఒకవేళ భారీ వ్యోమనౌకను తయారు చేసి, పంపించినా, అది ఎలాంటి సమస్యలు లేకుండా తిరిగి భూమికి చేరుకుంటుందని అనుకోవడానికి వీల్లేదు. ఏ రకంగా చూసినా, గ్రహశకలాల నుంచి ఖనిజాలను వెలికితీయడం, భూమికి తీసుకురావడం అసాధ్యంగానే ఉంది. అయినప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా చాలా కంపెనీలు ఈ దిశగా ప్రయత్నాలు చేస్తుండడం ఆశ్చర్యకరం. ఇలా వుంటే, భూమిపై రాక్షస బల్లులు (డైనోసార్స్) తుడిచిపెట్టుకు పోవడానికి ఒక గ్రహశకలమే కారణమని వాస్త్రవేత్తలు భావిస్తున్నారు. శాస్త్రీయ సమాజంలో ఈ సిద్ధాంతం ప్రబలంగా ఉంది. డైనోసార్ల సామూహిక విలుప్తానికి కేంద్రం మెక్సికోలోని యుకాటాన్ ద్వీపకల్పం కింద కనుగొన్న, ఇంపాక్ట్ బిలం అయిన చిక్సులబ్ క్రేటర్‌లో ఉందని చాలా మంది శాస్త్రవేత్తల నమ్మకం.





భూమి తన అక్షంపై, తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుడి చుట్టూ కూడా తిరుగుతుందని మనకు తెలుసు. భూమి తన చుట్టూ తాను తిరగడాన్ని భూభ్రమణం అని, సూర్యుడి చుట్టూ తిరగడాన్ని భూ పరిభ్రమణం అనీ అంటారన్నది కూడా తెలిసిందే. భూభ్రమణం వల్లే పగలు, రాత్రి, రోజులను అనుభవిస్తాం.

## పెరుగుతున్న భూభ్రమణ వేగం

సాధారణంగా భూమి ఒకసారి తన చుట్టూ తాను తిరగడానికి 23 గంటలు 56 నిమిషాలు 4.09053 సెకన్లు పడుతుంది. అయితే, భూమి తిరిగే వేగం స్వల్పంగా పెరిగిందని ఇటీవల శాస్త్రవేత్తలు గుర్తించారు. గత కొన్ని సంవత్సరాలలో, ముఖ్యంగా 2020 తర్వాత, కొన్ని రోజులు భూమి సాధారణంగా కంటే తక్కువ సమయంలో తిరుగుతోందని నిర్ధారణకు వచ్చారు. 2022లో జులై 26న భూమి తన చరిత్రలో అతి తక్కువ రోజును నమోదు చేసింది. సాధారణమైన రోజు కంటే ఇది 1.59 మిల్లీసెకన్లు తక్కువ. ఈ ఏడాది కూడా కొన్ని రోజులు భూమి 1.3 – 1.6 మిల్లీసెకన్లు త్వరగా తిరిగినట్లు నాసా, జాతీయ భూ పరిశోధన సంస్థలు గమనించాయి. ఈ మార్పుకు క్షీణిస్తున్న పర్యావణ పరిస్థితులే కారణమని అంటున్నారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా గ్లేషియర్లు కరగడం పెరుగుతున్నది. భారీగా మంచు కరిగిపోతే, దాని బరువు భూమిపై ప్రభావం చూపుతుంది. భభ్రమణం నెమ్మదిస్తుంది. గ్లోబల్ వార్మింగ్‌తోపాటు భూగర్భంలోని లిక్విడ కోర్ ప్రవాహాలు కూడా భూభ్రమణ సమయం పెరుగుదలకు ఒక కారణం. భూమి గర్భకేంద్రంలో ఉన్న ద్రవ మాంతలికలు (మోల్టెన్ కోర్) అర్ధ చంద్రాకారంలో తిరుగుతున్నాయి. వీటి కదలిక భూమి తిరగడంపై ప్రభావం చూపుతుంది. ఇలా వుంటే, చంద్రుడు భూమిపై కొంత టైడల్ బ్రేకింగ్ ప్రభావాన్ని చూపుతాడు, అంటే భూమి తిరిగే వేగాన్ని కాస్త తగ్గిస్తాడు. కానీ చంద్రుడు దూరం పెరుగుతున్న కొద్దీ ఈ ప్రభావం తగ్గిపోతోంది. అందువల్ల భూభ్రమణ వేగం పుంజుకుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. కొన్ని పెద్ద భూకంపాలు కూడా భూమి గుండ్రపు ఆకారాన్ని కొద్దిగా మార్చవచ్చు. ఇది భూమి తిరగడంపై తక్కువ ప్రభావం చూపుతుంది. ప్రస్తుతానికి పెద్దగా సమస్య లేకపోయినప్పటికీ, భూభ్రమణ వేగం పెరిగితే, ప్రపంచ సమయ వ్యవస్థలో మార్పులు సంభవిస్తాయి. భూమి వేగంగా తిరిగితే, లీప్ సెకండ్‌ను తీసివేయాల్సి రావచ్చు. దీనిని 'నెగెటివ్ లీప్ సెకండ్'గా పిలుస్తారు. ఇది ఇప్పటివరకు ఎన్నడూ జరగని పరిణామం. జిపిఎస్ వ్యవస్థ ఉపగ్రహాలు భూమి తిప్పే వేగాన్ని బాగా ఖచ్చితంగా అంచనా వేస్తూ పనిచేస్తాయి. భూభ్రమణ వేగం మారితే, జిపిఎస్‌లో స్వల్ప మార్పులు అనివార్యమవుతాయి. కాబట్టి సమయాన్ని అప్‌డేట్ చేసుకోవాల్సి రావచ్చు. టెలికాం, ఫైనాన్షియల్ నెట్‌వర్క్స్, ఇంటర్నెట్ సమయ సమన్వయం మీద కూడా ప్రభావం ఉండొచ్చు. కాగా, 2029 లేదా 2030 ప్రాంతంలో, మానవాళి చరిత్రలో మొట్టమొదటి 'నెగెటివ్ లీప్ సెకండ్' నమోదయ్యే అవకాశముంది. అంటే ఒక సెకను తీసేస్తారు. ఇది కంప్యూటింగ్, డిజిటల్ సిస్టమ్స్‌కి పెద్ద సవాలు. ఈ వేగం తాత్కాలికమా లేదా శాశ్వతమా అనే దానిపై శాస్త్రవేత్తలు ఇంకా పరిశోధన చేస్తున్నారు.

# వరంగల్ సమగ్రాభివృద్ధికి ఉద్యమాలు

### సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి
### 30,31 తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభలు




**ప్రజాపక్షం/వరంగల్ :** జిల్లా సమగ్ర అభివృద్ధికి ఉద్యమాలకు సిద్ధమవుతామని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పేర్కొన్నారు. శివనగర్ సిపిఐ జిల్లా కార్యాలయం తమ్మెర భవన్‌లో శుక్రవారం జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశానికి సంగి ఎలేంధర్ అధ్యక్షత వహించగా మేకల రవి మాట్లాడారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ఉద్యమాలు చేసిన చరిత్ర సిపిఐ సొంతమన్నారు. మోదీ ప్రభుత్వం పూర్తిగా ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ధనిక, కార్పొరేట్ ప్రయోజనాలను పరిరక్షించేందుకు ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు నియంత్రించాలని, తెలంగాణ ప్రభుత్వం పంపిన 42 శాతం బిసి రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్లో ఆమోదించి తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 30,31 తేదీలలో వరంగల్ నగరంలో జరిగే సిపిఐ వరంగల్ జిల్లా 2వ మహాసభలను విజయవంతం చేయాలని అన్ని వర్గాల ప్రజలను ఆయన కోరారు. రానున్న రోజుల్లో భవిష్యత్ పోరాటాల రూపకల్పనకు మహాసభలో సమగ్రంగా చర్చించి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. జిల్లా అన్నివర్గాలకు అండగా ఉంటామని, వారి సమస్యల పరిష్కారానికి పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కె బాష్మియా, పార్టీ జిల్లా నాయకులు పనాస ప్రసాద్, బుస్స రవీందర్, అక్కపెల్లి రమేష్, గన్నారపు రమేష్, గుంపెల్లి మునిశ్వర్, గుండె బద్రి, వీరగోని శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# కఠినంగా మహిళా చట్టాల అమలు

### మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పద్మజ డిమాండ్




**ప్రజాపక్షం/పాల్వంచ :** మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు మహిళా చట్టాలను కఠినంగా అమలు చేయాలని మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వీసంశెట్టి పద్మజ డిమాండ్ చేశారు. సిపిఐ కార్యాలయం చంద్రా రాజేశ్వరరావు భవన్‌లో మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో పద్మజ మాట్లాడుతూ సమాజంలో మహిళలపై వేధింపులు, హత్యలు, అత్యాచారాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో మహిళల రక్షణకు అనేక హక్కులు ఉన్నాయని, వాటికి తోడు నూతనంగా నిర్భయ, దిశ చట్టాలు వచ్చినప్పటికి మహిళలకు భద్రత కరువైనదని వాపోయారు. ప్రభుత్వాలు మహిళా చట్టాలు కఠినంగా, సక్రమంగా అమలు చేయక పోవటంతోనే హింసలు పెరిగిపోతున్నాయని ఆరోపించారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు బలమైన ప్రజా ఉద్యమాలను నిర్వహించాలన్నారు. మహిళల హక్కుల కోసం నిరంతరం శ్రమిస్తూ ఉద్యమాలు, ప్రజా పోరాటాలను నిర్వహిస్తూ ఎన్నో విజయాలను అందించిన భారత జాతీయ మహిళా సమాఖ్య పాల్వంచ పట్టణ, మండల 5 మహాసభలు ఈనెల 21న జరగనున్నాయని తెలిపారు. పట్టణ, మండలంలో అన్నివర్గాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భారత జాతీయ మహిళా సమాఖ్య నాయకులు వగ్గెల పద్మ, డి.లక్ష్మి, వై.ప్రభావతి, సంధ్య, జి.పద్మ, కె.ఈశ్వరమ్మ, వై.మేరమ్మ, ఆర్.హేమలత, వాడె లక్ష్మి, కె.స్వర్ణలత, వజ్జా రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యల పరిష్కారానికి
# ప్రజాప్రతినిధుల ఇండ్లు ముట్టడిస్తాం



### 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థలు బంద్ : ఎఐఎస్‌ఎఫ్ పిలుపు

**ప్రజాపక్షం/వరంగల్ :** విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ప్రజా ప్రతినిధుల ఇండ్లు ముట్టడిస్తామని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. జూలై 23న విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాలు నాయకుల పిలుపునిచ్చారు. వామపక్ష విద్యార్థి సంఘాలైన ఎఐఎస్‌ఎఫ్, ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్‌యు, ఎఐపిడీఎస్, ఎఐఎస్బి, ఎఐడిఎస్ఒ , ఎఐపిఎస్యూ ఆధ్వర్యంలో శుక్రవారం వరంగల్ ఓంకార్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, ల్యాదెళ్ల శరత్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చుక్క ప్రశాంత్, యారా ప్రశాంత్‌రెడ్డి, పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు అలువాల నరేష్, జిల్లా సహాయ కార్యదర్శి సాయి, రాజేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కొమ్ముక రవి, ఎఐపిడిఎస్ జిల్లా కార్యదర్శి మార్త నాగరాజు, ఎఐఎస్బి నాయకులు సూర్య తేజ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యం లో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రయివేటు, కార్పొరేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని, ఖాళీగా ఉన్న టీచర్, ఎంఇఒ, డిఇఒ పోస్టులను భర్తీ చేయాలని, ఇంటర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డి మాండ్ చేశారు. సమావేశంలో విద్యార్థి సం ఘాల నాయకులు పోలబోయిన రాజు, చెరుకు రాజేష్, డి.వినయ్, రాంబాబు మధు తదితరులు పాల్గొన్నారు.

**నిర్మల్ రూరల్ :** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడిని అరికట్టాలని, విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలు, జూనియర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రకటించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఐబిలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ కైలాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయివేటు, కార్పొరేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువస్తామని చెప్పి తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రభుత్వ, కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలల, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు సింగారి వెంకటేష్, రాహుల్, సిహెచ్ దిగంబర్, పరమేశ్వర్ భరత్, నవీన్‌రాజ్‌రత్నం పాల్గొన్నారు.

**హనుమకొండ టౌన్ :** విద్యారంగ సమస్యలు పరిష్కరించకుంటే ప్రజా ప్రతినిధుల ఇండ్లు ముట్టడిస్తామని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ కూడలి వద్ద శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు స్టాలిన్, పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి రాచకొండ రంజిత్, పిడిఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష, జిల్లా కార్యదర్శి మర్రి మహేష్, ఎఐఎస్బి జిల్లా నాయకులు ఎస్డీ ఫుర్కన్, ఏఐఎఫ్ డిఎస్ రాష్ట్ర కన్వీనర్ మాస్ సావిత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తున్నదని, రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల ప్రారంభమై రెండునెలలు గడుస్తున్నా కనీస మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. వర్షం కురిస్తే చాలావరకు హాస్టల్ భవనాలు, పాఠశాల భవనాలు నాని కూలిపోయే ప్రమాదం ఉందని వాటిని వెంటనే కూల్చివేసి నూతన భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు ఇవ్వాలని, విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్స్ చార్జీలను పెంచాలని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలను కట్టడి చేయాలని, ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని, అనుమతి లేని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 23 జరిగే విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బొజ్జ జ్యోతి, విద్యార్థి నాయకులు సిపతి వినయ్, సాయి, అవినాష్ కావ్య, గణేష్, వినయ్, వంశీ, ఓరుగంటి హరీష్ బుర్ర సంపత్ పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్ :** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 23న జరిగే విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని ఎఐఎస్‌ఎఫ్, పిడిఎస్‌యు, ఎస్‌ఎఫ్‌ఐ సంఘాల అధ్వర్యంలో సురవరం వెంకటరమణ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్, పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారాం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ ఫీజు బకాయలు విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. విద్యాసంస్థల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. 23న విద్యాసంస్థల బంద్‌కు విద్యాసంస్థల యజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు రమేష్, సాయి, శేఖర్, సాయి, జీవన్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.










# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఘనంగా మండేలా జయంతి



ప్రజాపక్షం/బిజినేపల్లి : మహాత్ముడు మండేలా, దక్షిణాఫ్రికా జాతిపిత మండేలా, నల్లసూర్యుడు మండేలా, నోబెల్ శాంతిదూత మండేలా, భారత రత్న మండేలా, ప్రపంచ స్ఫూర్తిప్రధాత మండేలా జయంతిని మండలపరిధి లోని గంగారం ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలకృష్ణారెడ్డి, మహనీయుల స్ఫూర్తి వేదిక రాష్ట్రచైర్మన్ ప్రజా వాగ్గేయకారుడు రాజారాం ప్రకాష్ మాట్లాడుతూ దక్షిణాఫ్రికాలో శతాబ్దాలుగా కొనసాగిన జాతి వివక్షతకు వ్యతిరేకంగా ఉద్యమించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహ్మద్, అశోక్‌కుమార్, కొమురయ్య, శ్రీకాంత్‌రెడ్డి, ఊర్మిళ, విద్యార్థులు పాల్గొన్నారు.

## గురజాల పాఠశాలను తనిఖీ చేసిన మండల విద్యాధికారి నిజాముద్దీన్



ప్రజాపక్షం/కృష్ణ: మండల పరిధిలోని గురజాల ప్రాథమిక పాఠశాలను మండల విద్యాధికారి నిజాముద్దీన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కిషోర్ తో కలిసి తనిఖీ చేయడం జరిగింది. తనిఖీలో భాగంగా విద్యార్థులతో అతిధిని అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి, అదే విధంగా విద్యార్థులచే పాఠ్యాంశాలను చదివించడం జరిగింది. తరువాత విద్యార్థులతో కలిసి భోజనం చేసి భోజనం నాణ్యతను మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగాధర్, ఉపాధ్యాయురాలు కుర్సింగా తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి శ్రీహరికి ధన్యవాదాలు తెలిపిన అంబేద్కర్ సంఘం




ప్రజాపక్షం/నర్వ: గత 20 సంవత్సరాలుగా పెండింగులో ఉన్న నర్వ మండల కేంద్రంలోని అంబేద్కర్ నగర్‌లో ఉన్న ప్లాట్ నెంబర్ 1 సమస్యను పరిష్కరించి ఎస్సి కమ్యూనిటీకి ప్లాట్ పత్రాలను క్రీడా యువజన శాఖ మంత్రి డాక్టర్ శ్రీహరి చేతుల మీదుగా ఇప్పించినందుకు గ్రామ అంబేద్కర్ సంఘం ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమం నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమస్య పరిష్కారానికి మండలంలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులందరూ సహకరించి పరిష్కరించినందుకు సహాయం చేసిన వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విలేకరులు ఎం.ఆంజనేయులు, బాలరాజు, నర్వ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు అంబేద్కర్ యువజన సంఘం, యంఆర్‌పిఎస్ యువజనులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి



ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా: మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణని పెద్దపోర్ల గ్రామ ఎంపీటీసీ శివప్ప, బూత్ అధ్యక్షుడు వెంకటేశ్, యువ నాయకుడు శివకుమార్ గౌడ్ వారి స్వగృహంలో మహబూబ్‌నగర్ కలిసి గ్రామంలో ఉన్నటువంటి సమస్యలు సిసి రోడ్ల నిర్మాణం, చిన్న పొర్లు వెళ్లే రహదారి, జిర్కల్లి, ఎర్గట్లపల్లి, ఊట్కూరుకు వెళ్లే రహదారిని మరమ్మత్తు చెయ్యాలని అలాగే గ్రామంలో 6 హైమాస్ట్ లైటలను సమకూర్చాలని వినతి పత్రం ఇచ్చారు. ఎంపీ సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.

## జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు మాగనూరు విద్యార్థులు ఎంపిక



ప్రజాపక్షం/మాగనూరు : ఈనెల 13న ఉమ్మడి జిల్లా స్థాయి ఉమెన్స్ సైక్లింగ్ పోటీలు మక్తల్‌లో సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాగనూరు విద్యార్థులు పి.శ్రావణి (10వ తరగతి), డి.అఖిల (10వ తరగతి) చక్కటి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి సైకిల్ పోటీలకు ఎంపికయ్యారని ఫిజికల్ డైరెక్టర్ పిడి రాకేష్ శర్మ తెలిపారు. ఎంపికైనటువంటి విద్యార్థులను రాకేష్ శర్మ పిడిను క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా సన్మానించి జాతీయ స్థాయిలో కూడా రాణించాలని అభినందించారు. ఎంపిక అయిన క్రీడాకారులు ఈనెల 20న హైదరాబాద్‌లో జరిగే జాతీయస్థాయిలో ఉమెన్స్ సైక్లింగ్ పోటీలలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, పాఠశాల ఇంచార్జి హెడ్‌మాస్టర్ బాబు రెడ్డి, ఉపాధ్యాయులు వెంకట్రాములు, ఓబయ్య, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.


## బాలికలకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేత



ప్రజాపక్షం/మక్తల్ : సైకిలింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు, నారాయణపేట జిల్లా సైకిలింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఆధ్వర్యంలో ఈనెల 13న మక్తల్లో నిర్వహించిన, జిల్లా స్థాయి లో ఇండియా ఉమెన్స్ రోడ్డు స్పీడ్ సైకిలింగ్ 5 కిలోమీటర్ల పోటీలలో మక్తల్ మండల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కర్ని 8 మంది బాలికలు పాల్గొని, క్రీడా ప్రతిభను చాటి ఈడిగి రోషిని 3వ స్థానం, కే. శివాని 7వ స్థానం, ప్రవళిక 10వ స్థానం, అలాగే అర్చన, మల్లేశ్వరి, రాధిక, శరణ్య, రేవతి కె లో ఇండియా సౌత్ జోన్ ఉమెన్స్ సైకిలింగ్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పిడి బి.రూప విలేకరుల సమావేశంలో తెలిపారు. ఖేలో ఇండియా సౌత్ జోన్ సైకిలింగ్ పోటీలకు ఎంపికైన బాలికలకు నారాయణపేట జిల్లా సైకిలింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం ఈనెల 18న కర్ని పాఠశాలలో బాలికలకు మెడల్స్, సర్టిఫికెట్స్ అందజేసి అలాగే పిడి బి.రూపను ఘనంగా సన్మానించి అభినందించారు. పాఠశాల పిడి బి.రూప మాట్లాడుతూ పోటీలకు ఎంపికైన బాలికలు ఈనెల 20న హైదరాబాద్ బండ్లగూడ నాగోల్‌లో జరుగు జాతీయ స్థాయి సైకిలింగ్ పోటీలలో పాల్గొంటారని ఆమె తెలిపారు. సైకిలింగ్ పోటీలకు ఎంపికైన బాలికలను, అందుకు కృషి చేసిన పిడి బి.రూపను పాఠశాల జిహెచ్ ఎం.వెంకటయ్య, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, గ్రామ పెద్దలు అభినందించారు.

## కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేస్తాం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందిరా మహిళా శక్తి సంబరాలు మహబూబ్‌నగర్ పట్టణంలోని శిల్పారామంలో వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇందిరా మహిళా శక్తి సంబరాలలో విజయోత్సవాలలో తాను పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. మహిళలను నిలబెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చారని, ఒక అన్నగా అండగా నిలిచి మీ అభ్యున్నతికి కృషి చేస్తారన్నారు. ముఖ్యమంత్రి పదవి బాధ్యతలు చేపట్టిన మూడు రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారన్నారు. బిసి విద్యార్థుల కోసం హాస్టల్ ఏర్పాటు కోసం మహిళా సంఘాల సభ్యులకు ఎకరం భూమి కేటాయించాలని జిల్లా కలెక్టర్‌ని కోరారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు కోటి 67 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాలు అందజేశారు. బ్యాంకులో ద్వారా 7 కోట్ల 90 లక్షల రూపాయల విలువైన రుణాలను అందజేశారు. ప్రమాదవశాత్తు మరణించిన ఇద్దరు మహిళ సంఘ సభ్యుల కుటుంబ సభ్యులకు 10 లక్షల చొప్పున ఇరు కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం వివిధ మహిళా సమాఖ్య, సంఘాలకు చెందిన విజయవంతమైన మహిళలు లహరి, అనిత, వరలక్ష్మి, హేమలత, ఇర్ఫానా బేగం లను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అనంతరం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్‌ను జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మధుసూదన్‌రెడ్డి, డిఆర్డిఎ పిడి నరసింహులు, డిఆర్డిఓ అదనపు పిడి శారద, సెర్ప్ డైరెక్టర్ కాశీ విశ్వేశ్వరయ్య, మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖద్రి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ మహిళా సమాఖ్య సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు



ప్రజాపక్షం/నారాయణపేట్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడ్డాక ప్రతి పేద వాడికి ఇల్లు ఉండాలన్న ఉద్దేశంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో, నారాయణపేట ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికరెడ్డి నేతృత్వంలో నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరయ్యాయి. గత పది ఏండ్లు ఒక్కటి అంటే ఒకటి ఇల్లు మంజూరు చేయకుండా ప్రజలకు ఇబ్బందికి గురి చేస్తే, ప్రజా ప్రభుత్వంలో 3500 ఇండ్లు మంజూరు చేశారు. అందులో భాగంగా నారాయణ పేట మండలం బాజాపూర్ గ్రామంలో 53 ఇండ్లు మంజూరు కావడం జరిగింది. ఇండ్లకు భూమి పూజ చేసి నిర్మాణం ప్రారంభించారు. వాటిలో బేస్మెంట్ నిర్మాణం పూర్తి అయిన రెండు ఇండ్లకు లబ్ధిదారుల ఖాతాల్లో లక్ష రూపాయల డబ్బులు జమ అయ్యాయి. నారాయణ పేట నియోజకవర్గంలో జాజాపూర్ గ్రామంలోని మొదటి బిల్లులు మంజూరు అయ్యాయి. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణిక రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి కుంభం శివకుమార్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట్ల రవీందర్ రెడ్డి, ఆలుగడ్డ కాంతు కుమార్, నీలి రాములు, నవీన్ గౌడ్, ఆలుగడ్డ రవి, బాలగారి నర్సిములు, వడ్ల గోవిందు, శేషప్ప, వెంకటేష్, శ్రీధర్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## కోయిల్‌సాగర్ ప్రాజెక్ట్, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణపై సమీక్ష

కలెక్టర్ విజయేందిర బోయి



ప్రజాపక్షం/ మహబూబ్‌నగర్ : కోయిల్ సాగర్ ప్రాజెక్ట్, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ భూ సేకరణ పనులపై జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సమీక్షించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని విసి కాన్ఫరెన్స్‌హాల్‌లో రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ సంబంధించి రెవెన్యూ, ఇరిగేషన్ భూ సేకరణ సంబంధించి రికార్డులను వెరిఫై చేసి సమగ్రమైన నివేదికలతో వచ్చే సమావేశానికి హాజరుకావాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కోసం భూసేకరణ ఎంత వరకు వచ్చిందని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టుకు కావలసిన స్థలాన్ని పెగ్ మార్కింగ్ చేస్తూ సబ్ డివిజన్ సర్వే సర్వేయర్ల ద్వారా త్వరితగతిన పూర్తి చేయాలని అందుకు మిడ్జిల్ తహసీల్దార్ సహకరించాలని అన్నారు. ఈనెల 30లోపు నివేదికలను సమర్పించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ ఎ.నరసింహా రెడ్డి, ఆర్డీవో నవీన్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సర్వే లాండ్ రికార్డు ఏ.డి. కిషన్ రావు, దేవరకద్ర, సి.సి. కుంట, కౌకుంట్ల, మిడ్జిల్ తహసిల్దార్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల నుండి అప్రమత్తంగా ఉండాలి



ఎఎస్ఐ సురేందర్ బాబు

ప్రజాపక్షం/కృష్ణ: కృష్ణ మండలం శుక్రవారం టై రోడ్డు జంక్షన్ వద్ద ప్రజలకు ఎఎస్ఐ సురేందర్ బాబు ఆధ్వర్యంలో కృష్ణ పోలీసులు పలు సామాజిక అంశాలైన మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. సైబర్ నేరాలు, దొంగతనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వాహనదారులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్ఐ సురేందర్ బాబు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మత్తుపదార్థాల వినియోగం యువతలో పెరుగుతుంది. ఇది వారి శారీరక మానసిక ఆరోగ్యాన్ని హాని చేస్తుంది. మత్తు పదార్థాల వ్యసనం కారణంగా కుటుంబం ఉద్యోగం భవిష్యత్తు అన్నింటి మీద ప్రభావం పడుతుంది. కావున ప్రజలు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని, గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిస కారాదని ఒకసారి అలవాటైతే అది వ్యసనంగా మారుతుందని, అలాంటి వాటి జోలికి వెళ్లకుండా ఉండాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని మార్కెట్‌కి వచ్చి పోయేటప్పుడు ఏమరపాటుగా ఉంటే మనకు తెలియకుండానే దొంగతనాలు చేస్తున్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వాహనదారులు మద్యపానం సేవించి వాహనాలు నడపరాదని ప్రతి ఇంట్లో పెద్ద పెద్దవాళ్లకు పిల్లలకు చెప్పాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదానికి గురై అవకాశం ఉంటుందని, జాగ్రత్తగా వచ్చే వారి వాహనాలకు కూడా రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణ పోలీసులు, ప్రజలు, వాహనదారులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్, బిజెపిల నుండి కాంగ్రెస్‌లోకి భారీ చేరికలు



ప్రజాపక్షం/అడ్డాకుల: అడ్డాకుల పట్టణ కేంద్రానికి చెందిన బిజెపి మండల మాజీ అధ్యక్షుడు బుచ్చన్న యాదవ్, బిజెపి యువ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేశ్ యాదవ్‌తో పాటు పెద్ద ఎత్తున బిజెపి నాయకులు, కార్యకర్తలు, బిఆర్ఎస్ నాయకులు టంకరి వెంకటేశ్, గొల్ల మన్నెంకొండ సునీల్, రత్నం, యాకోబు, వీరేష్, వెంకటేశ్ యాదవ్, గొల్లబాబు, రాములు యాదవ్ తో పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి సంక్షేమ పథకాలు, ముఖ్యంగా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ దేవరకద్ర నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తూ, ఎన్నో ప్రతిష్టాపకమైన సంస్థలను దేవరకద్ర నియోజకవర్గంలో స్థాపిస్తూ 18 నెలల కాలంలోనే నియోజకవర్గానికి రూ.500 కోట్లు నిధులు మంజూరు చేయించి, నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న దేవరకద్ర ఎమ్మెల్యే నాయకత్వాన్ని మెచ్చి, కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు.

## సిఎం సభకు కాంగ్రెస్ శ్రేణులు



ప్రజాపక్షం/వీపనగండ్ల : నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవల్లి మండల పరిధిలోని జటప్రోలులో రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పర్యటన విజయవంతం చేయటానికి మండల పరిధిలోని గ్రామాల నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గంలోని జటప్రోలు గ్రామంలో సుమారు 200 కోట్ల రూపాయలతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు శంకుస్థాపన చేయటంతో పాటు నియోజకవర్గ పరిధిలోని మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలువురు మంత్రులు పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోదల బీరయ్య, వనపర్తి జిల్లా ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షులు ఇంద్రకంటి వెంకటేష్ , పాన్‌గల్ సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నారాయణరెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఎత్తం కృష్ణయ్య, రవీందర్ రెడ్డి, బస్వరాజ్ గౌడ్, గోపీ, మహేష్ నాయుడు, చక్ర వెంకటేష్, గోపాల్ నాయక్, చిన్నారెడ్డి తదితర నాయకుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సభకు మండలంలోని గ్రామాల నుంచి వాహనాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, అభిమానులు భారీగా తరలివెళ్లారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ ముఖ్యమంత్రి సభ విజయవంతం కావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోషం వ్యక్తం చేశారు.

## గణితంపై పట్టు సాధిస్తే సత్ఫలితాలు



కలెక్టర్ ఆదర్శ్ సురభి

ప్రజాపక్షం/పెబ్బేరు : విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా ఏర్పర్చుకొని అందుకు అనుగుణంగా మంచి ఫలితాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. శుక్రవారం కలెక్టర్ పెబ్బేరు మండలంలోని జడ్పిహెచ్ఎస్ బాలుర పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్, గణితంపై పట్టు సాధించేందుకు సులభమైన ఫార్ములాలు, స్మార్ట్ ట్రిక్స్ నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలను స్పష్టంగా ఏర్పర్చుకొని మంచి ఫలితాలను సాధించాలని ప్రోత్సహించారు. విద్యాధికారులకు పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు అనుకూలమైన , ఆకర్షణీయమైన పాఠశాల వాతావరణం కల్పించాలన్నారు. పెబ్బేరులోని వెనుకబడిన కులాల బాలుర వసతి గృహాన్ని సందర్శించి కలెక్టర్ అక్కడ మౌలిక వసతులను, విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వసతి గృహంలో అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, తహసీల్దార్ మురళి, ఇంచార్జ్ ఎంపీడీఓ రోజా, ఏఎంఓ మహనంది, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## అత్యవసర శస్త్రచికిత్సతో ప్రాణాలు కాపాడిన వైద్య బృందం

ప్రజాపక్షం/నారాయణపేట్: అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించిన యశోద కేర్ వైద్య బృందం ప్రాణాలు కాపాడారు. నారాయణపేట పట్టణంలో ఈ నెల 17న రాత్రి 11:30 ప్రాంతంలో ఒక వివాహితని ప్రాణాపాయస్థితిలో తీసుకు వచ్చారు. వైద్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట మండలంలోని లింగంపల్లి పిల్లిగుండ్ల తండాకు చెందిన వివాహిత తీవ్ర రక్తహీనత వల్ల షాక్ (హై పోవోలెమిక్ షాక్)కు లోనైనది. ఆమె రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయి కేవలం 5.6 గ్రాములు మాత్రమే ఉండటాన్ని వైద్యులు గుర్తించారు. మొదట అబ్డొమెన్, పెల్విస్ అల్ట్రాసౌండ్ పరీక్ష నిర్వహించిన (యుఎస్‌జి) ద్వారా లోపలి నుంచి రక్తస్రావం రావటన్ని గమనించారు. వెంటనే సీఈసీటీ స్కాన్ చేసి పరిశీలించారు. ట్యూబెక్టమి ఆపరేషన్ ఫెయిలైయి, విస్ఫోటనం చెందిన ఎక్టోపిక్ గర్భధారణ,, దాదాపు 11.12 సెం.మీ. పరిమాణంలో పేగులలో రక్తం (హిమోపెరిటోనియం) ఉన్నట్టు తేలింది. దీంతో వైద్యులు తక్షణమే ఆమెను శస్త్రచికిత్స గదికి తరలించి, అత్యవసరంగా విదారిత గర్భధారణ తొలగింపు శస్త్రచికిత్స (ఎక్స్‌ప్లోరేటరీ లాపరోటమీ)తో పాటు ఎడమ ఫలాపు, గర్భాశయ నాళం తొలగింపు (ఎక్స్ ప్లోరేటరీ లాపరోటమీతో పాటు ఎడమ ఫలాపు మరియు గర్భాశయ నాళం తొలగింపు సాల్పింగో ఓఫరెక్టమీ చేశారు. ఈ శస్త్రచికిత్స ద్వారా లోపలి రక్తస్రావాన్ని నియంత్రించారు. దీంతో ఆ వివాహిత మహిళ ప్రాణపాయ పరిస్థితి నుండి పూర్తిగా కోలుకుంటుందని వైద్యులు తెలిపారు. ఈ అత్యవసర శస్త్రచికిత్సను డా.ప్రీతి రెడ్డి ఎంబిబిఎస్, ఎంఎస్, స్త్రీరోగ నిపుణురాలు డా.భరద్వాజ్, ఎండీ నిర్వహించారు. దీంతో వివాహిత కుటుంబ సభ్యులు వైద్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


## రైతులపట్ల వివక్ష చూపిస్తే సహించం



మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

ప్రజాపక్షం/మక్తల్ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల వివక్ష చూపిస్తే సహించే ప్రసక్తే లేదని మక్తల్ మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో, యూరియాకొరతకు నిరసనగా నిర్వహించిన ధర్నా కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులను నిలువుగా మోసం చేసిందని ఎద్దేవ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఆంధ్ర ముఖ్యమంత్రి చంద్రబాబుతో కుమ్మక్కై రైతులను కష్టాల పాలు చేయడం జరుగుతుందని అన్నారు. గత కేసిఆర్ ప్రభుత్వ హయాంలో ఎప్పుడైనా రైతులకు ఏదైనా ఇబ్బంది కలిగిందా అని అన్నారు. అదృష్టవశాత్తు మంత్రి పదవి పొందిన మీరు ఈ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం నిస్వార్థంగా పనిచేస్తే దానికి ఎప్పటికీ మేము మద్దతు ఇస్తామని తెలిపారు. నియోజకవర్గం ఏదైనా అభివృద్ధి సాధించిందంటే అది చిట్టెం కుటుంబం ద్వారా సాధ్యమైంది అనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు, రాజుల అసిరెడ్డి, మక్తల్ పట్టణ పార్టీ అధ్యక్షుడు చిన్న అనుమంతు సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కే. ఎల్లారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, శివరాజ్ పటేల్, మాజీ జెడ్పిటిసి అరవిందు, సుధాకర్, కొత్త కాపు గోవర్ధన్ రెడ్డి, దండు అయ్యప్ప సాయిలే గౌడ్, శివప్ప, శంకర్ అన్వర్, హుస్సేన్, చందాపురం అశోక్ గౌడ్, జుట్ల శంకర్, బండారి ఆనందు, జుట్ల సాగర్, బెల్లం శ్రీనివాసులు, కర్ని నారాయణ రెడ్డి, మారుతి గౌడు, వసంత్ గౌడ్, రామకృష్ణా రెడ్డి, సంగమండ శ్రీనివాస్ రెడ్డి, సత్యరెడ్డి, శంకర్ రెడ్డి, మహమూద్ మనన్, కె.ఆంజనేయులు, అశోక్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, పవన్ కుమార్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



ప్రజాపక్షం/వెల్దండ : మండల పరిధిలోని అజిలాపూర్ గ్రామానికి చెందిన రేవల్లి లచ్చయ్య అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. ఈవిషయాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకుల ద్వారా తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, మిషన్‌భగీరథ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పల వెంకటేష్ మృతురాలి కుటుంబానికి తక్షణసాయంగా కొంత నగదును అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సిద్ధగొని రమేష్‌గౌడ్, సిద్ధగొని పరమేష్‌గౌడ్, కేశమోనిలింగంగౌడ్, కేశమోనిశంకర్‌గౌడ్, గుడిగంటి నిరంజన్, జంగయ్య, మహేష్ పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## రామకృష్ణను పరామర్శించిన ఎమ్మెల్సీ



ప్రజాపక్షం/యాదాద్రిః రోడ్డు ప్రమాదానికి గురైన డిప్యూటీ సీఎం పీఆర్వో రామకృష్ణని శుక్రవారం శాసనమండలి సభ్యులు, సిపిఐ నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి నెల్లికంటి సత్యం యాదగిరిగుట్టలోని ఆయన నివాసంలో కలిసి పరామర్శించారు. ఆయన వెంట యాదాద్రి సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు యానాల దామోదర్ రెడ్డి, బోలగాని సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, మండల కార్యదర్శులు గాదగాని మాణిక్యం, చిగుళ్ల లింగం ఉన్నారు.



## గత ప్రభుత్వం రేషన్‌కార్డులివ్వలేదు

ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/కోదాడ:** అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్‌కార్డులు ఇస్తామని ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ లు అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని శ్రీరంగాపురం రోడ్డులో గల దేగబాబు ఫంక్షన్ హల్‌లో నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూర్యాపేట జిల్లాలోనే సన్నబియ్యం పథకం ప్రారంభం, నూతన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమం సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ జిల్లాలోనే జరిపించారని అన్నారు. కోదాడ డివిజన్‌లోని ఆరు మండలాల్లోని కోదాడ, చిలుకూరు, అనంతగిరి, మునగాల, నడిగూడెం, మోతె మండలాల్లోని 174 చౌక దుకాణాలలో సన్న బియ్యం పంపిణీ జరుగుతుందని, కోదాడ డివిజన్‌లో నూతన రేషన్‌కార్డులు 4171 కార్డులు అర్హులైన పేదవారికి రావడం జరిగిందని, కొత్త కుటుంబ సభ్యుల పేర్ల నమోదు అయినవి 9201 వచ్చినవని కలెక్టర్ తెలిపారు. ప్రజా పాలన, మీసేవ కేంద్రాలలో వచ్చిన దరఖాస్తులను విచారణ జరిపి అర్హులైన వారికి ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి మా ట్లాడుతూ గత ఏ ప్రభుత్వం రేషన్‌కార్డులు ఇవ్వలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఆర్డీవో సూర్యానారాయణ, తహసిల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు శాస్త్రీయ రంగాలలో సైన్స్ దృక్పథం అలవర్చాలి

గూడూర్ ఉన్నత పాఠశాల సందర్శించిన రాష్ట్ర విద్యా కమిషనర్ చైర్మన్ ఆకునూరి మురళి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషనర్ చైర్మన్ ఆకునూరు మురళి శుక్రవారం పాఠశాలను సందర్శించి ఇంటిగ్రేటెడ్ లైబ్రరీని పరిశీలించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ కృత్యాలు ప్రయోగాలు వర్చువల్ రియాల్టీ ప్రదర్శలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో లైబ్రరీ సైన్స్ ల్యాబ్ వర్చువల్ రియాల్టీ లాంటి సౌకర్యాలను కల్పించి విద్యార్థులను శాస్త్రీయ రంగాలలో సైన్స్ దృక్పదం అలవర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కే.సత్యనారాయణ, రాష్ట్ర విద్యా కమిషన్ సలహాదారులు ఆర్.వెంకట్ రెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వెంకట్ రెడ్డి, తెలంగాణ డెవలప్మెంట్ పోరం ప్రతినిధులు గోన రెడ్డి ప్రీతి రెడ్డి, గూడూరు చిన్న నారాయణరెడ్డి, ట్రస్ట్ ప్రతినిధులు అరుణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.బాల్రెడ్డి పాల్గొన్నారు.

## పరిశుభ్రత విషయంలో రాజీపడేది లేదు




**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** పరిశుభ్రత విషయంలో రాజీపడే సమస్య ఉండదని మున్సిపల్ కమిషనర్ సిహెచ్ హన్మంతరెడ్డి అన్నారు. శుక్రవారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా 41వ వార్డులో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వీధి, ప్రతి కాలనీ శుభ్రంగా ఉండేలా అధికారులను కట్టుదిట్టంగా నియమించి చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. వార్డులో డ్రైనేజీ, తాగునీటి సరఫరా, దోమల ఉధృతి వంటి అంశాలపై ప్రజలు వ్యక్తం చేసిన అభిప్రాయాలను పరిశీలిస్తున్నామని అన్నారు. ప్రజల సమన్వయంతో సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా మున్సిపాలిటి ముందడుగు వేస్తుందని అన్నారు. వార్డు ప్రజలు తమ ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తమ చెత్తను తడి, పోడి చెత్తగా వేరు చేసి ఇళ్ల ముందుకు వచ్చే మున్సిపల్ వాహనాలకు అందించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ డిఈ సత్యారావు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ షఫి ఉల్లా, అయూబ్‌ఖాన్, కుమ్మరికుంట్ల లింగయ్య, ఎఇ తిరుమల్లయ్య, వార్డు అధికారి శ్వేత, శివప్రసాద్ పాల్గొన్నారు.

## ఆశావహులకు రిజర్వేషన్లు కలిసొచ్చేనా..?

ఎన్నికల నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు




**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలో ఎంపిటిసి జడ్పిటిసి సర్పంచులకు పదవి కాలం సర్పంచులకు 2024 ఫిబ్రవరికి జడ్పిటిసి ఎంపిటిసి లకు 2024 జూలైలో పదవి కాలం ముగిసింది దీంతో గ్రామాలకు అప్పటి నుండి ఇప్పటివరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుంది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల ఎంపిటిసిల పదవి కాలం ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహించకుండా సంవత్సరం పాటు అధికారుల పాలన కొనసాగిస్తుంది. రాష్ట్రంలో సెప్టెంబర్ నెల కల్లా స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కోర్టు తీర్పు ఇవ్వడంతో మండలంలో సర్పంచులకు ఎంపిటిసిలకు స్థానాలకు పోటీ చేసే రాజకీయ నాయకులు ఓటర్లను కుల సంఘాల నాయకులను ఊర్లలో ఉండే పెద్ద మనుషులను ఈసారి నాకు సపోర్ట్ చేయాలని నన్ను గెలిపించాలని మచ్చిక చేసుకుంటున్నారు. అందులో భాగంగా గత ఎన్నికల్లో ఓడిపోయిన అభ్యర్థులు ఈసారి నన్ను గెలిపించాలని గెలిచిన అభ్యర్థులు ఊరిని అభివృద్ధి చేశానని మరోసారి నాకు అవకాశం కల్పించాలని గతంలో పోటీ చేసేందుకు రిజర్వేషన్లు అనుకూలించని నాయకులు కొత్తగా పోటీ చేసే నాయకులు కూడా మాకు సపోర్ట్ చేయాలని ఓటర్లను వేడుకుంటున్నారు.రేపో మాపో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని ఆశతో ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. ఆ తర్వాత ఆయా గ్రామాలకు వచ్చే రిజర్వేషన్లతో ఆశావాకులకు అవకాశం కలిసి వచ్చేనా వేసి చూడాల్సిందే.

# అర్హులకు కొత్త రేషన్ కార్డులు

ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యుడు బీర్ల ఐలయ్య

పేదవాడు కడుపు నిండా అన్నం తినాలనే సంకల్పంతో సన్నబియ్యం పంపిణీ




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట :** అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డు ఇవ్వడం జరుగుతుందని, ఇది నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం ఆలేరు నియోజకవర్గ స్థాయిలో యాదగిరిగుట్ట మండల కేంద్రంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఫంక్షన్ హాల్ నందు అహార భద్రత కొత్త రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ , ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ప్రజా పాలనలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఆలేరు నియోజకవర్గంలో కొత్తగా 5,600 రేషన్ కార్డులు మంజూరీ చేయడం జరిగిందని, 15,632 యూనిట్లు మొత్తం 18,640 మంది సుమారు ఆలేరు నియోజకవర్గంలోనే 36 వేల మందికి 6 కిలోల చొప్పున తెల్ల రేషన్ కార్డు ద్వారా సన్న బియ్యం ఇచ్చే కార్యక్రమం ప్రజా ప్రభుత్వం చేపట్టిందన్నారు. గత ప్రభుత్వంలో దొడ్డు బియ్యంతో పేదవారు అన్నం తినకుండా బియ్యం దళారులకు అమ్ముకునేవారు. ఈ ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి గొప్ప ఆలోచన మేరకు పేదవారు కడుపునిండా అన్నం తినాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి ఏ బియ్యం తింటున్నారో అదే బియ్యం ప్రతి పేదవారు సన్న బియ్యంతో కడుపునిండా తినాలని గొప్ప కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. పేదవారి సొంతింటి కల నెరవేర్చేందుకు అర్హులైన ప్రతి లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. రైతులకు, మహిళలకు ప్రభుత్వం పెద్దపీట వేసి కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్నదే ముఖ్యమంత్రి ఆలోచన అని అన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు జమ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రతి సంక్షేమ పథకంలో మహిళలను భాగస్వామ్యం చేస్తుందన్నారు.అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మహిళలు కాంట్రాక్టర్ గా మారి నిర్మాణాలు చేపట్టారన్నారు. గత ప్రభుత్వంలో కొత్తగా పెళ్లయిన, పిల్లలు పుట్టిన వారిని రేషన్ కార్డులు చేర్చాలంటే అనుమతించలేదని ఈ ప్రభుత్వం వచ్చినాక రేషన్ కార్డులో లబ్ధిదారులు నమోదుకు నిరంతర ప్రక్రియగా చేపట్టామన్నారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ఒక పండుగ వాతావరణంలో అమలవుతున్నాయన్నారు. జిల్లాలో 1/4 శాతం ఆలేరు నియోజకవర్గ లబ్ధిదారులకే కొత్త రేషన్ కార్డులు మంజూరు అయ్యాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఎవరైతే తొందరగా పూర్తి చేసి గృహప్రవేశాలు చేపడుతారో వారికి ఆలేరు శాసనసభ్యులు నూతన వస్త్రాలు గొర్రె పొట్టేలు అందించడం ఎంతో అభినందనీయం అని అందుకు ప్రతి ఒక్కరు వారికి కృతజ్ఞతలు తెలుపాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, మదర్ డైరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ఆలేరు, మోత్కూరు మార్కెట్ కమిటీల చైర్మన్‌లు ఐనాల చైతన్య మహేందర్ రెడ్డి, విమల వెంకటేష్, ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఆలేరు నియోజకవర్గం తహసీల్దార్‌లు, ప్రజా ప్రతినిధులు, లబ్ధిదారులు, జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.




## ఔషధ మొక్కలను కాపాడుకుందాం

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఔషద మొక్కలను కాపాడుకుందాం వాటి విలువను తెలుసుకోవాలని రిటైర్డ్ డిప్యూటి రేంజ్ ఆఫీసర్ మహమ్మద్ రఫీయుద్దీన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ ఆధ్వర్యంలో పర్యావరణం పరిరక్షణలో భాగంగా ఔషదవనం, కూరగాయల సాగు, ఇంకుడు గుంత, కంపోస్ట్ పిట్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఔషద మొక్కలు ప్రతి ఒక్కరి ఇంట్లో ఉండాలని, ప్రతి విద్యార్థికి ఔషద మొక్కలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అనంతరం తులసి, అడ్డసారం మొక్కలపై వివరించారు. సిజిఆర్ అడ్మిషన్ ఆఫీసర్ అనుదీప్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఇంకుడు గుంత, కంపోస్టు ఫిట్, ఔషద వనం, కూరగాయల తోటలు ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు గోలి పద్మ, ఉపాధ్యాయులు విశ్వజ్ఞ చారి, సిజిఆర్ జిల్లా కోఆర్డినేటర్ మామిడి శంకరయ్య, కత్తి కోటయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాగర్ ఎడమకాలువకు నీరు విడుదల చేయండి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (గరిడేపల్లి):** వానాకాలం సీజన్ ప్రారంభమై నెలరోజులవుతున్నదని రైతులు నార్లుపోసుకొని నాట్లకు సిద్దంగా ఉన్నారని, అనేక మంది రైతులు వడ్లను ఎదజల్లుకునే పద్ధతిలో వడ్లు చల్లుకుని 20 రోజులవుతున్నదని, అలాగే చాలమంది రైతులు డ్రీమ్‌సీడ్ లాగారని, వారందరూ తడికట్టుకోవడానికి నీళ్లులేక సాగర్ నీటి కోసం ఎదురుచూస్తున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన గరిడేపల్లి మండలంలోని కొండాయిగూడెం గ్రామంలో జరిగిన రైతు సంఘ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులో సరిపోను నీళ్లు ఉండి కూడా ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదని అన్నారు. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. ఎన్నడులేని విధంగా శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా ఉందని, నాగార్జునసాగర్ ప్రాజెక్టు కూడా 560 అడుగుల నీరు వచ్చిన తర్వాత కూడా వ్యవసాయానికి నీళ్లని ఇవ్వటానికి మీనమేషాలు లెక్కించడం సరికాదని అన్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి సాగర్ ఎడమకాలువ ద్వారా పాలేరు జలాశయాన్ని నింపుకొని ఖమ్మం జిల్లా మంత్రులు పాలేరు ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తే సాగర్ ప్రాజెక్టుకు సమీపంలో ఉన్న మేజర్లకు నీటిని విడుదల చేయకపోవడంలో ఉన్న అంతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. ఎడమకాలు ఆయకట్టు పరిధిలోని అన్నిమేజర్లు నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, నాయకులు కుందురు వెంకటరెడ్డి, అంబటి వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, పంగ గోవిందు, బక్కయ్య, ఈదయ్య, నందిపాటి కాశయ్య, ముండ్లకోటయ్య, కర్నే సైదిరెడ్డి, గోవిందరెడ్డి, కేతిరెడ్డి సంజీవరెడ్డి, బంధురామయ్య, ఏసుపాదం, మాతంగి వెంకన్న పాల్గొన్నారు.

## కమ్యూనిస్టుల కలయిక సాధ్యం పడదు

సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ డిమాండ్




**ప్రజాపక్షం/నల్లగొండ:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో నక్సలైట్లను అంతం చేసి గిరిజ,ఆదివాసుల సంపదను కొల్లగొట్టి సంపన్న వర్గలకు ధారదత్తం చేయడం కోసం నక్సలైట్లు చంపుతున్నారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. ఆపరేషన్ వ్యతిరేకంగా రాష్ట్రంలో ఉన్న పది వామపక్ష పార్టీలు ప్రత్యేక కార్యచరణతో ఆందోళన పోరాట కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అయినా కమ్యూనిస్టులో కలయిక సాధ్యపడదని స్పష్టం చేశారు.శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో జరుగుతున్న ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సమావేశానికి విచేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మంత్రులతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో బనకచర్లపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చలు జరిపారని కొన్ని నిర్ణయాలు జరిగాయని ఆంధ్రప్రదేశ్ ఇరిగేషన్ మంత్రి రామానాయుడు ప్రకటన చేసిన నేపథ్యంలో అసలు చర్చలు జరిగాయా లేదా స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత తెలంగాణ ముఖ్యమంత్రిపై ఉందని వెంటనే ప్రజలకు స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యలపై ఆందోళన కార్యచరణ సిద్ధం ఆగస్టు, సెప్టెంబర్ నెలలో గ్రామాలు, బస్తీలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ఆందోళన చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. గ్రామాలకు బస్తీలకు తరలివెళ్లాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జూలకంటి రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, నారి అయిలయ్య, డబ్బికార్ మల్లేష్, బండ శ్రీశైలం, పాలడుగు నాగార్జున పాల్గొన్నారు.

## త్వరగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి




యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ భాస్కరరావు

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణపు పనులు త్వరగా పూర్తి చేసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అన్నారు. శుక్రవారం మండలంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇండ్లు నిర్మాణం పనులు వేగంగా పూర్తి చేసుకోవాలన్నారు. స్లాబ్ దశ పూర్తి అయిన మిగిలి ఉన్న పనులు కూడా పూర్తి చేసుకుంటే వెంటనే డబ్బులు పడతాయని అన్నారు. తొందరగా నిర్మాణాలు పూర్తి అయితే తొందరగా గృహప్రవేశం చేసుకోవచ్చన్నారు. గ్రామంలో ఇసుక, మట్టి అందుబాటులో ఉండేలాచూడాలన్నారు. లబ్ధిదారులకు ఇసుక, మట్టి కొరత లేకుండా సరఫరా చేయాలని తహసిల్దార్, ఎంపీడీవోలను ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ ఇండ్లు త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు. బేస్మెంట్ లెవెల్ పూర్తయిన వారికి ప్రతి సోమవారం వారి ఖాతాలో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం మోటకొండూర్ లోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం పథకం కింద అందిస్తున్న భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం మంచి రుచికరమైన భోజనం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యంపిడిఓ ఇందిర, యంపిఓ చంద్రశేఖర్, హౌసింగ్ ఏఈ రవి చంద్ర, సంబంధిత అధికారులు ఉన్నారు.

## ప్రిపరేషన్‌తోనే పోటీ పరీక్షలు ఉన్నత శిఖరాలు

జిల్లాకలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** కళాశాల స్థాయిలోనే విద్యార్థులు నైపుణ్యత కలిగి పోట పరీక్షలకు సిద్దపడి చదవాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ జూనియర్ కళాశాలను అకస్మికంగా తనిఖీచేసి నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని పరిశీలించి గుత్తేదారులను పనులు త్వరగా పూర్తి చేయాలని, క్వాలిటితో రాజీ పడకుండా ప్రతివారం పనుల పురోగతిపై నివేదిక అందించాలని కలెక్టర్ అన్నారు. బిహర్ నుండి వచ్చిన కూలీ చిన్న పిల్లలను చూసి చిన్న పిల్లలను పనుల వద్దకు తీసుకరావద్దని, వారిని దగ్గరలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌లో చేర్పించాలని ఐసిడిఎస్ సిబ్బందిని అదేశించారు. తదుపరి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం సైన్స్ విద్యార్థుల క్లాసులోకి వెళ్లి సైన్స్‌లో ఎలక్ట్రానిక్స్ సబ్జెక్ట్ మీద క్లాసు తీసుకున్నారు. వనజ అనే విద్యార్థిని లేపి పారడే మొదటిసూత్రాన్ని చెప్పాల్సిందిగా కోరగా విద్యార్థి సమాధానం చెప్పడం వల్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు మోటివేషన్‌పై క్లాస్ తీసుకుని విద్యార్థులు కష్టపడి చదవాలని, ఎదో ఒక రంగంలో నైపుణ్యత సాధించాలని, కష్టపడితే ఫలితం అదే వస్తుందని అందుకు గానూ ప్రతి ఒక్కరు కష్టపడి చదవాలన్నారు. అలా చదువుకోవడం వల్లే మేము కలెక్టర్లం, మున్సిపల్ కమిషనర్లం, ఆర్డీవోలు, తహసిల్దార్లు అయ్యామని మమ్మల్ని ప్రేరణగా భావించి చదువుకోవాలని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, తహసిల్దార్ నాగార్జునరెడ్డి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ గుంటుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నిరంతర జీవనది... నీరు లేక నిర్జీవమైంది

వర్షాభావ పరిస్థితులకు ఒట్టిపోయిన నిరంతర జీవనది...

వాగులో తడి ఆరిన నీరు...

ఆందోళన చెందుతున్న అన్నదాతలు



**ప్రజాపక్షం/ హాలియా:** నిరంతరం నీటి ప్రవాహంతో కళకళలాడే అహల్య వాగు తీవ్ర వర్షభావ పరిస్థితులు నెలకొనడంతో నీరు లేక ఒట్టిపోయింది. ఏళ్ల తరబడి సాగునీటికి, మూగజీవాల గొంతు తడుపుతూ అన్నదాతలకు అన్నివేళలా నిరంధిస్తూ ఈ ప్రాంత ప్రజలకు జీవనదిగా మారింది. అలాంటి అహల్య వాగు సరైన వర్షాలు లేక పోవడంతో ఎండల తీవ్రతకు తడి ఆరి ఎండిపోయింది. దీంతో కొన్ని వందల ఎకరాలకు సాగునీటికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపయోగపడే అహల్య వాగు నేడు వెలవెలబోతుంది. గత మూడు నెలలుగా భారీ వర్షాలు ఏవి లేకపోవడం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో రైతులు వాగు పరిధిలో బోర్లను అధికంగా వినియోగించడంతో వాగు నీరు లేక ఎండిపోయింది. మూగజీవాలకు నీరు దొరకడం కూడా కష్టంగా మారింది. నిరంతరం నీటితో కళకళలాడే వాగు సైతం ఎండిపోయిందంటే వర్షాభావ పరిస్థితులు ఏమైనా ఉన్నాయో ఇట్టే తెలుస్తుంది. ఎడమ కాలువకు నీటి విడుదల ఆలస్యమైన బాగు పరిధిలోని పంట పొలాలకు సాగునీరు అందిస్తూ ఉన్న ఈ వాగు ప్రస్తుతం వర్షాలు లేక ఉన్న నీరు ఇంకిపోయి వర్షాభావ పరిస్థితులకు అద్దం పడుతుంది. ఈ వాగు ఎండిపోవడంతో సుమారు దీని పరిధిలో ఉన్న 200 ఎకరాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సాగునీరు అందే పరిస్థితి లేకపోవడంతో వాగు పరిధిలో సాగుచేసిన పంటలు ఎండిపోతుండడం తో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎడమ కాలువకు నీటి విడుదల జరిగితేనే ఈ వాగులోకి నీరు వచ్చే పరిస్థితి లేకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. లేదంటే వరుణుడు కరుణిస్తే తప్ప అహల్య వాగులో నీటి ప్రవాహం వచ్చే పరిస్థితి నెలకొనడంతో రైతులు ఆకాశం వైపు వరుని కరుణ కోసం ఆశగా ఎదురుచూసే పరిస్థితి నెలకొనడం గమనార్హం.

## తుర్కపల్లిలో వాహనాల తనిఖీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండల కేంద్రంలో శుక్రవారంనాడు డీసిపి ఆకాంక్ష్ యాదవ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీని నిర్వహించారు. తుర్కపల్లి శివారు ఇండియన్ పెట్రోల్ పంప్ సమీపంలో భువనగిరి గజ్వేల్ ఎన్ హెచ్ 161 ప్రధాన రహదారిని నాకబంది చేసి అనుమానాస్పద వాహనాలు, లైసెన్సులు, రిజిస్ట్రేషన్ పత్రాలు సరిగాలేని వాహనాలు తనిఖీ నిర్వహించి వాహనదారులకు పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల, సమాజంలో ఎలాంటి అసాంగిక సంఘటనలు కాపాడే చర్యల్లో భాగంగా నాకాబంది కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏసీబి శ్రీనివాస నాయుడు పాల్గొన్నారు.

# లీల







## 21న 'హరి హర వీరమల్లు' ప్రీ రిలీజ్

పవన్ కళ్యాణ్ హీరోగా నిధి అగర్వాల్ హీరోయిన్‌గా జ్యోతి కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా హరి హర వీరమల్లు. ఏ ఎం రత్నం సమర్పణలో నిర్మించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ఈనెల 21న జరుగనుంది. హైదరాబాద్ లోని శిల్పకళా వేదికలో సాయంత్రం 6గంటలకు ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి పవన్ కళ్యాణ్‌తో పాటు సినిమాలో నటీ నటులు, సాంకేతిక నిపుణులు అందరూ హాజరవుతారు. సెన్సార్ బోర్డు నుంచి యే/ఏ సర్టిఫికెట్ పొందిన ఈ సినిమాను ఈనెల 24న విడుదల చేయనున్నారు. ఎంఎం కీరవాణి ఈ సినిమాకు సంగీతం అందించారు.

### ప్రీ రిలీజ్‌కు అతిథిగా కర్నాటక మంత్రి

హరి హర వీరమల్లు సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరుగనున్న నేపథ్యంలో అతిథిగా హాజరు కావాలని కర్నటక రాష్ట్ర అటవి, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర్ ఖండ్రేను నిర్మాత ఏఎం రత్నం ఆహ్వానించారు. పవన్ కళ్యాణ్ కూడా ఈ కార్యక్రమానికి హాజరవుతున్నారు.



## 'సైమా' ఈవెంట్ డేట్స్ ఫిక్స్..

దక్షిణాది సినిమాలు, అందులో ప్రతిభ కనబరిచిన వారికి ఇచ్చే అవార్డులు 'సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్ 2025' (సైమా). 12 ఎడిషన్లు విజయవంతంగా పూర్తయ్యాయి. ఈ ఏడాది జరగనున్న 13వ 'సైమా' వేడుక తేదీలు ఖరారయ్యాయి. సెప్టెంబరు 5, 6 తేదీల్లో జరగనున్నాయి. దుబాయ్ వేదిక కానుంది. నామినేషన్స్ జాబితాను త్వరలో విడుదల చేయనున్నారు. గత రెండు సంవత్సరాలుగా దుబాయ్‌లోనే వేడుకలు జరిగాయి. 2012లో ఈ వేడుకలు మొదలయ్యాయి. కొవిడ్ కారణంగా 2020లో ఈవెంట్ నిర్వహించలేదు. అత్యధికంగా ఐదు సార్లు దుబాయ్ వేదికైంది. 9వ ఎడిషన్ హైదరాబాద్‌లో జరిగింది.




## సుమతిశతకం పోస్టర్ విడుదల

నటుడు అమీర్ దీప్ హీరోగా చేయాలి చౌదరి హీరోయిన్‌గా తెరకెక్కుతున్న సుమతి శతకం సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించారు. హీరోయిన్ సయాలి జన్మదినం సందర్భంగా హీరోయిన్ విశేష్ చెప్తూ ఆమె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఆమె అందంగా చీర కట్టుకుని ట్రెడిషనల్ లుక్ లో కనిపిస్తోంది. విజన్ మూవీస్ బ్యానర్‌పై ఈ సినిమాను సుభాష్ ఆనంద్, కొమ్మాల పాటి సాయి నిర్మిస్తున్నారు. ఇతర పాత్రల్లో తేజ, మిర్చి కిరణ్, విట్టా మహేష్, బండారు నాయుడు తదితరులు నటిస్తున్నారు.






## 'సార్ మేడమ్' ట్రైలర్ రిలీజ్

తమిళ హీరో విజయ్ సేతుపతి, నిత్యా మేనన్ జంటగా నటిస్తున్న రోమ్ కామ్ ఫ్యామిలీ డ్రామా 'సార్ మేడమ్'. 'ఏ రగ్‌డ్ లవ్ స్టోరీ అనేది ట్యాగ్ లైన్. పాండిరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సత్యజ్యోతి ఫిలిమ్స్ బ్యానర్ పై సెందిల్ త్యాగరాజన్, అర్జున్ త్యాగరాజన్ నిర్మిస్తున్నారు. 'సార్ మేడమ్'. సినిమాకు సంబంధించిన ట్రైలర్ రిలీజ్ చేశారు. 'నాతో వస్తే లైఫ్ ఎలా ఉంటుందో ఆలోచించకుండా నేనే కావాలని వచ్చేశావు. మా అమ్మానాన్నే నన్ను ఇలా చూసుకోలేదని వాళ్ళే తిట్టుకునే విధంగా నిన్ను చూసుకుంటా' అని విజయ్ సేతుపతి డైలాగ్‌తో మొదలైన ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. విజయ్ సేతుపతి, నిత్యామీనన్ మధ్య వచ్చే గొడవలు చాలా వినోదాత్మకంగా ఉన్నాయి. పెళ్లి చూపులు, పెళ్లి లాంటి బ్యూటిఫుల్ ఎమోషన్స్‌తో మొదలైన ట్రైలర్ 'మమ్మల్నిద్దర్నీ విడదీసేయండి' అని నిత్యామీనన్ చెప్పిన డైలాగ్‌తో ఊహించని మలుపు తీసుకోవడం ఇంట్రెస్టింగ్గా ఉంది. పరోటా మాస్టర్‌గా విజయ్ సేతుపతి కనిపించిన సీన్స్ నవ్వులు పూయించాయి. ఈ ఫ్యామిలీ ఎంటర్ టైన్ తో పాటు యాక్షన్ కూడా ఉంది. విజయ్ సేతుపతి మరోసారి తన సహజమైన నటనతో ఆకట్టుకున్నారు. విజయ్ సేతుపతి, నిత్యామీనన్ కెమిస్ట్రీ స్పెషల్ హైలట్‌గా నిలిచిందని దర్శకుడు పాండిరాజ్ తెలిపారు. సంతోష్ నారాయణన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ ఫన్, ఎమోషన్ సీన్స్ మరింతగా ఎలివేట్ చేసింది. డిఓపి ఎం సుకుమార్ అందించిన విజువల్స్ బ్యూటీఫుల్‌గా వున్నాయి. ఈ సినిమా జూలై 25న థియేటర్స్‌లలో దుదల కానుంది.

## నువ్వుంటే చాలే..
### పాట విడుదల

సాగర్ అనే కుర్రాడు మహాలక్ష్మి ని ప్రేమించాడు. ఆమెనే తన ప్రాణం అనుకున్నాడు. కానీ తరువాత ఏం జరిగింది అనేదే ఆంధ్ర కింగ్ తాలుక సినిమా కథ. ఈ సినిమాలోని నువ్వుంటే చెలియ అనే పాటను విడుదల చేశారు. రామ్ సేజ్ రాసిన ఈ సినిమాకు అనిరుధ్ సంగీతం అందిస్తున్నారు. రామ్ పోతినేని హీరోగా, భాగ్యశ్రీ హీరోయిన్‌గా నటిస్తోంది. మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తి కావొచ్చింది.

## నాన్న నీకు ప్రేమతో..
### పాట ఆవిష్కరణ

నివాస్, అమితశ్రీ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'తెలియదు గుర్తు లేదు మర్చిపోయా'. ఈ చిత్రంలో ఇతర కీలక పాత్రల్లో 30 ఇయర్స్ పృథ్వీ, వినోద్ కుమార్, రఘు బాబు, భరద్వాజ్, ఖయ్యూం నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని చెన్నా క్రియేషన్స్ బ్యానర్‌పై శరత్ చెన్నా నిర్మిస్తున్నారు. దర్శకుడు వెంకటేష్ వీరవరపు రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలోని నాన్న నీకు ప్రేమతో అనే పాటను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు వెంకటేశ్ వీరవరపు మాట్లాడుతూ తెలియదు, గుర్తులేదు, మర్చిపోయా సినిమా ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్ టైనర్. ఈ చిత్రంలో పాటలు అందర్నీ ఆకట్టుకుంటాయి. సంగీత దర్శకులు అజయ్ పట్నాయక్ స్వరపరిచిన 'నాన్న నీకు ప్రేమతో' అనే పాటను రిలీజ్ చేయడం జరిగింది. ప్రస్తుతం పోస్ట్ పోస్టులు పనులన్నీ జరుగుతున్నాయి. త్వరలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయడానికి సలహాలు చేస్తున్నాం అని అన్నారు. నిర్మాత శరత్ బాబు మాట్లాడుతూ తెలియదు, గుర్తులేదు, మర్చిపోయా సినిమా పేరులో గుర్తులేదు ఉంది గానీ సినిమా మాత్రం ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుంది. ఫస్ట్ చిత్రంతోనే ఒక సక్సెస్ ఫుల్ ప్రాజెక్ట్ చేస్తామని నమ్మకంతో ఉన్నాం. అన్నారు. ఈ చిత్రానికి డీవోపీ అభిలాష్ పని చేశారు.




## కింగ్ డామ్ కోసం అమెరికాలో అడ్వాన్స్ బుకింగ్

విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'కింగ్డమ్' యూఎస్ అడ్వాన్స్ టికెట్ బుకింగ్స్‌లో జోరు చూపిస్తోంది. సినిమా రిలీజ్ కు రెండు వారాల ముందుగానే యూఎస్‌లోని 64 లొకేషన్స్‌లో 135 షోస్‌లకు భారీగా అడ్వాన్స్ బుకింగ్స్ జరుగుతున్నాయి. ఇప్పటిదాకా 'కింగ్డమ్' మూవీకి 15 కె (13.63 లక్షల రూపాయల) టికెట్ సేల్స్ జరిగాయి. సినిమా ట్రైలర్ రిలీజ్ కూడా చేయకముందే, ఏ ప్రమోషన్ జరపకముందే 'కింగ్డమ్' సినిమాకు ఈ స్థాయిలో అడ్వాన్స్ బుకింగ్స్ జరగడం ఈ మూవీ మీద ఉన్న క్రేజ్ ను తెలియజేస్తోంది . 'కింగ్డమ్' టీజర్ రిలీజైనప్పటి నుంచే ఈ మూవీ మీద అంచనాలు భారీగా పెరిగాయి.

ఈ చిత్రాన్ని శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్ టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్ పై నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. గౌతమ్ తిన్ననూరి స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీగా రూపొందిస్తున్నారు. భాగ్యశ్రీ భోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. అనిరుధ్ సంగీతాన్ని అందిస్తున్నారు. 'కింగ్డమ్' సినిమా ఈ నెల 31న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.




# నెల్సన్ మండేలా జీవితం, పోరాటం ఆదర్శనీయం

## ఐప్సో రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్



ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ సరలీకరణ విధానాలతో, ప్రజల బతుకులు అస్థిరత్వానికి, అయోమయానికి భయాందోళనలకు గురవుతున్న ఈ పరిస్థితులలో దక్షిణాఫ్రికా జాతిపిత, చీకటి ఖండం నల్ల సూర్యుడు నెల్సన్ మండేలా జీవితం, పోరాటం, ఆదర్శనీయమైనదని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ అన్నారు. నెల్సన్ మండేలా 107వ జయంతిని పురస్కరించుకుని హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని ఐప్సో రాష్ట్ర కార్యాలయంలో మండేలా చిత్రపటానికి కెవిఎల్, ఐప్సో రాష్ట్ర నాయకులు ఎ.రామరాజు, జె.కె.శ్రీనివాస్, సూర్య ప్రకాష్, నరేష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కెవిఎల్ మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం మండేలా చేసిన పోరాటం స్ఫూర్తితో ఈనాటి విద్యార్థి యువత గుండె ధైర్యంతో యుద్ధోన్మాదాన్ని, సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించాలన్నారు. దక్షిణ ఆఫ్రికాలో వలస పాలనలో చీకటి బతుకులతో దారిద్రం, నిరక్షరాస్యత, జాతి అహంకారం లాంటి అనేకమైన సమస్యలతో నిత్యం బాధలను అనుభవించిన నెల్సన్ మండేలా విద్యార్థి దశ నుండి వలస పాలనపై, సామ్రాజ్యవాదంపై కసిని పెంచుకున్నారని, యువతను మేలుకొల్పటానికి ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ స్థాపించటంలో ముఖ్య పాత్ర పోషించారన్నారు. 1962 సంవత్సరం నుండి 90 వరకు జైలు జీవితాన్ని అనుభవించినప్పటికీ చెక్కుచెదరని గుండె నిబ్బరంతో తన దేశ స్వాతంత్రం కోసం, జాతి ప్రజలు అనుభవిస్తున్నటువంటి జీవన పరిస్థితుల మెరుగుపరచడం కోసం, మానవ హక్కుల సాధన కోసం విద్య,వైద్యం, స్వాతంత్రం కోసం పోరాటాలను నిర్వహించారన్నారు. ఐప్సో రాష్ట్ర కార్యదర్శి రామరాజు, జె.కె.శ్రీనివాసులు మాట్లాడుతూ నెల్సన్ మండేలా జీవితం నిరంతరం చైతన్యాన్ని నింపుతుందని, ఆ చైతన్య స్ఫూర్తితో ఈనాడు సమాజ మార్పుకు కృషి చేయాలన్నారు. దక్షిణాఫ్రికా దేశ ప్రజల ప్రగతి కోసం, అంతర్జాతీయ సంబంధాల మెరుగుదల కోసం, శాంతి, న్యాయం, మానవ హక్కుల సాధన కోసం, అహర్నిశలు పోరాడిన నెల్సన్ మండేలా జీవితం ప్రపంచానికి ఆదర్శమన్నారు.

## సహకార సంఘాల ఎన్నికలు
# తక్షణమే నిర్వహించాలి

### వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలోని చేనేత, మత్స్య తదితర సహకార సంఘాల ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని చేతివృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. హైదరాబాద్ హిమాయత్ నగర్ మఖ్దూం భవన్‌లోని రాజ్ బహదూర్ గౌర్ విజ్ఞాన కేంద్రంలో వృత్తి సంఘాల సమాఖ్య సమావేశం శుక్రవారం రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా చేనేత మొదలైన సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించకపోవడంతో సహకార వ్యవస్థ నిర్వీర్యమైపోయిందన్నారు. ప్రపంచీకరణ నేపథ్యంలో ఉపాధి కోల్పోతున్నవారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. వృత్తిదారులకు కుటుంబానికి రూ.10లక్షల వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు మాట్లాడుతూ బిసి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను అమలు చేసి, చేనేత, గీత, మత్స్య, రజక, గొర్రెల కాపరులు, కమ్మరి, కుమ్మరి తదితర వృత్తిదారుల అభివృద్ధికి సంక్షేమానికి చర్యలు చేపట్టాలన్నారు. చేనేత, కల్లు గీత కార్మికులకు ఇస్తున్న విధంగా మిగతా చేతివృత్తుల వారందరికీ 50 సంవత్సరాలకు పెన్షన్ ఇస్తామన్న వాగ్దానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. వృత్తిదారులందరి సమస్యల పరిష్కారం కోసం సంఘటిత కావాలన్నారు. గ్రామస్థాయి నుండి వృత్తి సంఘాల నిర్మాణాన్ని పటిష్టం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పెండెం సర్వేశం, ప్రధానకార్యదర్శి పాసికంటి లక్ష్మి నరసయ్య, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దీటి నరసయ్య, రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, జల్ది రాములు, చేపూరి ధనంజయ, కొలిపాక సంపత్ తదితరులు పాల్గొన్నారు.




## నేటి నుంచి కాచిగూడ-జోధ్‌పూర్ రైలు

### జెండా ఊపి ప్రారంభించనున్న కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, కిషన్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: కాచిగూడ నుంచి జోధ్‌పూర్‌కు వెళ్లే భగత్ కీ కోఠి ఎక్స్‌ప్రెస్ నూతన రైలును నేడు కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, బొగ్గుగనుల మంత్రి కిషన్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ జెండా ఊపి ప్రారంభించనున్నారు. ఇందు కోసం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ప్రారంభోత్సవ ఏర్పాట్లను చేసినట్లు రైల్వే సిపిఆర్‌ఒ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. సాయం త్రం 5.30 గంటలకు ఈ రైలు బయలే దేరుతుందని తెలిపారు. కాచిగూడజోధ్‌పూర్ మధ్య నూతన రోజువారి రైలు సర్వీసు ప్రవేశపెట్టడం వల్ల తెలంగాణలో నివసిస్తున్న రాజస్థానీ ప్రజలకు, ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. రోజువారీ రైలు సర్వీసు కోసం చాలా కాలంగా డిమాండ్ ఉంది. ఈ రైలు తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లోని ముఖ్యమైన స్టేషన్ల మధ్య వేగవంతమైన, సురక్షితమైన, సౌకర్యవంతమైన రైలు ప్రయాణాన్ని అందిస్తుంది. ఈ రైలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ మరియు రాజస్థాన్ రాష్ట్రాలలోని నాందేడ్ వాషిమ్, ఉజ్జయిని, రత్లం, నీమచ్, చిత్తోర్‌గఢ్, భిల్వారా, అజ్మీర్, పాలి మార్వార్ వంటి ప్రధాన న గరాలకు చేరుస్తుంది. రైలు వినియోగదారులు తమ ప్రయాణ ప్రణాళికను ప్లాన్ చేసుకునే అవకాశాన్ని అందిస్తుందని తెలిపారు. ఈనూతన రోజువారీ రైలు రిజర్వ్డ్, అన్ రిజర్వ్డ్ విభాగాల ప్రజల అవసరాలను తీరుస్తు హైదరాబాద్, పరిసర ప్రాంతాలలో నివసిస్తున్న దేశంలోని మధ్య వాయువ్య రాష్ట్రాల ప్రజలు తమ స్వస్థలాలకు ప్రయాణించడానికి ఎక్కువగా ప్రయోజనం చేకూరుస్తుంది. వ్యాపారవేత్తలు, విద్యార్థులు, ఉద్యోగులు, సెలవుల్లో విరివిగా ప్రయాణించేవారికి ప్రత్యేక పర్యటనలకు చేసే వారికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుంది. వాణిజ్యం వాణిజ్య మార్గాలను పెంచడంతో పాటు పర్యాటకం, తీర్థయాత్రలను ప్రోత్సహించడంలో సహాయపడుతుంది.

# కలిస్తే తప్పేంటి?

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర వ్యాఖ్యాలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శుక్రవారం బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో కెటిఆర్ మాట్లాడుతూ మంత్రుల ఫోన్లు ట్యాప్ చేయించడం నిజం కాదా అని ప్రశ్నించారు. చేయడం లేదంటే లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధమా అని ప్రశ్నించారు. తెలంగాణలో నికృష్ట పాలన సాగుతుందని డైవర్షన్ పాలెటిక్స్ చేస్తూ ప్రజలను రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారన్నారు. ఒక రోజు ఫోన్ ట్యాపింగ్ మరో రోజు ఫార్ములా ఈకేస్, మరో రోజు డ్రగ్స్, తర్వాత కాళేశ్వరం లేదంటే కేసిఆర్ అంటూ 20 నెలలుగా తెలంగాణలో రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. తనపై టన్నుల కొద్ది కేసులు పెట్టించారని గుండుపిన్నంతా ఆధారం కూడా దొరక లేదని కెటిఆర్ తెలిపారు. తప్పు చేస్తే ఆధారం దొరుకుతుందని తాను ఏ తప్పు చేయలేదని స్పష్టం చేశారు. దమ్ముంటే లై డిటెక్టర్ పరీక్ష పెట్టమని అడిగిన మొట్టమొదటి రాజకీయ నాయకున్ని తానే అన్నారు. ఓటుకు నోటు కేసులో చర్చించడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి రచ్చ చేయడం తప్ప చర్చ చేయడం తెలియదన్నారు. బసక చర్ల చర్చ గురించి వెళ్లనని వెంటనే మాట మార్చి రేవంత్ రెడ్డి ఢిల్లీ ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు.

ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు పువ్వాడ అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, మాజీ ఎంఎల్‌ఎలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, మాజీ జెడ్పి ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఆర్‌జెసి కృష్ణ, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి :

జిల్లా అభివృద్ధి కేసిఆర్‌తోనే జరిగిందని ఇప్పుడు ముగ్గురు మంత్రులున్నా ఉపయోగం లేదని కెటిఆర్ తెలిపారు. మమత ఆసుపత్రి ఆవరణలో జరిగిన బిఆర్‌ఎస్ నేతల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు, రోడ్లు, సంక్షేమం కేవలం బిఆర్‌ఎస్ హయాంలోనే జరిగిందని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్‌ఎస్ సత్తా చాటాలని అత్యధిక స్థానాల్లో గెలిపించాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

# పూర్తయ్యేనా?

(మొదటి పేజీ తరువాయి)

కాజీపేట అయోధ్యపురంలోని 162 ఎకరాల్లో ఫ్యాక్టరీ నిర్మాణానికి సంబంధించి రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ ఆధ్వ ర్యంలో టెండర్లు పిలిచారు. హైదరాబాద్‌కు చెందిన పవర్ మెక్, జపాన్‌కు చెందిన టైకి షా కంపెనీతో కలిసి పవర్ మెక్ టైకిషా జేవీ పేరుతో రూ.383 కోట్లతో ఫ్యాక్టరీ నిర్మాణ పనులు కాంట్రాక్ట్ దక్కించుకు న్నారు. ఇదిలా ఉండగానే కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ పెరగడంతో పాటు రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీ మేరకు కోచ్ ఫ్యాక్టరీని మంజూరు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం, వామపక్ష పార్టీలు కేంద్రంపై ఒత్తిడి తీసుకొచ్చాయి. దీంతో ఓవర్ హాలింగ్ వర్క్ షాప్‌ను కోచ్ ఫ్యాక్టరీగా అప్ గ్రేడ్ చేస్తున్నట్లు 2023 సెప్టెంబర్‌లో నిర్ణయం వెలువడగా... నవంబర్ 28న రైల్వే అధికారులు అఫీషియల్‌గా ప్రకటించారు. ప్రాజెక్ట్ నిర్మాణ బడ్జెట్‌ను రూ.383 కోట్ల నుంచి రూ.680 కోట్లకు పెంచారు. ప్రతి సంవత్సరం 600 కోచ్‌లు తయారు చేసేలా ఫ్యాక్టరీ నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ కోచ్ లతో పాటు వందే భారత్, జర్మనీ టెక్నా లజీతో కూడిన లింక్ హాఫ్మన్ బుష్ (ఎల్ హెచ్బీ) సబర్మన్ రైళ్లకు ఉపయోగించే ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ (ఈఎంయూ) వంటి కోచ్‌లను తయారు చేయనున్నారు. కోచ్ ఫ్యాక్టరీలకు సంబంధించిన ఉన్నతాధికారులు కాజీపేటకు వచ్చి నిర్మాణ పనులకు సంబంధించి పలు సూచనలు చేశారు. ఫ్యాక్టరీ నిర్మాణం వల్ల ప్రత్యక్షంగా ఆరు వేల మందికి, పరోక్షంగా మరో ఆరు వేలమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి.

### పెండింగులో ఇన్స్టాలేషన్, సివిల్, ఎలక్ట్రికల్ వర్క్స్

కోచ్ల తయారీ ఫ్యాక్టరీలో మెషినరీ ఇన్స్టాలేషన్ తో పాటు సివిల్, ఎలక్ట్రిక్ వర్క్స్ మాత్రమే పెండింగ్లో ఉన్నాయి. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో కూడిన మెషినరీలో 85 శాతం ఇప్పటికే ఫ్యాక్టరీ వద్దకు చేరుకుంది. ఆగస్ట్ నెలలో ఇన్స్టాలేషన్ పనులు మొదలుపెట్టనున్నారు. మరో 20 శాతం సివిల్, ఎలక్ట్రికల్ వర్క్ చేయాల్సి ఉంది. కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి కోచ్ ఫ్యాక్టరీ వరకు వేస్తున్న ట్రాక్ పనులు చివరి దశకు వచ్చాయి. ఇంటర్నల్ రైల్వే లైన్లతోపాటు రోడ్లు, సబ్ స్టేషన్లు, వేబ్రిడ్జిలు, టెస్ట్ షాప్, ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ వంటి ఇతరత్రా నిర్మాణ పనులు మధ్యలో ఉన్నాయి. డిసెంబర్ నాటికి పనులు పూర్తవుతాయని కాంట్రాక్ట్ సంస్థ ప్రతినిధు లు చెబుతున్నారు.

### నేడు పనులను పరిశీలించనున్న రైల్వే మంత్రి

ఈ క్రమంలో పనుల పరిశీలనకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ శనివారం కోచ్ ఫ్యాక్టరీ వద్దకు రానున్నారు. కేంద్ర మంత్రితో పాటు రాష్ట్రానికి చెందిన మరో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి కూడా పర్యటించి పనులు పరిశీలించనున్నట్లు అధికారులు చెబుతున్నారు. వీరి పర్యటన అనంతరం పనులు వేగిరం కాగలవని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రతిపక్ష ఐక్యత

(మొదటి పేజీ తరువాయి)

వివక్షాపూరితంగా దోపిడీకి గురైంది. ఉద్యోగాలు లేని వృద్ధి, వ్యవసాయ సంక్షోభం, శ్రామికుల అసంఘటితీకరణ, ప్రజా సేవలను బలహీనపరచడం, సంక్షేమ కార్యక్రమాలపై దాడి ప్రజల జీవితాలను మరింత దిగజార్చాయి. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాలను కొనసాగిస్తూనే అసమ్మతిని అణచివేస్తుంది. ప్రతిపక్షాన్ని విచ్ఛిన్నం చేస్తుంది' అని సిపిఐ ముసాయిదా రాజకీయ తీర్మానం పేర్కొంది. సమన్వయం లోపించిన ఇండియా కూటమిః సమన్వయం లేకపోవడం, సైద్ధాంతిక స్పష్టత లేకపోవడం, సమర్థవంతమైన సీట్ల పంపకం లేకపోవడం ఇండియా కూటమి పనితీరుకు ఆటంకం కలిగించిందని ముసాయిదా రాజకీయ తీర్మానం తెలిపింది. 'ఈ కూటమి దాని ప్రభావాన్ని పరిమితం చేసే అనేక అడ్డంకులను ఎదుర్కొంది. సీట్ల పంపకం చర్చలు అత్యంత స్పష్టమైన, నిరంతర వివాదాంశం. అనేక భాగస్వామ్య పక్షాలు, తమ ప్రాంతీయ క్షేత్రాలను, నాయకత్వ ఆశయాలను రక్షించుకుంటూ, సాగదీస్తూ, కొన్నిసార్లు తీవ్రమైన బేరసారాలు చేశాయి. ఇది తరచుగా అతుకుల బొంత వంటి ఏర్పాట్లకు దారితీసింది. ఇది సజావుగా, సమన్వయంతో కూడిన ప్రచారానికి ఆటంకం కలిగించిందని' సిపిఐ ముసాయిదా రాజకీయ తీర్మానం పేర్కొంది. సీట్ల పంపకానికి మించి, సమర్థవంతమైన ప్రచార వ్యూహాలు, సందేశాలు, వనరుల విస్తరణను సమన్వయం చేయడంలో విఫలమైన సమన్వయ యంత్రాంగాల లోపం కారణంగా ఇండియా కూటమి దెబ్బతిన్నదని తెలిపింది. 'అనేక పార్టీలు కొన్ని ప్రాంతాలలో స్వతంత్రంగా లేదా పరస్పర పోటాపోటీగా పనిచేయడాన్ని కొనసాగించాయి. ఐక్యత అందించగల సమిష్టి బలాన్ని బలహీనపరిచింది' అని పేర్కొంది. సైద్ధాంతిక సమన్వయం లేకపోవడంతో కూటమి ఇబ్బందిపడిందని తెలిపింది. 'మన రాజ్యాంగ దృష్టికి విరుద్ధంగా ఉన్న బిజెపి నిరంకుశత్వం, మతతత్వ ఎజెండాకు వ్యతిరేకతను సభ్యులందరూ పంచుకున్నప్పటికీ, వారి రాజకీయ , సామాజిక,ఆర్థిక దృష్టి విస్తృతంగా వైవిధ్యంగా ఉంది. ఈ సైద్ధాంతిక అస్థిరత బిజెపి వ్యతిరేక భావనకు మించి విస్తృత విశ్వాసాన్ని ప్రేరేపించగల ఏకీకృత విధాన ఎజెండాను ప్రదర్శించడం సవాలుగా మారింది. భవిష్యత్తులో, ఈ అనుభవం నుండి పాఠాలు నేర్చుకోవాలి, కనీస ఉమ్మడి కార్యక్రమం ద్వారా ప్రతిపక్ష ఐక్యతను సాధించేందుక ప్రయత్నం చేయాలని' సూచించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com